# శ్రీవేంకటేశ్వర సుప్రభాతం

*(సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం)*

సరళ తెలుగు వ్యాఖ్యానం


తెలుగు అనువాదం

**డా॥ వి.వి.వేంకటరమణ**

ఆంగ్ల మూలం

**వి.యస్.వేంకటనారాయణ**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2017**

**SRI VENKATESWARA SUPRABHATAM**

(Suprabhatam, Stotram, Prapatti & Mangalasasanam-Sarala Telugu Vyakhyanam)

***Telugu Translation***
**Dr. V.V.Venkata Ramana**

***English Original***
**Sri. V.S.Venkata Narayana**

T.T.D. Religious Publications Series No. 1255
© All Rights Reserved
*First Print:- 2017*

*Copies:* 1000

*Published by*
**Sri ANIL KUMAR SINGHAL** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507

# ముందుమాట

"కలౌ వేంకటనాయకః" అని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఒక ప్రసిద్ధి వుంది. అంటే ఈ కలియుగంలో భక్తులందరికీ అన్ని కోరికలను తీర్చగల దైవం వేంకటేశ్వరుడే అని అర్థం. ఇది ముమ్మాటికీ నిజం. అందుకే అన్నమాచార్యులు కూడ

**"ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను**
**ఏమరక కొలచిన నితడే దైవము"**

అని శ్రీనివాసుని దయాళుత్వాన్ని కొనియాడినాడు.

ఇలా పిలిస్తే అలా పలికే ప్రత్యక్షదైవమైన తిరుమలేశుని ఆలయం ప్రతిరోజు తెల్లవారుజామున 'సుప్రభాతసేవ'తో తెరవబడుతుంది.

**"కౌసల్యా సుప్రజా రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్"**

అంటూ ప్రతిరోజు వేకువజామున సుప్రభాత పఠనంతో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి మేల్కొల్పులు పాడించుకుంటున్నాడు. సుప్రభాతసేవతో ప్రారంభమైన శ్రీవారి ఆలయంలోని కార్యక్రమాలు, మళ్లీ రాత్రి ఏకాంతసేవతో పూర్తి అవుతాయి.


ఇలా ఆలయం తెరచినప్పటినుంచి శ్రీవేంకటేశ్వరస్వామి వారికి జరిగే ఎన్నో సేవలలో "సుప్రభాతసేవ" మాత్రం భక్త లోకంలో ఎంతో విశిష్టతను విస్తృత ప్రచారాన్ని సంతరించుకొంది.

సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం... ఇలా వివిధ శ్లోకాలతో మొత్తం డెబ్బయి శ్లోకాల ఈ సుప్రభాతాన్ని ప్రముఖ వైష్ణవాచార్యులు, ప్రసిద్ధ

పండిత వరేణ్యులయిన ప్రతివాదిభయంకర అణ్ణంగరాచార్యులు అనువారు రచించినారు. ఈ సుప్రభాతస్తవానికి ఎన లేని కీర్తి ఏర్పడింది.

తిరుమలలో నిత్యమూ పఠింపబడుతున్న ఈ శ్రీవేంకటేశ్వర సుప్రభాతాన్ని ప్రస్తుతం డా॥ వి.వి.వెంకటరమణగారు తెలుగులో సరళంగా వివరించారు. దీన్ని భక్తులందరు అర్థం చేసుకొని సుప్రభాతాన్ని పారాయణం చేస్తే బాగుంటుందని, దేవస్థానం ప్రచురణగా అందిస్తున్నాం. పాఠకులు దీన్ని వినియోగించుకోగలరని ఆకాంక్షిస్తూ...

*సదా శ్రీవారి సేవలో....*



**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# నివేదన

**సముద్రాల లక్ష్మణయ్య**
మాజీ కార్యదర్శి ధర్మ ప్రచార పరిషత్
స్పెషలాఫీసర్, ప్రచురణల విభాగం
తి.తి.దేవస్థానములు, తిరుపతి

భగవంతుడు స్తుతి ప్రియుడు. తన్ను స్తుతించిన భక్తులను అనుగ్రహిస్తాడు. వేదం 'అగ్ని మీళే పురోహితం' అని అగ్నిదేవుని స్తోత్రంతోనే ప్రారంభమయింది. పురాణాలలో, కావ్యాలలో, తదితరమైన సాహిత్యంలో కూడా వివిధ దేవతల స్తోత్రాలు లభిస్తున్నాయి.

స్తోత్రానికి మూలం భక్తి. భక్తుడు భగవంతుని వివిధ పద్ధతుల్లో స్తుతించి ఆ దేవుని కృపకు పాత్రుడవుతాడు. భక్తి తొమ్మిది విధాలు అని భాగవతం చెప్పింది. అందులో 'కీర్తనం' అనేది ఒకటి. భగవత్సంకీర్తన రూపమైన వాఙ్మయం అతి విశాలమై, భగవంతునికీ, భక్తులకూ అనుసంధానంగా అలరారుతున్నది.

స్తోత్ర సాహిత్యంలో సుప్రభాతం అనేది కూడా ఒక ప్రక్రియ. భగవంతుణ్ణి మేలుకొలిపే విధానంతో భక్తుడు ఆ పరమాత్ముని దివ్యగుణాలనూ, భవ్యకర్మలనూ, పవిత్ర నామాలనూ కీర్తిస్తాడు. అనేక దేవతలకు వివిధ దేవాలయాలలో సుప్రభాతం పఠించడాన్ని నేడు వింటున్నాము. కానీ సుప్రభాతం అనగానే మన చిత్తంలో స్ఫురించేది శ్రీవేంకటేశ్వర సుప్రభాతమే. శ్రీవేంకటేశ్వరస్వామి నేడు కోట్లాది భక్తులకు ఆరాధనీయుడైయున్నాడు. నిత్యమూ నిద్రనుండి మేలుకోగానే లక్షలకొలది భక్తులు శ్రీవేంకటేశ్వర సుప్రభాత శ్రవణంతో తమ దైనందిన కార్యక్రమాన్ని

ప్రారంభిస్తున్నారు. శ్రీవేంకటేశ్వర సుప్రభాతం వెలువడిన తరువాత ఆ వరవడిలో వందలకొలది సుప్రభాతాలు వెలువడ్డాయి. కానీ నాటికీ, నేటికీ శ్రీవేంకటేశ్వర సుప్రభాతానికి గల ప్రశస్తి మరొక రచనకు లేదు. ఈ సుప్రభాతం రచించిన మహనీయుడు శ్రీ ప్రతివాది భయంకర అణ్ణన్. ఏ శుభలగ్నంలో ఈ రచనకు ఆయన శ్రీకారం చుట్టాడో కానీ, ఆయన కృతి విశ్వవ్యాప్తమై అజరామరమైన కీర్తికి భాజనమయింది.

శ్రీవేంకటేశ్వరస్తుతిగా రూపొందిన ఈ సుప్రభాతంలో 29 శ్లోకాల సుప్రభాతంతో పాటు 11 శ్లోకాల స్తోత్రం, 16 శ్లోకాల ప్రపత్తి, 14 శ్లోకాల మంగళాశాసనం సమకూర్చబడింది. అందుచేత ఈ రచనలోని మొత్తం శ్లోకాలు డెబ్బది. సుప్రభాతంతో సహా ఈ భాగాలన్నీ నిత్యం పఠింపబడుతూ అనల్ప ప్రచారం పొందాయి. శ్రీ వేంకటేశ్వరాలయంలో ఈ సుప్రభాత పఠనంతోనే నిత్య కార్యక్రమం ప్రారంభమవుతున్నది. ఒక్క ధనుర్మాసంలో మాత్రమే గోదాదేవి అనుగ్రహించిన తిరుప్పావైని సుప్రభాతానికి మారుగా పఠించడం సంప్రదాయమయింది.

ఈ సుప్రభాతంలోని మొదటి శ్లోకం వాల్మీకి రామాయణంలోనిది. విశ్వామిత్రుడు శ్రీరాముణ్ణి నిద్రనుండి మేలుకొల్పే ఘట్టంలో ఈ శ్లోకం ఉంది. మహావిష్ణువే శ్రీరాముడుగా అవతరించాడు. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడుగా అర్చావతారం దాల్చింది కూడా ఆ దేవాధిదేవుడే. అందువల్ల సుప్రభాతకర్త వేద సదృశమైన వాల్మీకి కృతినుండి ఈ శ్లోకాన్ని పరిగ్రహించి తన రచనకు ముందు నిబద్ధం కావించాడు.

మానవుడై అవతరించిన శ్రీరామచంద్రుడు నిద్రిస్తుండగా "ఉత్తిష్ఠ" అని విశ్వామిత్రుడు ఆయనను మేల్కొల్పడం సముచితమే. కానీ



అర్చారూపంలో ఉన్న శ్రీనివాసుణ్ణి మానవులమైన మనం మేల్కొల్పడం తగునా? అని కొందరు సందేహించవచ్చు. జీవుని చేత మేల్కొల్పబడవలసిన స్థితిలో దేవుడు లేడు. పైగా ఆ దేవదేవుడే శ్రీకృష్ణావతారంలో – 'క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వో త్తిష్ఠ! పరంతప!' (గీత) అని నరుణ్ణి నిమిత్తంగా చేసుకొనినాడు. కురుక్షేత్రంలో మొత్తం నరజాతిని 'అజ్ఞాన నిద్రనుండి మేలుకోండి!' అని మేలుకొల్పినాడు. "ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ నిభోధత" అని శ్రుతి కూడా అదే ప్రబోధించింది.

అందువల్ల, శ్రీ వేంకటేశ్వరస్వామిని మనం సుప్రభాత గీతలో మేల్కొల్పడం ఆ దేవుని ఆరాధనా విధానంలో ఒక ప్రక్రియే కానీ మరేమీ కాదని భక్తులు గ్రహించాలి. భగవంతుణ్ణి మేల్కొల్పడం అన్న వ్యాజంతో భక్తులు నిత్యమూ ప్రాతఃకాలాన ఆ పరమాత్ముని గుణకర్మ నామాలను కీర్తించడమే జరుగుతున్నది. మానవుల పాపపరిహారానికి భగవత్కీర్తనం తగిన ఉపాయమని భాగవతం – "ఏతావత్యాల మఘ నిర్హరణాయ పుంసాం యత్కీర్తనం భగవతో గుణకర్మ నామ్నామ్!" అని బోధించింది.

ఈ సుప్రభాతానికి వ్యాఖ్యానం చేసిన కీర్తిశేషులు శ్రీవి.యస్. వేంకటనారాయణగారి గూర్చి రెండుమాటలు చెప్పాలి. వారు విద్యాధికులు, సంస్కార సంపన్నులు, ఎందరికో విద్యను ప్రసాదించిన ఆచార్యులు. అనల్ప ప్రచారం పొందిన సుప్రభాతాన్ని వ్యాఖ్యానిస్తే, భక్తులు అందలి అర్థగౌరవాన్ని గుర్తించి పఠనకాలంలో భగవద్వైభవాన్ని చక్కగా భావించి ధన్యులు కాగలరన్న దృష్టితో వారు ఈ వ్యాఖ్య వ్రాశారు. వారి వ్యాఖ్యానం ఆంగ్లంలో కొనసాగింది. నేడు ఆంగ్లభాష ప్రపంచస్థాయిలో అత్యధికంగా విస్తరించి అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ప్రాంతీయభాషలోని వ్యాఖ్య ఆ ప్రాంతానికి మాత్రమే

పరిమితమవుతుంది. అంతర్జాతీయ భాషలో అయితే లోకమంతా ఆదరిస్తుందన్న సత్యాన్ని గుర్తించి శ్రీవేంకటనారాయణగారు ఆంగ్లంలో ఈ వ్యాఖ్యానాన్ని రచించారు.

వివరణ, రచించిన తీరు అత్యంత శ్లాఘనీయం. ఒక శ్లోకానికి మరొక శ్లోకంతో గల భావానుబంధం, విష్ణు వక్షఃస్థలంలో ఉన్న లక్ష్మీదేవిని కీర్తించవలసిన ఆవశ్యకత, అత్రి మున్నగు సప్తర్షుల ప్రాముఖ్యం, సప్తగిరుల పేర్లకుగల ప్రాశస్త్యం, బ్రహ్మాది దేవతలు వేంకటేశ్వరుణ్ణి ఆరాధించే విధానం, ప్రాతఃకాలంలోని ప్రకృతి శోభ, పుష్కరిణీస్నాన ప్రశస్తి, భగవదవతారాలు, భగవంతుని దివ్యసౌందర్యం, భగవన్నామ సంకీర్తనావైభవం, సుప్రభాత పఠన ప్రయోజనం – ఇత్యాదిగాగల విశేషాలనన్నిటినీ వ్యాఖ్యాత అవసరమైనంత మేరకు వివరించారు. ఎడనెడా ప్రామాణిక శ్లోకాలను గూడా ఉదాహరించి వ్యాఖ్య విలువను పెంచారు. అట్లే, స్తోత్ర భాగంలో కూడా తత్త్వార్థాలను విశ్లేషించారు. ప్రపత్తిలో శరణాగతికి గల ప్రాముఖ్యాన్ని విశదీకరించారు. భక్తికంటే గూడా ఈ యుగంలో శరణాగతి సులభమైన తరుణోపాయమన్న విషయం సువిదితమే. ఇక మంగళాశాసనంలోని ఔచిత్యాన్ని గూడా అత్యద్భుతంగా ప్రతిపాదించారు.

ఈ విధంగా శ్రీ వేంకటనారాయణగారు సుప్రభాతానికి ఆంగ్లంలో రూపొందించిన వ్యాఖ్య అన్నివిధాలా ప్రశస్తమై భక్తుల, సహృదయుల ఆదరణకు పాత్రమయింది. ఈ వ్యాఖ్యానాన్ని ఆంధ్ర పాఠకులకు అందించాలనే సత్ సంకల్పం వారి కనిష్ఠపుత్రులు డా.వేంకటరమణగారికి కల్గడం ముదావహం. అటు భగవద్భక్తి, ఇటు పితృభక్తి–ద్వివిధ భక్తులూ ప్రేరణ చేయగా మీరు శిష్టవ్యావహారికమైన తెలుగులో ఈ వ్యాఖ్యానాన్ని అనువదించి



కృతకృత్యులయ్యారు. 'కృత కృత్యుడు' అంటే "చేయదగినపని చేసినవాడు" అని అర్థం. మరి తండ్రిగారి భక్తిమయమైన రచనను వేలకొలది తెలుగు పాఠకులకు అందించే పనికంటే చేయదగిన మరొకపని ఏమున్నది? అలాటి పనిచేసి కృతార్థుడైన డా.వేంకటరమణగారు అభినందనీయులు.

శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాతం మూలవ్యాఖ్యానకర్తనూ, అనువాదకర్తనూ, ఈ వ్యాఖ్యానంతోపాటు సుప్రభాతం పఠించే భక్తులనూ – అందరినీ తన దివ్యకరుణా కటాక్షాలతో అనుగ్రహించుగాక!

**సముద్రాల లక్ష్మణయ్య**

# నా మాట

శ్రీవేంకటేశుని అనుజ్ఞతో 1976-77 ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థాన మాసపత్రిక సప్తగిరి ఆంగ్ల మాసపత్రికలో ధారావాహికంగా మా నాన్న శ్రీ వి.యస్.వేంకటనారాయణగారు వ్రాసిన “ఎ కామెంటరీ ఆన్ శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి అండ్ మంగళాశాసనం” అన్న రచనకు నేను చేసిన సరళమైన ఆంధ్రానువాదం ఈ గ్రంథం. శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ ఏమీ వ్రాయలేదే అన్న నా కొరతను తీర్చడానికే అన్నట్టు, శ్రీవేంకటేశ్వరుడు తన దివ్యకథను ‘శ్రీనివాసం’ అనే పద్యగాన రచనగా నాచేత వ్రాయించాడు. మా తండ్రిగారి ఆశీర్వాదంతో బాటు, స్వామి అనుగ్రహమూ తోడైందా అన్నట్లు, శ్రీనివాసం వెలువడగానే మా నాన్నగారు వ్రాసిన ఆంగ్ల వ్యాఖ్యానాన్ని సరళమైన తెలుగులో వ్రాయడం, అది ఎలాంటి అడ్డంకి లేకుండా, సునాయాసంగా పూర్తి కావడం నాకెంతో శక్తినీ, తృప్తినీ, ఆనందాన్ని ఇచ్చింది.


కోరినంతనే కాదనకుండా శ్రీసముద్రాల లక్ష్మణయ్యగారు, తమ అభిప్రాయాలను, సూచనలను అందించారు.

తిరుమల, తిరుపతి దేవస్థానం ఈ పుస్తక ప్రచురణకు పదేళ్లకు పూర్వం ఆర్థిక సహాయాన్నివ్వడమేగాక ప్రస్తుతం దేవస్థానం స్వీయ ప్రచురణగా వెలువరించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

ఈ తెలుగు అనువాదాన్ని ఆ కొండలరాయునికే సభక్తి పూర్వకంగా సమర్పిస్తున్నాను. ఈ రచనాకాలంలో పూర్తిగా నాకు అండగా నిలిచినవారూ, ప్రచురణలో తోడ్పడ్డవారూ ఎందరో! అందరూ నాకు ఆప్తులే. ఎవరినీ విస్మరించలేను. అందరికీ శ్రీవేంకటేశ్వరుని కృప కల్గుగాక!!

**- వఝల వేంకటనారాయణ వేంకటరమణ**





# ప్రస్తావన

శ్రీవేంకటేశ్వరుడు కలియుగ ప్రత్యక్షదైవం. ఈ దేవదేవునికి శ్రీనివాసుడనీ, బాలాజీ అనీ, వెంకన్న అనీ – ఇలా ఎన్నో నామాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని తిరుమల కొండపై వెలిశాడు శ్రీ వేంకటేశ్వరుడు. ఈ తిరుమలక్షేత్రం దిగువ తిరుపతిలోని అలిపిరి నుంచి ఆరుమైళ్ల దూరంలో ఉంది. చంద్రగిరి నుంచి కూడా అంతే దూరంలో ఉంది. ఈ తిరుమల కొండ – సముద్రమట్టం నుంచి దాదాపు 2880 అడుగుల ఎత్తులో ఉంది. నిజానికి ఇది ఏడు కొండల సముదాయం. ఆ సముదాయంలో ఏడవ కొండే శేషాద్రి. ఆ శేషాద్రిశిఖరాన కొలువై ఉన్నాడు శ్రీవేంకటేశ్వరుడు. ఈ కొండ మేరుపర్వతమనీ, ఇది వాయుదేవునకూ పదివేలతలల ఆదిశేషునికీ మధ్య జరిగిన బల ప్రదర్శనకు తార్కాణమనీ పురాణాలు చెబుతాయి.

శేషాద్రి శిఖరాన వెలసిన ఈ దేవదేవుడు సాక్షాత్తు పరమశివుని అవతారమని కొందరంటే, సుబ్రహ్మణ్యస్వామే ఈ రూపంలో వెలిశాడని మరి కొందరు నమ్ముతారు. కొందరు శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తు “బాలాత్రిపురసుందరి” అవతారం అంటారు. శివుడైనా, విష్ణువైనా దేవుడనే వాడు ఒక్కడే అనే నమ్మకం, భావనా అందరిలో కలగడానికే ఆ దేవదేవుడు ఈ అభిప్రాయాలను కలిగించాడు. ఆ దివ్యమంగళ విగ్రహం అలా నిలబడే ఉండటం చూస్తే, “భక్తులను రక్షించడానికే నేను ఇక్కడ వెలిశాను, రా! నన్ను కొలువు. నిన్ను కాపాడతాను” అనే భావనే అందరికీ కలుగుతుంది. అందుకే ఆగమ శాస్త్రాలు ఈ దివ్యస్వరూపాన్ని ధ్రువ బేరమని వర్ణించాయి. పురాణాల్లో ప్రవచించినట్లు, ఈ బ్రహ్మాండంలో శ్రీ వేంకటాద్రిని మించిన క్షేత్రం లేదు, శ్రీవేంకటేశ్వరుని మించిన దైవం లేదు. భూత భవిష్యత్

వర్తమానాలకూ ఈ విషయం వర్తిస్తుంది. కలియుగంలో భగవన్నామ సంకీర్తన మొక్కటే మనలను ఈ భవసాగరాన్ని దాటించగలదు. దయగల హృదయమే భగవన్నివాసం. భగవన్నామ సంకీర్తనే తరణోపాయం. ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ యుగదైవాన్ని స్మరిస్తే చాలు. అన్ని పాపాలూ, కష్టాలూ తొలగిపోయి మనం తరించగలం. కలియుగదైవాన్ని నమ్మిన వారికి ఎలాటి ఆపదా కలగదు.

నేడు ప్రపంచంలో కులమతాలకు అతీతంగా పూజలందుకొంటున్న ఒక్కగా నొక్క దైవం, కలియుగ ప్రత్యక్షదైవం–శ్రీవేంకటేశ్వరుడు. శ్రీవారి ఆలయంలో నిత్యం ప్రాతఃకాలంలో సుప్రభాతసేవతో కార్యక్రమాలు మొదలవుతాయి. సుప్రభాతసేవ అనేది శ్రీవేంకటేశుని మేలుకొలుపు. శ్రీవేంకటేశ్వర సుప్రభాతంతోనే హిందువుల గృహాలెన్నింటిలోనో దైనందిన కార్యక్రమాలు మొదలవుతాయంటే అతిశయోక్తి కాదు. ప్రతి భక్తుని మదిలో నిత్యమూ మెదిలేది శ్రీవేంకటేశుని సుప్రభాత సేవే. అసలు స్వామి పేరు వింటేనే చాలు. మది పులకరిస్తుంది. ఇక సుప్రభాతం వింటే, మరిక చెప్పాలా!

శ్రీవేంకటేశ్వర సుప్రభాతం నాలుగు భాగాలు. అవి 1. మేలుకొలుపు లేదా సుప్రభాతం 2. శ్రీవేంకటేశ్వరుని స్తుతి లేదా స్తోత్రం 3. శ్రీ వేంకటేశ శరణాగతి లేదా ప్రపత్తి 4. మంగళం లేదా మంగళాశాసనం. ఈ శ్రీవేంకటేశ్వర సుప్రభాతాన్ని శ్రీవారి భక్తుడైన ప్రతివాది భయంకర అణ్ణన్ రచించారు. ఎంతో భక్తితో అణ్ణన్ వ్రాసిన ఈ శ్రీవేంకటేశ్వర సుప్రభాతాన్ని సవివరంగా తెలుసుకొందాం.



# శ్రీ వేంకటేశ సుప్రభాతం

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీవేంకటేశ్వరుడు ఏపేరుతో పిలిచినా ఒక్కటే. దేవుడొక్కడే. ఇదే విషయాన్ని ఎన్నో పురాణాలు అభివర్ణించాయి కూడా. చెప్పాలంటే, ఆదిత్య పురాణం మహావిష్ణువుగా, స్కాంద పురాణంలో సుబ్రహ్మణ్యేశ్వరునిగా, మార్కండేయపురాణం సుబ్రహ్మణ్యాత్మక విష్ణువుగా శ్రీవేంకటేశ్వరుని వర్ణించాయి. ఆదిత్య, స్కాందపురాణాలు చెప్పేదొక్కటే. “కలౌ వేంకట నాయకః!” – అంటే, ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడే ఆ దేవదేవుడు. ఈ విషయాన్ని మనకు గుర్తు చేస్తూ సుప్రభాతం మొదలవుతుంది. అంతేకాదు. కౌసల్యా తనయుడైన శ్రీరామచంద్రుడే శ్రీవేంకటేశ్వరుడని మనకు గుర్తు చేస్తూ, సుప్రభాతం ఆరంభమవుతుంది.

**1. కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్ ॥**

“పుణ్యమాత కౌసల్యకు తనయుడవైన ఓ శ్రీరామా! సర్వశ్రేష్ఠుడా! తూర్పున భానుడు ఉదయించాడు. దైనందిన దైవ కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించాలి కదా! కాబట్టి ఓ పురుషోత్తమా నిద్ర లే.”

పురాణ పురుషుడైన ఆ సర్వోత్తముడిని మునిశ్రేష్ఠులెందరో కీర్తించారు. మనందరినీ ఆదుకొని, రక్షిస్తూ, కోరిన కోర్కెలు తీరుస్తున్న ఆర్తజనరక్షకుడు శ్రీవేంకటేశ్వరుడు. శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ సప్తర్షులు శరణాగతి స్తోత్రాలు చేశారు కూడా. విశ్వామిత్ర మహర్షి శ్రీవేంకటేశ్వరుడు శ్రీమహావిష్ణువని కీర్తించాడు.

శ్రీరాముడైనా, శ్రీవేంకటేశ్వరుడైనా సాక్షాత్తూ శ్రీమహావిష్ణు అవతారమూర్తే అని ప్రవచిస్తూ విశ్వామిత్రమహర్షి తన శరణాగతి స్తోత్రంలో శ్రీవేంకటేశ్వరుని ఇలా కీర్తించాడు :

"విరాడ్విష్ణుర్విధాతా చ విశ్వ విజ్ఞానవిగ్రహః
విశ్వామిత్రస్య శరణం వేంకటేశో విభుస్సదా॥"

"ఓ శ్రీ వేంకటేశా! ఓ విశ్వరూపా! విశ్వానికి ఆదీ, అంతమూ అయిన విశ్వవిధాతవైన ఓ పరంబ్రహ్మా! విశ్వామిత్రుడైన నేను నిన్ను శరణు వేడుతున్నాను."

అందువల్ల శ్రీవేంకటేశ్వరుని సుప్రభాతాన్ని 'కౌసల్యా సుప్రజా రామ' అనే శ్లోకంతో ఆరంభించడం ఎంతో సముచితంగా ఉంది.

ఈ సుప్రభాత ఆరంభ శ్లోకంలో శ్రీవేంకటేశ్వరుని కౌసల్యా తనయునిగా చెప్పడం జరిగింది. కౌసల్య ఎంతో పుణ్యం చేసుకొంది కాబట్టే, సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరామునికి తల్లి కాగలిగింది. అందువల్ల ఆ పుణ్యమాత పేరు కూడా మహిమాన్వితం అయింది. ప్రాతఃకాలంలో భాగవత స్మరణ చేయడానికి కూడా మనం ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి. శ్రీరాముడినే తన గర్భంలో దాల్చిన కౌసల్యాదేవిని మించిన పుణ్యశీలురు ఎవ్వరుంటారీ భువిలో? ఇక్కడ మరో విషయాన్ని కూడా మనం గమనించాలి. శ్రీరాముని పేరును మనం 'రామ' అని ఉచ్చరిస్తాం. అలా మనం ఉచ్చరించే ఆ 'రామ' నామంలో శివ, కేశవ నామాల శక్తి ఇమిడి ఉన్నది. తొలి అక్షరం 'రా' అనేది "ఓం నమో నారాయణాయ" అనే మంత్ర శక్తినీ, రెండో అక్షరం 'మ' అనే అక్షరం "ఓం నమ శ్శివాయ" అనే మంత్ర శక్తినీ కలిగి ఉంది. అంటే స్థితి, లయ అనే రెండు శక్తులు 'రామ' నామంలో ఉన్నాయి. మహాభక్తుడైన త్యాగయ్య శ్రీరాముని ఆ రీతినే కీర్తించి ధన్యజీవి అయ్యాడు. మరి ఆ మహాదేవునికి నిత్యకృత్యాలు చేయడానికి సమయాతీతమవుతున్నదని మనం సుప్రభాతంలో చెప్పడం ఏమిటనే సందేహం రావచ్చు. నిజానికి దైవానికి అలాటి అవసరం లేదు. అది కేవలం



'లోకసంగ్రహ' విషయం. సకలజనులు ఆచరించాలని ఇక్కడ నిగూఢంగా చెప్పడం జరిగింది.

భగవంతుడైన కృష్ణుని లోకసంగ్రహానికి అత్యుత్తమ ఉదాహరణగా చెప్పవచ్చు శ్రీకృష్ణావతారంలో కృష్ణుడు అర్జునుడికి "కర్మలను చిత్తశుద్ధితో, ఫలాపేక్ష లేకుండా ఆచరించు" అని చెప్పాడు. మానవుడు కర్మలు ఎలా చేయాలో ఆచరించి చూపాడు. గనకే 'లోకసంగ్రహా'నికి ఉదాహరణగా శ్రీకృష్ణుని గురించి చెప్పటం ఎంతైనా సమంజసం. భగవద్గీత 3వ అధ్యాయంలో 22వ శ్లోకంలో శ్రీకృష్ణ భగవానుడు ఈ ముల్లోకాల్లో తాను పొందేదీ నష్టపోయేదీ ఏమీలేదనీ, సమస్త కర్మలను ఆచరిస్తున్నది తానేననీ ఇలా చెప్పాడు : "పార్థా! ఈ ముల్లోకాల్లోనూ నేను పొందాల్సింది గానీ, పొందనిది గానీ ఏదీలేదు. అందువల్ల నాకు కర్తవ్యం అనేదేమీ లేదు. ఐనా సరే, నేను మీ అందరిలాగానే లోక వ్యవహారాన్ని నిర్వర్తిస్తున్నాను." ఇలా స్వామి లోకసంగ్రహ కర్మకు తననే ఒక ఉదాహరణగా మనకు చూపించాడు.

అంతేకాదు. ఆ తర్వాతి శ్లోకాల్లో (23,24,25) ఇలా అన్నాడు. "పార్థా! ఏ ఒకసారైనా నేను కొంచెం సోమరినై, కర్మ చేయకపోతే లోకమంతా నా మార్గాన్నే అనుసరిస్తారు. కాబట్టి నేను కర్మాచరణ విరమిస్తే, ఈ లోకంలో అందరూ అదే దారిలో వెళ్లి చెడిపోతారు. వారు కర్మభ్రష్టులై పతనమవడానికి నేను కారకుడ నవుతాను. అందువల్ల జ్ఞాని అనేవాడు లోక సంగ్రహానికై ఆసక్తి లేకుండా కర్మల నాచరించాలి" – అంటూ, ఆ తర్వాతి శ్లోకంలో ఇంకా ఇలా చెప్పాడు. "ఒకవేళ నేను గనక ఆ కర్మలను చేయలేకపోతే, ఇతరులెవరైతే నన్ను అనుసరిస్తారో, వారు కూడా చేయరు. ఫలితంగా వారు పతనమైపోతారు". అందువల్ల లోకానికి మార్గ దర్శకంగా ఉండాలంటే తాను ఆ కర్మలను ఆచరించి చూపాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. అందుకే, ఈ

సుప్రభాతపు తొలి శ్లోకంలో "ఓ దేవదేవా! నిత్య కర్మల నాచరించే సమయమైంది, నిద్ర లెమ్మ"ని చెప్పడం జరిగింది. అదే విశ్వామిత్ర మహర్షి కూడా చెప్పాడు. అందుకే మన శాస్త్రాలలో మనమందరం నిత్యం పవిత్ర కర్మలను త్రిసంధ్యలలో చేయాల్సిన ఆవశ్యకతను చెప్పారు.

**2. ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ ।**
**ఉత్తిష్ఠ కమలాకాంత త్రైలోక్యం మంగళం కురు ॥**

"ఓ గోవిందా! నిద్ర మేలుకో. ఓ గరుడధ్వజా! నిద్రలే. ఓ కమలాపతీ! వేగమే నిద్ర లేవయ్యా. మేలుకొని ముల్లోకాలకూ శుభాన్నివ్వు."

ఈ శ్లోకంలో గోవిందుడైన భగవంతునికి భక్తుడు విన్నపాలు చేస్తున్నాడు. శ్రీరామావతారంలో బల, అతిబల శక్తులతో కూడిన శ్రీరాముడు దుష్టశిక్షణ ఎలా చేశాడో అందరికీ తెలుసు. శ్రీరాముడెంత భక్తవత్సలుడో, ఎంతటి ఆశ్రితజన రక్షకుడో, ఎంతటి శత్రు భయంకరుడో కూడా అందరికీ తెలుసు. అలాటి దేవునికి ధ్వజం వేరే ఏదో కాదు. గరుడ ధ్వజం. వినతాపుత్రుడైన గరుడుడు శ్రీహరికి ఉత్తమమైన వాహనం. ఇంద్రుని వజ్రాయుధం సైతం గరుడుడి ఈకకున్న శక్తిని తట్టుకోలేక పోయింది. అంతటి శక్తిసంపన్నుడే మహావిష్ణువుకు వాహనమూ, పతాక చిహ్నమూ కూడా. అయితే కేవలం గరుడధ్వజం ఉన్నంతమాత్రాన్నే శ్రీమహావిష్ణువు 'పూర్తి' శక్తిమంతుడు కాడు. ఆయన భాగస్వామి 'శ్రీ' లేదా కమల, శ్రీమహాలక్ష్మి తోడుగా నిలిచి విష్ణుభక్తులను బ్రోచే మహత్తరశక్తిగా అవతరించింది. ఆమెతోబాటు విష్ణువునూ కీర్తిస్తూ, నిద్ర లెమ్మని ప్రార్థిస్తూ, ముల్లోకాలనూ ఆశీర్వదించి, శుభాల నివ్వమని భక్తుడు ఈ శ్లోకంలో వేడుకొంటున్నాడు.

**3. మాత స్సమస్తజగతాం మధుకైటభారేః**
**వక్షో విహారిణి మనోహర దివ్యమూర్తే ।**



**శ్రీస్వామిని శ్రితజన ప్రియదాన శీలే**
**శ్రీ వేంకటేశ దయితే తవ సుప్రభాతమ్ ॥**

"అమ్మా! జగన్మాతా! శ్రీమహావిష్ణువక్షఃస్థల నివాసినీ, సుమనోహరీ, మధుకైటభులనే రాక్షసులకు శత్రువైన శ్రీమహావిష్ణువుకు సతీమణిగా ఉంటూ, ఆశ్రితులు కోరిన కోర్కెలు తీర్చే ఈశ్వరీ! శ్రీవేంకటేశుని సతివి అయిన లక్ష్మీదేవీ, నీకునూ సుప్రభాత మమ్మా!"

మహావిష్ణువును మాత్రమే నిద్ర మేల్కొల్పితే చాలదు. అమ్మవారైన లక్ష్మీదేవి తోడైతేనే, స్వామి అందరికీ శుభాల నివ్వగలడు. అందువల్ల ఆ మహాలక్ష్మితో 'నీకూ సుప్రభాత మమ్మా, నిదురలె'మ్మని భక్తుడు ప్రార్థిస్తున్నాడు. నిజానికి ఏ భక్తుడైనా స్వామి అనుగ్రహం పొందాలంటే, ఆ దేవి అనుగ్రహం తప్పనిసరి. ఇది అనేక భక్తుల కథలలో మనకు కనిపిస్తుంది.

భక్త రామదాసు "అమ్మా! సీతమ్మా, నన్ను బ్రోవమని రామయ్యకు చెప్పవమ్మా!" అంటూ సీతమ్మను వేడుకోవడం వల్లే స్వామిఅనుగ్రహం సంపాదించాడు. అలా భక్తుని వేడుకోలు విన్న సీతమ్మ శ్రీరామునికి విన్నవిస్తే, "భక్తుని పూర్వ జన్మ కర్మ ఫలితమది. అయినా సరే! నిన్ను శరణుజొచ్చాడు గనక నేను తప్పక రక్షిస్తాను" అని చెప్పాడు. మధుకైటభులంతటి భయంకర రాక్షసులు అమాయకులైన ప్రజలను చంపడాన్ని చూసి, శత్రు భయంకరుడైన స్వామి భక్తుల మొరను ఆలకించి, ఆ రాక్షసులను సంహరించాడు.

ఆ స్వామి మహావిష్ణువు. అతని వక్షఃస్థలమే నివాసంగా కలిగి ఉండే శ్రీలక్ష్మి, అటు స్వామి భక్తులనూ, ఇటు తన భక్తులనూ అందరినీ కరుణించే తల్లి. కాబట్టి స్వామితో బాటు, ఆయన సతీమణి కూడా నిద్ర మేల్కోవాల్సి ఉంది. అది తప్పనిసరి. అందువల్ల అందరికీ తండ్రి అయిన శ్రీవేంకటేశునీ, అందరికీ తల్లి అయిన శ్రీదేవినీ నిద్రమేల్కొనమనీ, అందరినీ బ్రోచే కార్యక్రమాన్ని మొదలెట్టమనీ భక్తుడు ఈ శ్లోకంలో వేడుకొంటున్నాడు.

**4. తవ సుప్రభాత మరవిందలోచనే**
**భవతు ప్రసన్న ముఖచంద్రమండలే ।**
**విధిశంకరేంద్ర వనితాభి రర్చితే**
**వృషశైలనాథ దయితే దయానిధే ॥**

"తామరపూలవంటి కన్నులగల తల్లీ, చంద్రబింబంలాంటి ప్రసన్నమైన వదనం కలదానవు. బ్రహ్మ, శంకర, ఇంద్రాదుల భార్యలైన సరస్వతి, పార్వతి, శచీదేవి మొదలైనవారంతా సదా పూజించే ఓ తల్లీ! నీవు దయానిధివి. వృషాచలాధిపతి అయిన శ్రీవేంకటేశునికి ప్రియమైన దానవు. ఓ తల్లీ! నీ కిదే సుప్రభాతం."

కమలాక్షియైన లక్ష్మీదేవి జగన్మాత. ఆమె భక్తులందరినీ కరుణించి ఆపదల నుంచి కాపాడుతుంది. ఎలాగైతే, పున్నమి చంద్రుడు చల్లని వెన్నెలను జీవులమీద వర్షిస్తాడో, అదే మాదిరి లక్ష్మీదేవి దీనులైన భక్తులమీద తన కరుణా ప్రకాశాన్ని ప్రసరింప చేస్తుంది. చదువుల తల్లి సరస్వతి, శక్తి స్వరూపిణి పార్వతి, ఇంద్రుని సతీమణి అయిన శచి– వీరంతా స్వయంగా శక్తి స్వరూపిణులే! అయినా కూడా వారందరూ లక్ష్మినే ఆరాధిస్తారు. అభిలషిస్తారు. ఆ తల్లినే ఈ శ్లోకంలో వృష శైలాధిపతి భార్యగా పేర్కొనడం జరిగింది. మరి భగవంతుని ఎందుకు వృషశైలాధిపతిగా వర్ణించడం అంటే – ధర్మదేవత తపస్సుచేసి మరింత శక్తిని సంతరించుకొన్నది ఈ కొండమీదే. 'వృష' అంటే ధర్మం. ధర్మ సంరక్షణకే ఉన్నదీ కొండ. అందుకే దీనికి వృషశైలం అని పేరు. ధర్మ స్వరూపుడైన దేవుడు మరి ఆ శైలానికి అధిపతికాక మరేమవుతాడు?

అందువల్ల, ఆ దేవదేవుని సుప్రభాతంతో బాటు వృషశైలాన్ని తలపింపజేస్తూ, "ఓ వృషశైలనాథా! ధర్మాన్ని రక్షించడానికి నిద్రలే" అని



చెప్పడం జరిగింది. అయితే, ఆ ధర్మాచరణకు భగవంతునికి తన సహధర్మచారిణియైన లక్ష్మీదేవి ఎంతో అవసరం. అందుకే ఆమెను "వృషశైలాధీశుని పత్నీ! అమ్మా, దయకు మారుపేరైన ఓ లక్ష్మీదేవీ! స్వామితో బాటు నీకు కూడా సుప్రభాతం" అంటూ విన్నవించడం ఎంతైనా సమంజసం.

**5. అత్ర్యాది సప్తఋషయస్స ముపాస్య సంధ్యాం**
**ఆకాశ సింధుకమలాని మనోహరాణి ।**
**ఆదాయ పాదయుగ మర్చయితుం ప్రపన్నాః**
**శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥**

"అత్రి మొదలైన సప్తర్షులు ఇప్పటికే లేచి సంధ్యావందనం చేసి ఆకాశ గంగలోని తామరపూలను తెచ్చి నీ పాదాలను పూజించడానికి ఇక్కడ వచ్చి చేరారు. ఓ శేషాద్రి శేఖరా! నీకు ఇదే సుప్రభాతం."

సప్తర్షులు మహా తపఃశక్తి సమన్వితులు. ఎవరికి వారే సాటి. వారిలో అత్రిమహర్షిని ఆద్యునిగా పేర్కొంటారు. అత్రిమహర్షి పత్నియైన అనసూయాదేవి పాతివ్రత్యానికి మారుపేరు. ఆమె తన పాతివ్రత్య మహిమతో తనను పరీక్షించాలని వచ్చిన ఆ త్రిమూర్తులనే తన పుత్రులుగా చేసుకొంది. త్రిమూర్త్యాత్మకుడైన దత్తాత్రేయుడు ఆమె పుత్రుడే. అంత గొప్ప తల్లి అనసూయ. ఇక ఆమె పతి తపశ్శక్తి గూర్చి వేరేగా చెప్పాలా? అందుకే సప్తర్షుల గూర్చి చెప్పేటపుడు మొదట 'అత్రి' మహర్షినే పేర్కొంటారు. ఆ అత్రిమహర్షి మొదలైన ఏడుమంది మహర్షులూ శ్రీవేంకటేశ్వరుని కొలవడానికి బారులు తీరి ఉన్నారు. ఆకాశగంగకు వెళ్లి సంధ్యావందనాది కృత్యాలు పూర్తి చేసుకొని, అక్కడ ఉండే తామరపూలను తెచ్చి స్వామిని పూజించాలని వేచి ఉన్నారు. ఆకాశగంగ వేంకటాద్రి మీద ఉన్న పవిత్ర తీర్థం. ఈ పవిత్రతీర్థంతోనే నేటికీ స్వామి పూజా కార్యక్రమాలను

నిర్వహిస్తున్నారు. భూమిపై ఉండే గంగాది తీర్థాలన్నింటిలో వరుసగా పన్నెండేళ్ళు స్నానం చేస్తే కలిగే పుణ్యం, మేషమాసంలో పున్నమినాడు ప్రాతఃకాలంలో ఈ ఆకాశగంగలో ఒక్కసారి స్నానం చేస్తే కలుగుతుందట! ఆంజనేయుని తల్లి 'అంజన' మహా తపస్విని. ఆ దేవుని పూజించి, ఇక్కడే తపస్సు చేసి ఆంజనేయుని తనయునిగా పొందింది. పురాణాల్లోకి తొంగిచూస్తే, ఈ కొండలవల్ల ఎంతమంది ఆత్మసాక్షాత్కారాన్ని పొందారో మనకు తెలుస్తుంది. అందువల్ల ఈ పవిత్ర మహిమాన్వితమైన ఆకాశగంగాతీర్థంలో పుట్టిన తామర పూలు ఆ దేవునికి ఎంతో ప్రీతి పాత్రమైనవి. అది గుర్తించే అత్రి, కశ్యప, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ, జమదగ్ని, వశిష్ఠాది సప్తర్షులు స్వామి కార్యాన్ని ఆచరించడానికి ఆకాశగంగాతీర్థాన్ని ఎన్నుకొన్నారు.

ఈ సుప్రభాత శ్లోకంలో దేవుని శేషాద్రిని పాలించేవానిగా చెప్పడం జరిగింది. ఈ భువిలో వెలసిన ఈ కొండ ఆదిశేషుని భౌతికస్వరూపమే. అసలు ఆదిశేషుడెందుకు ఈ భువిలో అవతరించాడని అడగవచ్చు. స్వామి ఆదేశానుసారమే అలా అవతరించాడు. శేషాద్రి గొప్పదనాన్ని మనం మాటల్లో వర్ణించలేం.

బ్రహ్మాండపురాణంలోని రెండో అధ్యాయంలో చెప్పినట్లు బ్రహ్మ, రుద్రాది మహాదేవతలూ, యోగినులూ ఈ శేషాద్రిమీద మహావృక్షాలుగా, చెట్లు, చేమలుగా నిత్యవాసం చేస్తున్నారు. ప్రతి దేవతా ఏదో ఒక రూపంలో ఈ కొండమీద వెలసి ఉండటంవల్లే శేషాద్రికొండ అంత మహిమాన్వితమైంది. అంతమంది నివసించే ఈ కొండను పరిపాలించే శక్తి ఒక్క మహావిష్ణువుకే ఉంది. అందరికీ ఆయనే సామ్రాట్టు. ఆయన వైభవాన్నెవ్వరూ వర్ణించలేరు. ఆ దేవదేవుని కోసమేనా అన్నట్టు ఇతర దేవతలంతా ఆ కొండమీద చెట్లరూపంలో వెలిశారు. ఈ అంశమే సప్తర్షు లంతా శ్రీవేంకటేశ్వరుని కొలవడానికి కారణమైంది.



**6. పంచాననాబ్జభవ షణ్ముఖవాసవాద్యాః**
**త్రైవిక్రమాదిచరితం విబుధాః స్తువంతి ।**
**భాషాపతిః పఠతి వాసరశుద్ధి మారాత్**
**శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శేషాచలపతీ! రుద్రుడు, బ్రహ్మ, కుమారస్వామి దేవేంద్రాది దేవతలంతా వామనాది (త్రివిక్రమావతార) నీ దివ్యచరిత్రలనూ, లీలలనూ స్తోత్రం చేస్తున్నారు. దేవగణానికి గురువైన బృహస్పతి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాది వివరాలతో పంచాంగ పఠనం చేస్తున్నాడు. ఓ స్వామీ! నీ కిదే సుప్రభాతం."

ప్రతిరోజూ బ్రహ్మ, రుద్రాది సకల దేవతలూ స్వామిని అర్చిస్తారనే అంశం ఈ శ్లోకంలో ప్రస్తావింపబడింది. రుద్రుని శివ అని గానీ, పరమశివ అనిగానీ చెప్పకుండా 'పంచానను'నిగా లేదా 'పంచముఖు'నిగా పేర్కొనబడింది. ఎందుకంటే, శ్రీ వేంకటేశ్వరుని వైభవం అగమ్యగోచరమైంది. దానిని మనబోటి సామాన్యులు వర్ణించలేము. ఆ వైభవవర్ణన శివునికే సాధ్యం. అదీ ఆయన పంచముఖాలతో ఉంటేనే గోచరిస్తుంది. అలాగే బ్రహ్మ చదువుల తల్లి సరస్వతీదేవి భర్త. ఆ వాగ్దేవికి భర్తయైన చతుర్ముఖబ్రహ్మకూడా స్తోత్ర నిమగ్నుడై ఉన్నాడు. షణ్ముఖుడైన కుమారస్వామి సైతం శ్రీవేంకటేశుని ప్రార్థన చెయ్యడానికే వేచి ఉన్నాడు.

ఇంద్రుడు దేవతలకంతా అధిపతి. అలాంటి స్వర్గలోక అధిపతి అయిన ఇంద్రుడు కూడా స్వామిని స్తుతిస్తూ శ్రీ స్వామివారి సుప్రభాతసేవకై వేచి ఉన్నాడు. ఇంతమంది మహిమాన్వితులు స్వామి కోసం వేచి ఉన్నారంటే ఆ దృశ్యం ఎంత పవిత్రంగా, ఎంత అద్భుతంగా ఉంటుందో కదా! పైగా ఈ దేవతలంతా స్వామి దివ్యావతారాలనూ, ఆ అవతార గుణ విశేషాలనూ

వల్లించడానికే వేచి ఉన్నారు. ఆ అవతారాల విశేషాలనూ వర్ణించడమనేది అంత సులభం కాదు. అసలు వామనావతారం గూర్చి వర్ణించడమంటే మాటలు కాదు.

ముఖ్యంగా వామనావతారాన్నే ఎందుకు వర్ణించారంటే, దేవతలు, ఋషులు, మునులు – వీళ్లంతా ఎంత గొప్ప భక్తులైనా కావచ్చు. ఎవరైనా సరే, దైవసృష్టికి అడ్డం తగులుతూ ఇతరులను కష్టపెడుతూ ఉంటే, ఆ దైవం సహించడు. అటువంటివారు భక్తులైనా చివరికి బలిని తొక్కేసినట్టు, పాతాళంలోకి తొక్కి వేయడానికి కూడా దైవం వెనుకాడడు. ఇక్కడ అలాటి భగవచ్ఛక్తిని గూర్చి వర్ణించడం జరిగింది. కలియుగంలో ఎటువంటి దుష్టశక్తులనైనా, కంటకులనైనా సంహరించేందుకే వెలసిన దైవం శ్రీవేంకటేశ్వరుడు. ఆ మహనీయదైవానికి నిత్యమై తిథి, వార, నక్షత్ర, శుభ, కరణ, యోగాల గూర్చి చెప్పడం ఇక్కడ ఎంతైనా సమంజసం. ఎందుకంటే, దైవం యోగనిద్రనుంచి మేల్కొని వాటిని ఆశీర్వదిస్తేనే అవి ప్రకాశిస్తాయి.

**7. ఈషత్ప్రఫుల్ల సరసీరుహనారికేళ**
**పూగద్రుమాది సుమనోహర పాలికానామ్ ।**
**ఆవాతి మంద మనిల స్సహ దివ్యగంధైః**
**శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥**

"కొద్దిగా వికసించిన పద్మాలనుంచి వెలువడుతున్న చక్కని పవిత్రమైన సుగంధ సువాసనలు, పదునైన కొబ్బరి, పోక మొదలైన చెట్ల కదలికలతో ఆ సుగంధ పరిమళాలు నెమ్మదిగా నీ పైకి వీస్తున్నాయి. స్వామీ! నీ కిదే సుప్రభాతం."

సహజంగా నెలకొని ఉండే అందమైన పరిసర వాతావరణాన్ని వర్ణిస్తూ, ఆ పిల్లవాయువులు, వికసిస్తూ ఉన్న పద్మం, సుగంధ పరిమళాల సువాసనలు



ఎలా స్వామి సేవ చేయడానికి తహతహలాడుతున్నాయో ఈ శ్లోకం చెబుతోంది.

ఇతర దేవతలంతా శ్రీవేంకటేశ్వరుని సేవకై ఎట్లా వేచియున్నారో, అదేవిధంగా పిల్ల వాయువులు, సహజాతి సహజంగా ఉండే అందమైన వాతావరణం– అన్నీ కూడా స్వామికి సేవచేయాలని తహతహలాడున్నాయి. కొబ్బరిచెట్ల గూర్చి, పోకచెట్ల గూర్చి ఇక్కడ చెప్పడం ఎంతైనా సమంజసం. ఎందుకంటే, స్వామిపూజకూ, తాంబూలానికీ కావలసిన సామగ్రి ఈ చెట్ల నుంచే సమకూరతాయి అవి తిరుమలగిరులలో వాటి ఉనికిని చాటుకొంటున్నాయి. ఇలా స్వామి సేవకోసం పరిసరాలు ఎలా సంసిద్ధంగా ఉన్నాయో తర్వాతి శ్లోకంలో కూడా విశదమవుతోంది.

**8. ఉన్మీల్య నేత్ర యుగముత్తమపంజరస్థాః**
**పాత్రావశిష్ట కదళీఫలపాయసాని ।**
**భుక్త్వా సలీల మథ కేళిశుకాః పఠంతి**
**శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శేషాద్రిశేఖరా! గూటిలోని రామచిలుకలు కళ్లు తెరిచి పళ్లెంలో మిగిలిన కదళీఫలాలను ఆస్వాదించి, తీయని పాయసాన్ని గ్రోలి నిన్నే కీర్తిస్తున్నాయి. స్వామీ! నీ కిదే సుప్రభాతం."

గూటిలో రామచిలుక అంటే, ఇక్కడ మనిషి దేహంలో ఉండే జీవుడన్న అర్థంలో తీసుకోవాలి. దేహమే పంజరంగా కలిగిన చిలుక లేచి తెలతెలవారే సమయాల్లో స్వామి కీర్తనలను ఆలపిస్తున్నది. శుకమహర్షి సైతం నిత్యం స్వామిని కీర్తించాడు. దానినే చిలుకలు అనుసరిస్తున్నాయి. ఎంతో అందంగా ఆ చిలుకలు కీర్తించడం స్వామికి సమ్మతంగా ఉండే ఉండాలి. 'ఆర్తజన రక్షకా!' అని భక్తుడు పిలిస్తే స్వామి పలుకుతాడనే నమ్మకం ఇందులో కనిపిస్తుంది.

**9. తంత్రీప్రకర్ష మధురస్వనయా విపంచ్యా**
**గాయ త్యనంతచరితం తవ నారదోఽపి ।**
**భాషాసమగ్రమసకృత్కరచార రమ్యం**
**శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥**

"శేషాద్రిపై వెలసిన ఓ దేవా! నారదుడు నిన్ను కీర్తిస్తున్నాడయ్యా! అనంతుడా! సప్తతంత్రీ వీణ అయిన విపంచిపై నారదుని చేతివేళ్ళు అద్భుతంగా కదలుతుండగా పుట్టిన ఆ సంగీత ధ్వనులెంతో ఆహ్లాదంగా నీ అనంతచరిత్రను వినిపిస్తున్నాయి. నీ కిదే శుభప్రదమైన సుప్రభాతం స్వామీ!"

నారదుడు మహర్షి మాత్రమే కాదు, పరమ భాగవతుడు కూడా. తన నిత్యభగవన్నామ సంకీర్తనతో మహాభక్తుడుగా పేరు పొందాడు. నారదుడు బ్రహ్మకు మానసపుత్రుడూ, మహావిష్ణువుకు మనుమడూ కాబట్టి సహజసిద్ధంగానే ఆయనకు నారాయణ నామస్మరణ అబ్బింది. కాబట్టే ఆ నారాయణుని శరణాగతిని పొంది అతని ప్రియ భక్తుడయ్యాడు. తన నిత్యకీర్తనలతో నారాయణుని ప్రసన్నుని చేసుకొన్నాడు. నిత్య నారాయణ స్మరణే అతని పథం. అందుకే, "ప్రియభక్తుడైన నారదుడు సుప్రభాతం పలుకుతున్నాడయ్యా! నా తండ్రీ! ఆద్యంతాలు లేనివాడా! నిన్ను కొలవడానికి కావలసిన ఆధ్యాత్మిక శక్తి ఉన్న నారద కీర్తనతో నీ కిదే సుప్రభాతం" అంటుంది ఈ శ్లోకం.

**10. భృంగావళీ చ మకరంద రసానువిద్ధ**
**ఝంకార గీతనినదైః సహ సేవనాయ ।**
**నిర్యాత్యుపాంత సరసీకమలోదరేభ్యః**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥**



"తటాకాల్లో వికసించిన పద్మాలలోని తేనెను ఆస్వాదించిన తేనెటీగలు నేడు మరింత శక్తిమంతమైనాయి. ఆ తేనెటీగలు నీ సేవకోసం మరింత ఝుంకారం చేస్తూ వస్తున్నాయి. నీ కిదే సుప్రభాతమయ్యా!"

తాను సృష్టించిన ప్రకృతి సైతం తన సేవచేయడానికై ఎలా తహతహలాడుతున్నదో భక్తుడు ఈ శ్లోకంలో స్వామికి విన్నవించాడు. తేనెటీగలు సహజంగా చేసే శబ్దం ఓంకారాన్ని తలపింపజేస్తుంది. ఈ తేనెటీగలు చేసే ఝుంకారం లయబద్ధంగా నారదుడు మీటే మహతీ నినాదాన్ని పోలి ఉంది. భక్తుడు తానే తేనెటీగగా మారి భగవన్నామస్తోత్రమనే తేనెను గ్రోలి స్వామికి సుప్రభాతం పలకడం మనకు కనిపిస్తుంది. మరి ప్రకృతీ పురుషులు ఒకటే కదా!

**11. యోషాగణేన వరదధ్ని విమథ్య మానే**
**ఘోషాలయేషు దధిమంథన తీవ్రఘోషాః ।**
**రోషాత్కలిం విదధతే కకుభశ్చ కుంభాః**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శేషాద్రివాసా! గోప స్త్రీలు కుండలనిండా పెరుగు చిలుకుతూంటే ఆ పెరుగు, కుండలనుంచి అన్ని ప్రక్కలకు చిందుతున్నది. ఆ దృశ్యం చూస్తే, కుండలకూ దిక్కులకూ మధ్య ఏదో పోటీ జరుగుతున్నట్లు అనిపిస్తున్నది. ఓ శేషాద్రిశేఖరా! నీకిదే సుప్రభాతం."

గోపకుల ఇళ్లలోని కుండలూ, దిక్కులూ అనేవి రెండూ స్వామిసేవకు తపించి పోవడాన్ని సూచిస్తున్నాయి. గోప స్త్రీలది స్వామిభక్తి. అందువల్ల సహజంగానే వారి పెరుగుకుండలు కూడా భక్తితో ఎపుడెపుడు స్వామి నైవేద్యం కోసం ఉపయోగపడుదామా అని ఉవ్విళ్లూరుతున్నాయి. అదే స్వామి గొప్పదనం. ఈ గొల్లభామలు పెరుగు చిలుకుతూ పాడే స్వామివారి

భక్తిగీతాలు వీనుల విందుగా ఉన్నాయి. స్వామి పాదాలను అనుసరించమని చెబుతున్నాయి. వారు మచ్చలేని భక్తికి ఉదాహరణలు.

నిస్వార్థమైన, నిష్కల్మషమైన భక్తి అంటే అది వారిదే. వారెంత జాగరూకులై ప్రాతఃకాలంలో స్వామిని కీర్తిస్తూ పాటలు పాడుతూ, పెరుగు చిలుకుతూ ఉన్నారో! అది వారి దినచర్యగానే కాక, స్వామి సుప్రభాతసేవలో ముఖ్యమైన అంశంగా మారిపోయింది.

**12. పద్మేశమిత్రశతపత్రగతాళివర్గాః**
**హర్తుం శ్రియం కువలయస్య నిజాంగలక్ష్మ్యా ।**
**భేరీనినాదమివ బిభ్రతి తీవ్రనాదం**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శేషాద్రి దేవా! సూర్యుడికి ప్రియమైనవీ, సూర్యకిరణాలతో వికసించేవీ తామర పూలు. వాటిలో ఉండే తుమ్మెదలు, తమ దేహకాంతితో కలువల నల్లని కాంతిని హరించడానికి భేరీ నాదాలవలె శ్రవణానందకరమైన శబ్దాలను చేస్తున్నాయి. నీకిదే సుప్రభాతం."

పద్మాలు వికసించాలంటే వాటికి సూర్యరశ్మి తప్పనిసరిగా కావాలి. అందుకే సూర్యుని పద్మమిత్రుడంటారు. సూర్యోదయం అవుతోందనగనే, పద్మాలు వికసిస్తాయి. కలువ పువ్వు తన రెక్కలను విచ్చుకొనేలాగా అందులో ఉండే నల్లని తుమ్మెదలు సహాయపడతాయి.

అట్లే, పరమాత్ముని గురించిన పవిత్రమైన ఆలోచన, చింతన అనేవి మనిషిలోని అజ్ఞానమనే నలుపును కూడా పారద్రోలేలా చేస్తాయి. ఇది జీవులలోని పరమాత్మ చింతనను కలిగించి జ్ఞానోదయాన్ని కలిగించే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సూచిస్తుందని అర్థం.



ఆ ఆధ్యాత్మికతే భగవన్నామాన్నీ, భగవంతుని గుణగణాలను కీర్తించడం వంటి మంచి పనులను చేయిస్తుంది. ఇక్కడ తుమ్మెదలు చేసే శబ్దాన్ని భక్తుడు ప్రతి జీవునిలో జరిగే నిత్యభజన, సంకీర్తనలతో పోల్చాడు. ఆ రవాన్ని విన్న వారికి కూడా ఒక రకమైన చైతన్యాన్ని పొందిన అనుభూతి కలుగుతుంది.

**13. శ్రీమన్నభీష్ట వరదాఖిలలోకబంధో**
**శ్రీ శ్రీనివాస జగదేకదయైక సింధో,**
**శ్రీ దేవతాగృహభుజాంతర దివ్యమూర్తే**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్.**

"విశ్వాధారా! అభీష్ట వరప్రదాయకుడవైన శ్రీలక్ష్మీనాథా! లోకబాంధవా! శ్రీ శ్రీనివాసా! లక్ష్మీదేవికి నివాసస్థానమైన కరుణాసముద్రా! జగత్తులోని ఏకైక దయానిధీ! లక్ష్మీదేవిని వక్షంలో నిలుపుకొన్న మనోహరమూర్తీ! ఓ శ్రీవేంకటాచలాధీశా! ఇదే నీకు సుప్రభాతం."

ఈ సుప్రభాత శ్లోకం శ్రీలక్ష్మీదేవితో కూడి భాసిల్లే శ్రీనివాసుని వర్ణిస్తున్నది. తల్లి లక్ష్మీదేవి కరుణాతటాకం వంటిది. ఆమె అన్ని సంపదలకూ, ఆధ్యాత్మికతకూ ఆలవాలమైనది. అలాంటి లక్ష్మీదేవిని తన ఉరఃస్థానంలో పదిలంగా నిలుపుకొన్నాడు శ్రీహరి. అందువల్ల మనకు మొదట లక్ష్మీదేవి కరుణపొంది, తద్వారా 'శ్రీ' నివాసుని కరుణ పొందటం తేలిక. శ్రీనివాసుడిచ్చే వరాలన్నిటికీ మహాలక్ష్మీదేవి ఆశీర్వాదం ఉంటుంది. విశ్వంలోని సమస్త జీవులూ స్థిరబుద్ధి లేక ఎల్లపుడూ ఏదో అపచారాలు చేసే ప్రమాదం నెలకొని ఉంది. వాటిని గురించి స్వామికి వివరిస్తూ, వాటిని వారిస్తూ, స్వామి భక్తులకిచ్చే ఆశీర్వాదాలను స్థిరంగా ఉండేలా చూస్తుంది తల్లి లక్ష్మీదేవి.

అర్ధాంగిని తన వక్షం మీద పదిలంగా ఉంచుకోవడం అనేది స్వామి వైభవానికి వన్నె తెచ్చింది. లక్ష్మీదేవి దివ్య సౌందర్యం, ఆమె స్వామిలో

నివసించడం వల్ల వచ్చిన శక్తీ – ఈ రెండిటివల్ల స్వామివైభవం ద్విగుణీకృతమయ్యింది. అందుకే హరి 'శ్రీ'నివాసుడయ్యాడు, విశ్వదయాకరుడయ్యాడు. మరి ఆయన శ్రీవేంకటాచలపతి ఎలా అయ్యాడూ అంటే, శ్రీ కీ, వేంకటాచల పర్వతానికీ కూడా నాయకుడాయన. 'వేం' (లేదా 'వ') అనే అక్షరం అద్భుత బీజమైనది. అది శాశ్వతాన్ని కలుగ జేస్తుంది. క, ట అనే రెండూ కలిసి ఐశ్వర్యాన్ని సూచిస్తాయి. అందువల్ల శ్రీ 'వేంకట' అంటే శాశ్వతమైన ఐశ్వర్యం అని అర్థం. భక్తులందరి పాపాలను కడిగి, ఎనలేని సంపదలను వేంకటాచలం సహజంగా లభింపజేస్తుంది. మేరు పర్వతానికి మారుపేరైన శ్రీవేంకటాచలం సువర్ణముఖీ నదీతీరాన ఉంది. శ్రీ వేంకటాచలానికి ఆధ్యాత్మిక, ఐహిక సంపదలనిచ్చి శాశ్వత ముక్తి ప్రసాదించే శక్తి ఉంది. ఎందుకంటే, ఆ కొండపైన సిరినిచ్చే శ్రీదేవిని వక్షఃశయ్యపై స్థిరంగా నిలుపుకొని ఉన్నందువల్ల శ్రీనివాసుడు అయ్యాడు.

అందుకే, ఎవరైనా సరే శ్రీనివాసుని కృపకు సులభపాత్రులవ్వాలంటే, పరిశుద్ధమైన, నిశ్చలమైన మనస్సుతో శ్రీవేంకటాచలం చేరి స్వామిని సేవించాలి. అపుడే భగవంతుడైన శ్రీనివాసుడు కోరిన కోర్కెల్ని తీరుస్తాడు. తన అపార కరుణకిరణాలను మనపై ప్రసరింప జేస్తాడు. అంతులేని ఐహిక, ఆధ్యాత్మిక సంపదలను మనం కోరినా కోరకపోయినా ఇస్తాడు. ఆ శ్రీనివాసుణ్ణి భక్తితో కొలిస్తే చాలు. అందుకే, ఇకపై అన్ని శ్లోకాలలోనూ సుప్రభాతకారుడు స్వామిని శ్రీవేంకటాచలపతి అనే సంబోధిస్తాడు.

**14. శ్రీ స్వామిపుష్కరిణికాఽఽప్లవ నిర్మలాంగాః**
**శ్రేయోఽర్థినో హరవిరించిసనందనాద్యాః,**
**ద్వారే వసంతి వరవేత్రహతోత్తమాంగాః**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్**



"ఓ శ్రీపతీ! ఓ వేంకటాచలపతీ! శివుడు, బ్రహ్మ సనందాదులంతా శ్రేయస్సు కోసం పుష్కరిణీ స్నానమాచరించి నిర్మలులై వచ్చి నీ ద్వారం వద్ద నిలిచారు. ఎంతో అసహనానికి గురవుతూ ముందుకు దూసుకుని వస్తూంటే, ద్వారపాలకులు బెత్తాలతో దెబ్బలు వేస్తూ వారిని అడ్డగిస్తున్నారు. ఓ శ్రీ వేంకటాచలపతీ! నీ కిదే సుప్రభాతం."

ఆదినారాయణుడైన శ్రీవేంకటాధీశుని దివ్యదర్శనం కోసం శివుడు, బ్రహ్మ పవిత్ర స్వామిపుష్కరిణిలో స్నానమాచరించి పవిత్రులై వచ్చారు. వారిరువురికి తోడుగా సనందాది ఋషులంతా కూడా వచ్చారు. సనకసనందులు బ్రహ్మమానసపుత్రులు. వారు ఆధ్యాత్మిక శక్తి సంపన్నులు. సనందుడు 'శ్రుతిగీత'ను బోధించాడు. దేవదేవుని గుణగణాలను ఎలా కీర్తించాలో, ఆద్యంతాలు లేని నిరాకారుడైన ఆ స్వామిని ఎలా కీర్తించాలో చెప్పాడు. భూమిని ఏలే రాజులు తమను పొగడటం కోసమని వందిమాగధులను ఏర్పాటు చేసుకొంటారు. వారు వారి గుణగుణాలను, తాము చేసిన మంచి పనులను పదేపదే చెప్పించుకొంటారు. అయితే, స్వామి విషయం వేరే. యోగనిద్రలో నుంచి స్వామి మేల్కొనేవేళ శ్రుతులు స్వామిని కీర్తిస్తాయి. వాటికి ఆద్యంతాలుండవు. ఎందుకంటే, అవి స్వామి నిశ్చలమైన యోగముద్ర నుంచి వెలువడ్డాయి. సనందునికి వాటి గొప్పదనం తెలుసుకొనే భాగ్యం లభించింది. ఆ భాగ్యాన్ని అందరికీ పంచివ్వడానికేనన్నట్లు సనందుడు శ్రుతిగీతనందించాడు.

త్రిమూర్తులలో శివుడు, బ్రహ్మ ఇద్దరు స్నానమాచరించిన శ్రీస్వామిపుష్కరిణీ తీర్థం సర్వ పాపనాశిని. అంటే అన్ని పాపాలనూ కడిగేస్తుందని అర్థం. అది వైకుంఠంలో శ్రీహరి శ్రీలక్ష్మి ఇరువురు నిత్యమూ దివ్యక్రీడలలో మునిగి తేలే పవిత్ర తటాకం. శ్రీహరి వాహనమైన గరుడుడు

దానిని భువికి తెచ్చి ఉంచాడు. ఒక్క పుష్కరిణీ స్నానం ఎన్నో సంపదలనివ్వటమే కాక, సర్వపాపాలనూ హరిస్తుంది. కోరిన అన్ని కోర్కెలనూ తీరుస్తుంది. స్వామి పుష్కరిణి ఎంతో శక్తిమంతమైంది. అందుకే, వరాహపురాణం ఇలా అంటుంది :

**"స్వామి పుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనమ్**
**ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్"**

"స్వామి పుష్కరిణీ స్నానం, సద్గురువుకు సేవచేయడం, ఏకాదశీవ్రతం చేయడం – ఈ మూడు ఎంతో దుర్లభమైన పనులు". అలాటి పనులు చేయాలంటే మనకు తగిన సంస్కారం ఉండాలి. ఆ తర్వాతే పవిత్రోత్తముడూ, విశ్వాధారుడూ అయిన శ్రీవేంకటేశ్వరుని దర్శనం లభిస్తుంది.

ఈ సుప్రభాతశ్లోకంలో 'వేత్రహతోత్తమాంగాః' అంటే, బ్రహ్మాదులను ద్వారపాలకులు బెత్తంతో కొట్టారని కాదు అర్థం. ఎక్కడ స్వామికి నిద్రాభంగ మౌతుందోనని ఆ ద్వారపాలకులు బెత్తాన్ని గాలిలో ఊపనారంభిస్తే, ఆ బెత్తం దెబ్బలు తమకు తగలకుండా జాగ్రత్తగా వుంటూ బ్రహ్మాదులు ముందుకు సాగకుండా ఆగిపోయారని ఇక్కడ అర్థం.

**15. శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి**
**నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్ ।**
**ఆఖ్యాం త్వదీయవసతే రనిశం వదంతి**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలపతీ! నీ నివాసస్థానమైన తిరుమలను శ్రీశేషశైలమనీ, గరుడాచలమనీ, వేంకటాద్రియనీ, నారాయణాద్రియనీ, వృషభాద్రియనీ, వృషాద్రియనీ–ఇలా ఎన్నో పేర్లతో పిలుస్తారు. నీ కిదే సుప్రభాతం."



బ్రహ్మాండపురాణంలోనూ, వామనపురాణంలోనూ, ఈ పవిత్రమైన తిరుమల కొండకు చింతామణిగిరి, జ్ఞానాద్రి, తీర్థాద్రి, పుష్కరాద్రి, కాంచనాద్రి, నీలాద్రి, శ్రీనివాసాద్రి, ఆనందాద్రి, వరాహాద్రి, వైకుంఠాద్రి, క్రీడాద్రి, వృషాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, సింహాద్రి, అంజనాద్రి, శేషాద్రి, గరుడాద్రి, సుమేరు శిఖరాచల, శ్రీశైల, వేంకటాద్రి అని 21 నామాలు చెప్పబడ్డాయి.

శ్రీమద్ వేంకటనాథ వేదాంతదేశికులు రచించిన దయాశతకంలో 108 శ్లోకాల్లో 80 శ్లోకాలు వేంకటాద్రిని ప్రస్తావించాయి. ఆ ప్రస్తావనలో వృషగిరి అనే పేరు 69సార్లు, అంజనగిరి అనే పేరు 4 సార్లు, వేంకటగిరి అనే పేరు 2 సార్లు, మృగపతిగిరి, నారాయణగిరి, లక్ష్మీధర (శ్రీశైల) అనే పేర్లు ఒక్కోసారీ ప్రస్తావన కొచ్చాయి. వృషగిరి అనే పేరును వృషగిరి అని మాత్రమే కాక వృషభగిరి, వృషశిఖరి, వృషాచల, వృష శైల, వృషాద్రి అనికూడా ప్రస్తావించాయి. ఇలా ప్రస్తావించిన పేర్లలో శ్రీశేషశైల, గరుడాచల, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి అనేవి ఈ సుప్రభాతంలో చోటు చేసుకొన్నాయి. ఈ పేర్లన్నీ స్వామి భక్తుల పేర్లతో కూడిన ప్రముఖమైన పేర్లు.

'శేష' లేదా 'సంకర్షణ' అనేది స్వామి శయ్య. దాని శక్తి అసమానం. సందర్భాన్నిబట్టి ఆ శక్తి బయటకు కనిపిస్తుంది కాబట్టి శేషాద్రి అనే పేరెంతో ప్రముఖమైంది. శేషాద్రి అనేది ఆదిశేషుని ప్రతిరూపం. ఆదిశేషుడు వైకుంఠంలో శ్రీహరి శయ్యగా ఉన్నాడు. అయితే, శ్రీహరి భూలోకంలో తిరుమలపై వెలిశాడు కాబట్టి శేషుడు కూడా భూమి మీద వెలిశాడన్నమాట. కలియుగంలో తాను భూలోకంలో అవతరించినపుడు శ్రీహరి శేషునిమీదే ఉంటానని వరమిచ్చాడు. అందుకే శేషుడు పర్వతరూపాన్ని పొందాడు.

గరుడుడు వైకుంఠాన్నే తెచ్చి ఈకొండ పైన పెట్టాడు. గరుడుడు తెచ్చినందువల్లే ఈ కొండ గరుడాద్రి అయింది. ఈ వేంకటాద్రి అనేది సకల పాపనాశని, శాశ్వతాన్నిచ్చేది.

ఇది నారాయణాద్రి కూడా అయింది. స్వామికి ఉన్న అనేక భక్తులలో నారాయణుడనే బ్రాహ్మణుడు చాలా గొప్ప భక్తుడు. స్వామి అనుగ్రహంకోసం కఠిన తపస్సు చేసి స్వామి పాదాలను చేరిన మహాభక్తుడు. శ్రీమన్నారాయణుడు ఆ భక్తిని ప్రార్థనమేరకు ఈ గిరికి నారాయణాద్రి అనే పేరును అనుగ్రహించాడు.

నారాయణుడు స్వామిని ఇలా ప్రార్థించాడు : "ఓ ప్రభూ! అందరు మనుష్యులు కఠిన తపస్సు చేయలేరు. నీ దివ్య దర్శనం పొందలేరు. నా భాగ్యవశాన, నా తపస్సు ఫలితంగా నీ దివ్య దర్శన భాగ్యాన్ని నాకు నీవు ప్రసాదించావు. ఈ గిరిని దర్శించే అందరికీ ఆ భాగ్యాన్ని ప్రసాదించు."

అలా తన గురించి మాత్రమే కాకుండా భక్తులందరి గురించీ నారాయణుడు స్వామిని ప్రార్థించాడు. అతని ఆధ్యాత్మికత అంత గొప్పది కాబట్టే స్వామి ఇతర భక్తులందరూ ఇతని పేరున తిరుమలను వర్ణించారు. దానికితోడు 'నారాయణ' అనే పేరు భక్తుని పేరు మాత్రమే కాదు. సాక్షాత్తు ఆ స్వామి పేరు కూడ 'నారాయణుడు'. మరి ఈ గిరిని నారాయణాద్రి అనటంలో అనౌచిత్యమేముంది?

ఇక వృషభాద్రి అనే పేరును చూద్దాం. వృష ధర్మాన్ని ధరించి ధర్మాన్ని కాపాడుతుంది కాబట్టే ఈ కొండ వృషభాద్రి అయింది. వృషమ్ బిభర్తి – వృషభః. అంటే 'వృషభ' అనేది వృష లేదా ధర్మాన్ని ధరించి కాపాడేది అని అర్థం. ఈ కొండమీద వృషభాసురుడు శ్రీహరికై తపస్సు చేశాడు కాబట్టి స్వామి ఆశీస్సులతో శ్రీహరి దయ అపారమైనదని సూచించేలాగా ఈ



గిరికి వృషభాద్రి అని పేరు వచ్చింది. అంతేకాదు ఈ పేర్లన్నీ మిగిలిన పేర్లకన్నా విశిష్టంగా ఉండటమే కాదు, ముఖ్యమైనవి కూడా.

**16. సేవాపరాః శివసురేశకృశానుధర్మ**
**రక్షోఽంబునాథ పవమాన ధనాధినాథాః ।**
**బద్ధాంజలి ప్రవిలసన్నిజశీర్షదేశాః**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ వేంకటాచలపతీ! అష్టదిక్పాలకులైన శివ, ఇంద్ర, అగ్ని, యమ, నైరుతి, వరుణ, వాయు, కుబేరులు నీకు సేవచేయాలనే కోర్కెతో, తపనతో తలలపై చేతులు ఉంచి జోడించి నీకై వేచి ఉన్నారు. నీ కిదే సుప్రభాతం."

ప్రకృతి అన్ని దిక్కులా దివ్యకాంతితో వెలిగిపోతూంటే, ఆ కాంతుల మధ్య అష్టదిక్కులకూ అధిపతులైన వారు స్వామిసేవ చేయడానికి సంసిద్ధులై నిలిచారు. వారికి పూర్తిస్థాయి శక్తులను ప్రసాదించేది స్వామి సేవ ఒక్కటే. అతి చిన్న ప్రాణి నుంచి అతిపెద్ద దైవానికైనా స్వామిచూపు పడితేనే వారి వారి సామర్థ్యాలు ఇతరులు తెలుసుకోగలరు.

దిక్కులకు అధిపతులైనవారు స్వతహాగా శక్తిమంతులే. అయినా కూడా బ్రహ్మాండమైన శక్తి స్వరూపమైన శ్రీ వేంకటాచలపతి ఒక్కడే ఈ కలియుగంలో సర్వజగద్రక్షకుడని వారికి తెలుసు కాబట్టే వారంతా శ్రీనివాసుని శరణాగతి కోరారు. వారంతాకూడా స్వామి శరణాగతితో కొత్తగా ఇనుమడించిన శక్తితో వెలిగిపోతూ కనిపిస్తున్నారు.

**17. ధాటీషు తే విహగరాజ మృగాధిరాజ**
**నాగాధిరాజ గజరాజ హయాధిరాజాః ।**
**స్వస్వాధికార మహిమాదిక మర్థయంతే**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలధీశా! పవిత్రమైన నీ వాహనాలైన ఖగరాజు, సింహ రాజు, సర్పరాజు, గజరాజు, తురగేంద్రాది వారంతా నిన్ను సేవించి వారి శక్తులను నీ నుంచి పొంది తమ తమ సేవలు చేసుకొనే భాగ్యాన్ని ప్రసాదించమని వేడు కొంటున్నారు. ఓ స్వామీ! నీ కిదే సుప్రభాతం."

ఖగరాజైన గరుడుడూ, సింహాలరాజూ, సర్పరాజైన ఆదిశేషుడూ, గజరాజైన ఐరావతమూ, తురగేంద్రుడైన ఉచ్చైశ్రవమూ – శ్రీవేంకటేశ్వరుని పరివారం లోనివే. స్వామితో ఎంతో సన్నిహితంగా ఉంటూ ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి స్వామిని చేర్చడం, స్వామికి ఆనందం కలిగించడం తప్ప వాటికి వేరే ధ్యాస లేదు. నిజానికి అలాటి స్వామి సేవకులకెంతో ఓపిక, శక్తి కావాలి. అష్టదిక్పాలకులందరూ వారి నిత్య కార్యక్రమాలకు ఉపక్రమించడానికి స్వామి అనుజ్ఞ వేడుతూ వేచి ఉంటే, ఇక పరిచారకులు స్వామి అనుజ్ఞ కోసం వేచి ఉండటం అసహజమేమీ కాదు. అది యుక్తం కూడా. జాగ్రత్తగా గమనిస్తే, ఈ ఐదు పవిత్ర జంతువులనేవి జీవులలో ఉండే పంచేంద్రియాలను సూచిస్తాయి. వాటిని మనం నియంత్రించి, వాటిని స్వామిసేవకే వినియోగించాలి. అపుడే అంతర్యామి అయిన ఈశ్వరుడూ, శ్రీమహావిష్ణువూ మన హృదయకమలాన్ని అధిష్ఠించ సాధ్యమౌతుంది. మనం మన పంచేంద్రియాలనూ పూర్తిగా స్వామిసేవలో సక్రమంగా వాడినపుడే స్వామి సాన్నిధ్యం, సాయుజ్యం అనేవి సాధ్యమౌతాయి.

**18. సూర్యేందుభౌమబుధవాక్పతికావ్యసౌరి**
**స్వర్భాను కేతు దివిషత్పరిషత్ప్రధానాః ।**
**త్వద్దాసదాసచరమావధిదాసదాసాః**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలపతీ! స్వర్గ లోకంలో ప్రధాన సభామూర్తులూ, నవగ్రహాధిపతులూ ఐన సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు,



గురువు, శుక్రుడు, శని, రాహువు, కేతువు – వీరంతా నీ సేవకులకు సేవకులుగా ఉండటానికి సంసిద్ధులై ఉన్నారు. నీ కిదే సుప్రభాతం."

శ్రీవేంకటాచలపతికి దాసానుదాసులలో అధములైనవారికుండే హరిభక్తి, ఆధ్యాత్మిక శక్తి – ఈ రెండిటికీ నవగ్రహాధిపతులను సైతం నియంత్రించే శక్తి ఉంది. సృష్టిలోని ప్రతిజీవినీ ఈ నవగ్రహాలూ నియంత్రిస్తాయి. ఈ నవగ్రహాలను సృష్టించినవాడు ఆ స్వామియే. వాటి వాటి కక్ష్యలను అతిక్రమించవు. అలాటి గ్రహాలను సైతం స్వామి సేవకుల్లో అధములైన సేవకులు నియంత్రించ గలరు. శ్రీవేంకటేశుని కరుణా కిరణాలను ఆ గ్రహప్రభావా లేమీ చేయలేవు. అసలు ఆ స్వామి అనుజ్ఞ లేనిదే ఈ గ్రహాలేవీ తమ పనులు చేయవు. అదే విషయాన్ని ఈ సుప్రభాత శ్లోకం తేటతెల్లం చేస్తున్నది. మానవాళి జీవనంపై ఒక్కొక్క గ్రహాధిపతి ఒక్కొక్క రకంగా స్పందించి ఫలితాల నిస్తుంటాడు. అలాటి గ్రహాధిపతి సైతం స్వామి దాసానుదాసులలో అధములైన వారికి ఆధీనుడై పోతాడు.

**19. త్వత్పాదధూళిభరితస్ఫురితో త్తమాంగాః**
**స్వర్గాపవర్గనిరపేక్షనిజాంతరంగాః ।**
**కల్పాగమాఽఽకలనయాఽఽకులతాం లభంతే**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ వేంకటాచలాధిపతీ! నీ పాదధూళిని తలదాల్చి పవిత్రులైన నీ భక్తులు కల్పాంతం గూర్చి కలత చెందుతూ, ఆ తర్వాత స్వర్గం చేరడానికో, మోక్షం పొందడానికో విముఖత చూపుతున్నారు. ఎందుకంటే, అలా జరిగితే నీకు సేవ చేసే సువర్ణావకాశం చేజారి పోతుందని వారి భయం. ఓ స్వామీ! నీ కిదే సుప్రభాతం."

ఈ శ్వేత వరాహకల్పంలో వేంకటాద్రి దేవునికి మిక్కిలి గొప్ప మహిమ ఉంటుందని పురాణ ప్రసిద్ధి. పురాణాల ప్రకారం అత్యంత గొప్ప ఆధ్యాత్మిక

శక్తి శ్రీవేంకటాచలానికి ఉంది. ఆ శక్తి ఈ శ్వేతావరాహకల్పం చివరిదాకా ఉంటుంది. అందువల్ల శ్రీవేంకటేశ్వరస్వామిని సేవించి తరించడానికీ, ప్రత్యక్ష సాన్నిధ్యం అనుభవించడానికీ ఇదొక అరుదైన అవకాశం. అది మన అదృష్టం కూడా. అందువల్ల ఈ విషయం తెలుసుకొని భక్తులు తమ జీవితాలు అశాశ్వతమని తెలుసుకొని, ఉన్నంతలో స్వామిసేవకే తమ జీవితాన్ని అంకితం చేసి స్వామి అనుగ్రహాన్ని పొందాలి. స్వామి పాదధూళికి భక్తుల కోర్కెలు తీర్చే శక్తి ఉంది. దాన్ని శిరస్సున ధరిస్తే, అది మనకు స్వామి ఇచ్చే రక్షణ నిస్తుంది.

ఇక్కడ కల్పం అంటే ఎన్ని సంవత్సరాలన్నది మనం తెలుసుకోవడం మంచిది. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని నాలుగు యుగాలున్నాయి. ఈ నాలుగు యుగాలు 1000 సార్లు పునరావృత్తమైతే అది ఒక కల్పం. కృతయుగానికి 17,28,000 సంవత్సరాలు. అదే త్రేతాయుగానికి 12,96,000 సంవత్సరాలు. ద్వాపర యుగానికి 8,64,000 సంవత్సరాలు. అదే కలియుగానికి 4,39,000 సంవత్సరాలు. అందువల్ల, శ్రీవేంకటేశ్వర స్వామిని సేవించి తరించడానికీ, ప్రత్యక్ష సాన్నిధ్యం అనుభవించడానికీ నిశ్చయంగా ఇదొక అరుదైన అవకాశం.

**20. త్వద్గోపురాగ్రశిఖరాణి నిరీక్షమాణాః**
**స్వర్గాపవర్గపదవీం పరమాం శ్రయంతః ।**
**మర్త్యా మనుష్యభువనే మతిమాశ్రయంతే**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలపతీ! స్వర్గమోక్షాలను పొందేవారు, మార్గమధ్యంలో నీ గోపురశిఖరాలను చూచి, ఈ మానవలోకంలోనే నిన్ను సేవించే భాగ్యం ఉందనీ, నీ అనుగ్రహంవల్ల అది భూమిపైనే ఉందనీ, అందువల్ల సదా నీ



సేవలో నిమగ్నమై ఈ భూమిపైనే ఉండి పోవాలనీ ఉవ్విళ్లూరుతుంటారు. ఓ స్వామీ! నీ కిదే సుప్రభాతం."

జీవి తన పుణ్యకాలవ్యవధి మాత్రమే స్వర్గంలో ఉండగలడు. ఆ కాలవ్యవధి పూర్తికాగానే తిరిగి భువిపైకి రాక తప్పదు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు : "తేతం భుక్త్వా స్వర్గలోకం విశాఖా క్షీణే పుణ్యే మర్త్యలోకం" – మనుష్యులు స్వర్గాన్ని పొందగోరి వేదాల్లో చెప్పిన ఎన్నో పుణ్యకార్యాలూ, త్యాగాలూ చేస్తారు. ఎంతో కష్టపడి దాన్ని సాధించి తమ కోరికలు తీర్చుకొన్నా ఈ కలియుగంలో సులభసాధ్యమైన హరి అర్చావతారాన్ని సేవించుకోలేమేమో అని సంశయించి, భూమి మీదే ఉండి ఆ స్వామి సేవలో తరించిపోదామనే ఆలోచనలో ఉండిపోతున్నారు. ఎందుకంటే, స్వర్గం చేరడం, మోక్షం పొందడం అనేవి కేవలం మనకు పునర్జన్మలూ, మరణాలూ తప్పించగలవే కానీ, స్వామి సాన్నిధ్యాన్ని ఇవ్వవు.

**21. శ్రీ భూమినాయక దయాదిగుణామృతాబ్ధే**
**దేవాధిదేవ జగదేక శరణ్యమూర్తే ।**
**శ్రీమన్ననంత గరుడాదిభి రర్చితాంఘ్రే**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీదేవీ భూదేవీ నాయకా! దయాగుణాలకు అమృతసముద్రంవంటి వాడవూ, సర్వలోక శరణ్యుడవూ నీవొక్కడివే. అనంత, గరుడాది సేవకులు పూజించే పవిత్రమైన పాదాలు కలవాడవు. ఓ శ్రీవేంకటాచలపతీ! నీ కిదే సుప్రభాతం."

శ్రీ వేంకటేశ్వరుని దయాగుణాన్నీ, కరుణాదృష్టినీ ఇతర పవిత్రమైన గుణగణాలనీ ఈ శ్లోకం చెబుతోంది. స్వామి సృష్టించిన ప్రాణులకు అపచారం చేసే తత్త్వం ఎక్కువ. అలాటి ప్రాణులపై స్వామి చూపే కరుణార్ద్ర దృష్టిని

ఎన్నలేము. ఆ స్వామికరుణ లేకుండా పాపాలకు నివృత్తి లేదు. సకల జగత్తుకు అతడే రక్షకుడు. సకల ప్రాణులూ ఆ స్వామి పాదాలను శరణు వేడితేనే వాటికి రక్షణ లభిస్తుంది. శివుని అపరఅవతారంగా భావించే శంకరాచార్యులు తమ షట్పదీ స్తోత్రంలో ఇలా పేర్కొన్నారు :

**"దామోదర గుణమందిర సుందర వదనారవింద గోవింద**
**భవ జలధి మథన మందర పరమందర మపనయత్వం మే**
**నారాయణ కరుణామయ కరవాణి తావకౌ శరణం**
**ఇతి షట్పదీ మదీయే వదన సరోజే సదా వరంతు!"**

"ఓ నారాయణా! కరుణాపూర్ణా, సకల సద్గుణసంపన్నా, సృష్టికర్తైన బ్రహ్మను నీ నాభిలో గల్గిన పద్మనాభా! కమలవదనా! ఓ గోవిందా! పరిపూర్ణ హృదయంతో నేను నీ పాదాలచెంత శరణాగతి చేస్తున్నాను. ఈ షట్పదీస్తోత్రం సదా నా నోట పలుకుతూ ఉండుగాక!"

ఇలాంటి భావనలనే ఎందరో గొప్ప యోగులూ, పరమ భాగవతులూ చెప్పారు. వైష్ణవాచార్యుల గురించి చెప్పనక్కర్లేదు. మహావిష్ణువూ, దామోదరుడూ, గోవిందుడూ ఐన శ్రీవేంకటేశ్వరుడే అందరికీ శరణ్యం దయా గుణం అతని ముఖ్యగుణం. అందరి ఆశాదీపం అతడే. సాక్షాత్ కృష్ణుడే భగవద్గీతలో "సదా నన్నే ధ్యానిస్తూ, ఇతర ఆలోచన లేవీ లేకుండా కేవలం నన్నే ధ్యానిస్తూ ఉండే నాభక్తుల యోగక్షేమాలనూ, వారు పొందలేని దానిని పొందడానికి వీలుగా వారి శ్రద్ధా భక్తులనూ నేనే సంరక్షిస్తుంటాను (యోగక్షేమం వహామ్యహం)" అని చెప్పాడు. స్వామి వైభవాన్ని వర్ణించేటపుడు, స్వామి గీతలో చెప్పిన 'అభయం' గూర్చి ఇక్కడ ప్రస్తావనకు వచ్చింది. ప్రేమ, భక్తిపూరితమైన ప్రార్థనలు చేస్తూ, భక్తులు నిల్చి స్వామిని మేల్కొల్పడానికి సంసిద్ధులై ఉన్నారు. ఇది స్వామికి నిజమైన మేలుకొల్పు.



**22. శ్రీ పద్మనాభ పురుషోత్తమ వాసుదేవ**
**వైకుంఠ మాధవ జనార్దన చక్రపాణే ।**
**శ్రీవత్స చిహ్న శరణాగత పారిజాత**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలపతీ! నాభిలో పద్మం కలవాడా! పురుషోత్తమా! వాసుదేవా! వైకుంఠా! లక్ష్మీపతీ! జన అనే రాక్షసుని సంహరించిన జనార్దనా! చక్రపాణీ! శ్రీవత్సమనే చిహ్నాన్ని కలవాడా! శరణు కోరినవారికి పారిజాతమైన వాడా! నీ కిదే సుప్రభాతం."

ఈ శ్లోకాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, మనం 'పద్మనాభ', 'పురుషోత్తమ', 'వాసుదేవ', 'వైకుంఠ', 'మాధవ', 'జనార్దన', 'చక్రపాణి' అనే పేర్లకున్న అర్థాలను బాగా తెలుసుకోవాలి. 'పద్మనాభ' అనేదాన్ని మొదటి పేరుగా ఎన్నుకోవడంలో ఎంత ఔచిత్యం ఉంది. స్వామి నాభినుంచి కమలం వెలువడింది. దాని నుంచి బ్రహ్మ ఉద్భవించాడు. అంటే, ఆయన సృష్టికర్తకే సృష్టి కర్త. అందరికన్నా, ఈ సృష్టికన్నా కూడా సర్వోత్తముడాయన. అందువల్ల ఆయన కీర్తన అనేది వర్ణనాతీతమైనదీ, అనంతమైనదీ కూడా. అది యోగముద్రలో ఉన్న స్వామి చైతన్య మూర్తిగా తెలియడం కోసమే. స్వామికి ప్రార్థన చేయడమనేది ప్రపంచాన్ని మేల్కొల్పడానికే.

'పద్మనాభ' అనే పేరు తర్వాత చెప్పిన పేరు 'పురుషోత్తమ'. పురుషోత్తమ అంటే పురుషులలో ఉత్తముడైనవాడు అని అర్థం. శ్రీహరి సకలప్రాణులలో ఉత్తమోత్తముడు. అది సహజమే. ఎందుకంటే, ప్రాణులందరిలోని ప్రాణమతడే. అందువల్ల పురుషులను లెక్కించేటపుడు ఆదిదేవుడైన అతడే ఆదిపురుషుడౌతాడు. "వసంత్యస్మిన్ జగతీతి వసు:, వాసుశ్చాసౌ దేవశ్చ – వాసుదేవ:" అని గూఢార్థం. ఈ జగమే అతనిలో ఇమిడి ఉంది. దానిని

ఆనందంగా, కేవలం తన సంకల్ప మాత్రాన శ్రీహరి వెలికి తెచ్చాడు. అంతేకాదు. "వసః నివాసే జగతి వస్త్వయమితీవా" అన్నారు. శ్రీహరి 'వాసుదేవ' ఎలా అయ్యాడంటే, ఆయన ఈ జగత్తులో ఉన్నాడు. తన లోపల, బయట కూడా జగత్తును కలిగి ఉన్నాడు. ఇది స్వామి సర్వాంతర్యామిత్వాన్ని సూచిస్తుంది. ఈయన లేని దేదీ లేదు. అందుకే శ్రీవేంకటేశ్వరుని కీర్తనలో ఈ పేరునూ జోడించడం జరిగింది. వేంకటేశ్వరుడే ఈ జగత్తుకు కర్త, భర్త, ఉద్ధార్త కూడా. అంటే సృష్టి చేసేవాడూ, భరించేవాడూ, లోకాలను ధరించినవాడు– అన్నీ అతడే. అందుకే వాసుదేవ అనే పేరెంతో సముచితంగా ఉంది.

'వైకుంఠ' అనే పేరు కేవలం హరి నివాసమైన వైకుంఠం మాత్రమే కాదు. దీనికింకో అర్థం కూడా ఉంది. స్వామి ఎత్తిన అనేక అవతారాల్లో ఒకానొక మన్వంతరంలో వికుంఠ అనే భక్తురాలికి పుత్రునిగా జన్మించాడు. మానవ రూపంలో అలా జన్మించినా, స్వామి భక్తుల కోర్కెలు తీర్చాడు. వికుంఠ అన్న భక్తురాలు స్వామిని దేవకికీ, ఇతర స్త్రీలకూ జన్మించినట్లే తనకూ కొడుకుగా జన్మించమని వేడుకొంది. అటువంటి అరుదైన తల్లులు కోరే కోర్కెల పుణ్యమా అని మనవంటి అల్పజీవులకు స్వామిని మన మధ్యనే సేవించుకొనే భాగ్యం కల్గింది. ఎలాంటి కోర్కెలు తీరాలన్నా శ్రీవేంకటేశ్వరుని సేవించడ మొక్కటే మార్గం. ఈ విషయం తెలిసిన భక్తులందరూ స్వామిని మేల్కొల్పి ఆ స్వామి కరుణా కటాక్ష వీక్షణానికి పాత్రులు కావాలని ఉవ్విళ్లూరుతున్నారు.

ఇక ఐదవపేరు అయిన 'మాధవ' అనేది. తల్లి శ్రీలక్ష్మికి భర్త అనే అర్థమే కాకుండా, మరొక ముఖ్యమైన అర్థాన్ని కూడా చెబుతుంది. ''మధూయతే శత్రూ నితి''–అంటే క్రూర శత్రువుల మదిలో భీతిని కలిగించేవాడు అని అర్థం. ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని మనం తలచినంతనే మన శత్రువులకు భీతి కలగక మానదు. మాధవ అనే పదానికి "యదుపుత్రుడైన మధు వంశంలో జన్మించాడు గనక మాధవుడయ్యాడని" మరో అర్థం కూడా ఉంది. వాసుదేవ అంటే వసుదేవుని పుత్రుడు అని ఎలాగైతే అంటామో, మాధవ అన్నా అలాటి అర్థమే వస్తుంది.



స్వామి ఆరో పేరుగా 'జనార్దన' అని పిలవడం జరిగింది. "సముద్ర మధ్యవర్తినో జనాన్నో వానితి జనార్దన:" – జనాస్ అనే రాక్షసుడు సముద్రుడు మధ్యలో నివసించి అల్లకల్లోలానికి కారకుడైనాడు. అతనిని సంహరించాడు గనకే శ్రీహరి జనార్దనుడైనాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ అన్నది శ్రీహరి సహజ గుణం. మన సంసారసాగరంలో మన కెందరో శత్రువులు ఎదురవుతారు. అలాటి శత్రువులను సంహరించి మనలను కాపాడేవాడు సహజంగానే శ్రీవేంకటేశుడొక్కడే. అంతే కాదు. "ప్రళయకాలే జనాన్ సర్వానపి అర్దయతీతి జనార్దనః" – అంటే ప్రళయకాలంలోనూ, కల్పాంతంలోనూ సకలజనుల కష్టాన్ని తొలగచేసే సర్వశక్తి సంపన్నుడతడే. భయంకరమైన విపత్తు సమయాల్లో భీతినీ చెడునూ కలిగించేవారిని తొలగించేవాడూ, ధర్మవిరుద్ధ జీవులను నాశనం చేసేవాడూ శ్రీహరి ఒక్కడే. సరియైన సమయంలో విశ్వాన్ని నాశనం చేసే లయ కారకుడు శ్రీహరి.

ఇక ఏడవపేరుగా ఏడుకొండలకూ అధిపతైన సప్తగిరీశ్వరుని 'చక్రపాణి' అని భక్తుడు సంబోధించాడు. సుదర్శన చక్రాన్ని ప్రయోగించేవాడు శ్రీహరి. ఈ సుదర్శన చక్రాన్ని జయించడం, శాంతింప జేయడం ఎవరి తరమూ కాదు. స్వామిమీద భక్తి, స్వామిపాదాల శరణాగతి – ఈ రెండు మాత్రమే దానిని శాంతింప చేయగలదు. సుదర్శనచక్రానికి ఎదురే లేదు. తనకు ఉద్దేశించిన ఏ పనినైనా పూర్తి చేసిగానీ ఆ చక్రం మరలిపోదు. పావనమైన

ఏడుకొండలమీద నెలకొన్నాడు శ్రీదేవుడు. దుష్టశిక్షణ చేసి, పరమపవిత్రులనూ, సన్మార్గులనూ రక్షించేవాడే చక్రపాణి. ఆ సప్తర్షులూ సమక్షంలో ఉన్నారు. అందుకే ఇది స్వామి సుప్రభాతమయింది.

ఇలా ఏడు నామాలూ స్మరించాక, వాటిల్లో స్వామికి ఉండే విలక్షణమైన విషయాన్ని ఈ సుప్రభాత శ్లోకం మనకు గుర్తు చేస్తున్నది. 'శ్రీవత్స' మనేది స్వామివారి వక్షఃస్థలంపైన వున్న ముద్ర. అది శ్రీమహాలక్ష్మికి గుర్తు. అందువల్లే వేంకటేశ్వరుడు శ్రీనివాసుడయ్యాడు.

దివ్యకాంతుల మధ్య, స్వామివారి దివ్యమంగళరూపాన్ని చూసినపుడు ఈ శ్రీవత్సాన్ని మనం స్పష్టంగా గుర్తించవచ్చు. సర్వలక్షణసంపన్నుడు శ్రీహరి. ఈ సంసారసాగరం మధ్యలో ఉన్న పారిజాతవృక్షమతడు. చెంతచేరిన వారి కోర్కెలు తీర్చేది పారిజాతవృక్షం. భక్తులైన వారెవరైనా ఈ పారిజాత వృక్షాన్ని శరణు పొందవచ్చు.

అందువల్లే సుప్రభాతశ్లోకాలన్నిటిలో ఈశ్లోకాని కెంతో ప్రాముఖ్యం ఉంది. శ్రీ వేంకటేశుని మహిమాప్రకాశం యావత్తూ ఈశ్లోకం మీద ఆధారపడి ఉంది.

**23. కందర్పదర్పహర సుందర దివ్యమూర్తే**
**కాంతా కుచాంబురుహ కుట్మల లోలదృష్టే ।**
**కల్యాణ నిర్మలగుణాకర దివ్యకీర్తే**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"మన్మథుని దర్పాన్ని అణిచివేసే అతి సుందరమైన ఆకారం గలవాడా! నీ ప్రియురాలికుండే తామరపూలవంటి స్తనాలపై ప్రసరించే చూపులున్నవాడా, సకల కల్యాణ నిర్మలగుణాలకు నెలవైనవాడా, అనంత దివ్యకీర్తి గల ఓ శ్రీవేంకటాచలపతీ! నీ కిదే సుప్రభాతం."



స్వామిది దివ్యసుందరమైన రూపం. ఆతని అందం మన్మథునే జయించిన పరమశివుని సైతం సమ్మోహన పరిచింది. "పుంసాం మోహన రూపాయ" – అంటే, పురుషులను సైతం ఆకర్షించే మోహన రూపం ఆ స్వామిది. అంతటి అద్భుతమైన రూపంగల స్వామి చూపులు తన ప్రియసతియైన శ్రీలక్ష్మికుండే తామర పూలవంటి ప్రేమపూరిత స్తనాలపై ఓరగా పడుతున్నది. ఆ స్వామిని మనం భక్తితో కొలిచినపుడు అంతే ప్రేమ పూరితమైన చూపులను ఆ తండ్రి మనపై చూపుతాడు. ఈ శ్లోకాన్ని మనం శంకరాచార్య విరచిత కనకధారా స్తవంలోని కింది శ్లోకంతో పోల్చవచ్చు.

**"ముగ్ధా ముహుర్విదధతీ వదనే మురారేః**
**ప్రేమత్రపా ప్రణిహితాని గతాగతాని ।**
**మాలా దృశోర్మధుకరీవ మహోత్పలేయా**
**సామే శ్రియం దిశతు సాగర సంభవాయాః ॥"**

"సముద్ర తనయ లక్ష్మీదేవి అందమైన చూపులు తన పతియైన శ్రీహరి మోముపై కాంతి నింపుతున్నది. లక్ష్మీదేవి చూపులు మహావిష్ణువు చూపులతో కలిసినపుడు, ఆ రెండూ బిడియంతోనూ, ప్రేమతోనూ వెనుదిరిగిపోతున్నాయి. ఆ ప్రేమకిరణాల ప్రవాహం అలా సాగిపోతూ ఉంటుంది. ఆ కిరణాల ప్రవాహంలో కనీసం ఒక్క కరుణ కిరణాన్నైనా నావైపు పడేలా చేసి, నన్ను కరుణించి, నన్ను సుసంపన్నుని చేయి తల్లీ!" అని కనకధారాస్తవంలోని పై శ్లోకం చెబుతోంది.

శంకరాచార్యులు తల్లి లక్ష్మీదేవిని వేడినట్లు, సుప్రభాతకారుడు ఈ సుప్రభాతంలో శ్రీహరిని వేడుకొంటున్నాడని వేరుగా చెప్పనక్కర్లేదు. సుప్రభాతవేళ స్వామి తన ప్రేమపూరిత నయనాలతో తన సతి లక్ష్మీదేవివైపు చూసే సమయంలో ప్రేమపూరిత ఆశీస్సులందించి వారి శరణ్యంలో ఉన్నామనే భావనను తనకు కల్గించమని భక్తుడు ఈ శ్లోకంలో వేడుకొంటున్నాడు.

**24. మీనాకృతే కమఠ కోల నృసింహ వర్ణిన్**
**స్వామిన్ పరశ్వథ తపోధన రామచంద్ర ।**
**శేషాంశ రామ యదు నందన కల్కిరూప**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ దేవా! లోకోద్ధరణకై మీన, కూర్మ, వరాహ, నరసింహ, వామన, శ్రీరామ, పరశురామ, బలరామ, శ్రీకృష్ణ, కల్కి అనే పది అవతారాలనూ దాల్చావు. ఓ శ్రీవేంకటాచలాధీశా! నీ కిదే సుప్రభాతం."

స్వామి దశావతారాలనూ, ఆయన కీర్తినీ ఇక్కడ వర్ణించడం జరిగింది. అసలు భగవంతుడు గీతలో ఇలా చెప్పాడు:

**"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్ ।**
**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥"**

"జననమరణాలకు దేవదేవుడు అతీతుడే అయినా, ఈ భువిలో ధర్మానికి హాని కలిగి అధర్మం బాగా వృద్ధి చెందినపుడు ధర్మోద్ధరణకూ, దుష్టశిక్షణకూ, శిష్టరక్షణకూ ఒక పవిత్ర సంకల్పంతో ఆ స్వామి అవతార మెత్తుతాడు." స్వామి అలా ఎత్తినవే దశావతారాలు. అవి స్వామి వైభవాన్నీ, గొప్పదనాన్నీ చాటుతాయి.

నేటి అర్చావతారమైన శ్రీవేంకటేశునికి దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనే సంప్రదాయాన్ని కొనసాగించే సమగ్రశక్తి ఉంది. అందుకే ఇక్కడ స్వామి దశావతారాల ప్రస్తావన వచ్చింది. సుప్రభాతంతో సకలభక్తుల కోర్కెలు స్వామి తీరుస్తాడని స్వామి లీలావిభూతి నిక్కడ ప్రస్తుతించడం జరిగింది.



**25. ఏలా లవంగ ఘనసార సుగంధి తీర్థం**
**దివ్యం వియత్సరితి హేమఘటేషు పూర్ణమ్ ।**
**ధృత్వాఽద్య వైదికశిఖామణయః ప్రహృష్టాః**
**తిష్ఠంతి వేంకటపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలపతీ! బ్రాహ్మణోత్తములు ఏలకులు, లవంగాలు, పచ్చకర్పూరం మొదలైన సుగంధ ద్రవ్యాలతో కూడిన దివ్యమైన ఆకాశగంగా తీర్థాన్ని బంగారు బిందెల నిండుగా నీ ఆరాధన కోసం తెచ్చి సంతోషంగా వేచి ఉన్నారు. నీ కిదే సుప్రభాతం."

స్వామి నిత్యపూజకోసం సామగ్రిని పూర్తిగా సిద్ధం చేశారనీ, స్వామి నిత్యపూజాదికాలు చేయడానికి వేదబ్రాహ్మణుల సమూహం సంసిద్ధంగా ఉందనీ స్వామికి ఈ శ్లోకం విన్నవిస్తున్నది.

సప్తర్షులు, ఇతర గ్రహాధిపతులే వేచి ఉన్నపుడు సామాన్య భక్తులు స్వామి సేవకై వేచి ఉండటం వింత ఏముంది! పెద్ద పెద్దవాళ్లే ఆ దేవదేవునికి దాసానుదాసులు అయినప్పుడు సామాన్యుల సంగతి వేరే చెప్పాలా!

**26. భాస్వానుదేతి వికచాని సరోరుహాణి**
**సంపూరయంతి నినదైః కకుభో విహంగాః ।**
**శ్రీవైష్ణవా స్సతతమర్థితమంగళాస్తే**
**ధామాశ్రయంతి తవ వేంకట సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలాధీశా! సూర్యోదయమౌతోంది. కమలాలు వికసిస్తున్నాయి. పక్షులు కిలకిలారావాలతో నాలుగు దిక్కులనూ నింపుతున్నాయి. శ్రీవైష్ణవులు సకల శుభాలనూ కోరి నీ సన్నిధిలో వేచి ఉన్నారు. స్వామీ! నీ కిదే సుప్రభాతం."

శ్రీవైష్ణవపూజావిధాన మాచరించే భక్తులు కూడా స్వామిని మేల్కొల్పడానికి ఆయన సన్నిధిలో వేచి ఉన్నారు. స్వామి కరుణతో మాత్రమే వారికి మంగళం చేకూరుతుంది. సూర్యోదయమైందని తెలిసి ఆకాశమంతా ఆనందాన్నిచ్చే పక్షుల కిలకిలారావాలతో నిండిపోయింది. కమలాలు పూర్తిస్థాయిలో వికసించాయి. వాతావరణమంతా సూర్యోదయంతో స్వామిసేవకు సంపూర్ణంగా సంసిద్ధమైంది. ఇక శ్రీవైష్ణవుల గురించి చెప్పనక్కర్లేదు. అందరూ ఆ స్వామిసేవకై సంసిద్ధులై ఉన్నారు.

**27. బ్రహ్మాదయస్సురవరా స్సమహర్షయస్తే**
**సంతస్సనందనముఖాస్త్వథ యోగివర్యాః ।**
**ధామాంతికే తవ హి మంగళ వస్తుహస్తాః**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**

"ఓ శ్రీవేంకటాచలపతీ! మహర్షులతో కూడిన బ్రహ్మాది దేవతలు, సనంద యోగీశ్వరులు, నీ పూజకు అవసరమైన సకల మంగళకరమైన వస్తువులను ధరించి నీ గుడి ముందు ముకుళిత హస్తాలతో వేచి ఉన్నారు. నీ కిదే సుప్రభాతం."

స్వామి గుడిముందు వేచి ఉన్న వారందరి గురించీ, వారి పవిత్రత గురించీ ఈ శ్లోకం మళ్ళీ గుర్తు చేస్తున్నది. వారంతా స్వామి దర్శనానికై ఎంతో ఆత్రుతగా వేచి ఉన్నారు. ఆలస్యాన్ని ఏమాత్రం భరించలేక పోతున్నారు. కాబట్టి వెంటనే లేచి, 'కరుణించు స్వామీ!' అని ఈ శ్లోకంలో భక్తుడు వేడుకొంటున్నాడు.

**28. లక్ష్మీనివాస నిరవద్యగుణైక సింధో**
**సంసారసాగరసముత్తరణైక సేతో ।**
**వేదాంతవేద్యనిజవైభవ భక్తభోగ్య**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥**



"ఓ దేవా! లక్ష్మికి నివాసమైన శ్రీనివాసా! కల్యాణ గుణసాగరా! సంసార సాగరాన్ని దాటించే వంతెనవంటివాడా! వేదాంతోపనిషత్తులసారం ద్వారా నీ వైభవాన్ని తెలిపేవాడా! ఓ భక్తభోగ్యుడా! ఓ శ్రీవేంకటాచలపతీ! నీ కిదే సుప్రభాతం."

శ్రీవేంకటేశుని దివ్యవైభవం అంతా శ్రీవారి వక్షఃస్థలంపైన నివసించే లక్ష్మీదేవిపైన ఆధారపడి ఉంది. 'శ్రీ' తన నివాసమైన శ్రీనివాసుని ఎదలో ఉంటూ, ఆ స్వామి ద్వారా అందరికీ సకల సంపదలనూ సౌభాగ్యాలను ఇస్తోంది, కల్యాణ గుణసాగరుడిగా, సంసార సాగరాన్ని దాటించే వంతెనలాగా ఉండి మొసళ్ళూ, ఇతర విషసర్పాల బారినుంచి తప్పించేలా చేస్తోంది. అందువల్ల శ్రీవేంకటేశ్వరుని చేయూత లేనిదే మనం సంసారసాగరాన్ని దాటలేం. వేదాలన్నీ స్వామి కీర్తిని చాటుతున్నాయి.

ఉపనిషత్తులూ, ఇతర పవిత్ర ప్రవచనాలూ – సర్వమూ ఆ వేదాల నుంచే వచ్చాయి. అటువంటి దివ్యమూర్తిని కొలిచిన భక్తులందరూ ఆ స్వామి వైభవాన్నీ, మహిమనూ తెలుసుకొని పూర్తి స్థాయిలో ఆనందిస్తూ స్వామిని తమలో, తమ చుట్టూ తెలుసుకొంటూ, తమతోనే ఉన్న దివ్యానుభూతిని పొందుతున్నారు.

**29. ఇత్థం వృషాచలపతే రిహ సుప్రభాతం**
**యే మానవాః ప్రతిదినం పఠితుం ప్రవృత్తాః ।**
**తేషాం ప్రభాతసమయే స్మృతిరంగభాజాం**
**ప్రజ్ఞాం పరార్థసులభాం పరమాం ప్రసూతే ॥**

"ఏ మానవులైతే ఈ శ్రీవేంకటేశ సుప్రభాత ప్రార్థనను తప్పనిసరిగా ప్రతిరోజూ భక్తితో పఠిస్తారో, వారికి శ్రీవేంకటేశస్మరణ అనేది మోక్షాన్ని గూర్చిన జ్ఞానాన్ని అత్యంత సులభంగా ప్రసాదిస్తుంది."

వృషాచలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని సుప్రభాతాన్ని పఠిస్తే భక్తునికి వచ్చే ఫలితాన్ని ఈ ఒక్క శ్లోకం చెబుతూ ఉంది. ఆత్మసాక్షాత్కారాన్నిచ్చే భగవానుడే శ్రీవేంకటేశ్వరుడు. ఆయనే ధర్మస్వరూపుడు. వృషాచలమనేది ధర్మానికి ప్రతిరూపం. అది స్వామి దివ్యకాంతి. వృషాచలం ఆ దివ్యకాంతిని భక్తులపై ప్రసరింప చేస్తుంది. బుద్ధినీ, జ్ఞానాన్నీ ఇచ్చి స్వామి పాదాలవద్దకు చేరే సులభమార్గాన్ని చూపుతుంది.

ఈ కలియుగంలో యజ్ఞయాగాదులద్వారా మోక్షసాధన అనేది ఎంతో దుర్లభం. అయితే, మిగిలిన యుగాలలోకన్నా కలియుగంలో అతి సులభమైన సాధనం ఉంది. అదే భగవన్నామసంకీర్తన. ఒక్క భగవన్నామ సంకీర్తనతో, స్వామివారి ప్రార్థనతో స్వామి అనుగ్రహాన్ని సంపాదించకోవచ్చు. మోక్షం పొందవచ్చు. అదే భక్తి యోగం. ఈ భక్తియోగమే జ్ఞాన యోగానికి దారి చూపుతుంది. స్వామిపై భక్తీ, అనుక్షణం శ్రీదేవుని నామస్మరణా–ఈ రెండూ పరమార్థ జ్ఞానాన్ని అంటే మోక్షాన్ని ఇచ్చే మార్గాలు. ఈ ఆత్మశోధన గావించే శ్రీవేంకటేశ్వరుని సుప్రభాతాన్ని ప్రతి ఉదయం ఎవరైతే క్రమం తప్పకుండా చదువుతారో, వారు పరమార్థజ్ఞానాన్ని ప్రసాదించే శ్రీవేంకటేశుని కృపకు పాత్రులవుతారు.

**సుప్రభాతం సంపూర్ణం.**

* * *

# స్తోత్రం

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారిని సుప్రభాత పఠనంతో మేల్కొల్పిన తర్వాత ఆ స్వామిని కీర్తిస్తూ, ఆ స్వామి దివ్య గుణగణాలను వర్ణిస్తూ స్తోత్రం కొనసాగుతోంది. శ్రీవేంకటేశ్వరుని గుణగణాలను కీర్తించడంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. శ్రీవేంకటేశ స్తోత్రం అనే మహత్తరమైన, అత్యంత శక్తిమంతమైన ప్రార్థనను ఎల్లవేళలా ఎవరైనా పాడుకోవచ్చు.

**1. కమలాకుచచూచుక కుంకుమతో**
**నియతారుణితాతుల నీలతనో ।**
**కమలాయత లోచన లోకపతే**
**విజయీభవ వేంకటశైలపతే ॥**

"ఓ వేంకటాచలధీశా! మహాలక్ష్మీ కుచద్వయాలపైనుంచి నిత్యమూ రాలిన కుంకుమ నీ దేహంపై పూతలా ఏర్పడి నందువల్ల, నీలమేఘపు రంగు దేహం ఎరుపు రంగులోకి మారింది. ఓ కమలాక్షా! ఓ విశ్వాత్మకా! నీకు జయమగు గాక."

దయామయుడూ, ప్రేమస్వరూపీ అయిన శ్రీవేంకటేశ్వరుని గుణగణాలను కీర్తిస్తూ, స్వామికి జయం కలుగుగాక! అంటూ స్తోత్రాన్ని ప్రారంభమవుతున్నది. శ్రీహరిప్రేమ అపారమైనది. శ్రీమహాలక్ష్మి అతని వక్షఃశయ్యపై ఉండటం వల్ల ఆ ప్రేమ పరిపూర్ణమైంది. లక్ష్మీదేవి స్వామి హృదయంలో నివసించడంవల్ల ఆమెకు స్వామిపై ఉన్న మోహాతిశయం వల్ల నీలమేఘ శ్యాముడైన స్వామి దేహం ఎర్రగా మారింది. మహర్షులు పురుషుని (అంటే స్వామిని) ప్రార్థించేటపుడు ప్రకృతిని కూడా

ప్రార్థించడమనేది సర్వసాధారణమైన విషయం. అలా ప్రకృతినీ, పురుషులనూ ప్రార్థించడంవల్లే స్వామి కరుణా కటాక్షవీక్షణం లభిస్తుందని వారి నమ్మకం. శంకరాచార్యులు తమ కనకధారా స్తవంలో సరిగ్గా ఇలాటి కరుణా కటాక్ష వీక్షణాలకోసమే ప్రార్థన చేయడం జరిగింది. దయామయుడైన శ్రీహరి, మాత శ్రీమహాలక్ష్మి– వీరిద్దరి ప్రేమాను రాగపూరితమైన చూపుల నుంచి దీనుడైన భక్తుని బ్రోవమని ప్రార్థించే కనకధారాస్తవ స్తోత్రమెంత శక్తివంతమైందో మనకు తెలిసిందే. శ్రీస్తుతి అని అలాంటి స్తోత్రమే మరొకటుంది. వేదాంత దేశికుల శ్రీస్తుతి ఇలా అంటుంది :

**"దత్తేశోభాం హరి మరకతే తావకీ మూర్తిరాద్యా**
**తన్వీ తుంగ స్తనభర నరా తప్త జాంబూనదాభా ।**
**యస్యాం గచ్ఛన్త్యు దయ విలయైర్నిత్యమానంద సింధౌ**
**విచ్ఛావైగోలసితా లహరీ విభ్రమ వ్యక్తయస్తే ॥"**

"ఓ మహాలక్ష్మీ దేవీ! స్తనభారం చేత ఒదిగి ఉండటంవల్ల నీ స్వర్ణ కాంతులు స్వామిపై పడటంవల్ల అతని మూర్తి మరింత దివ్యతేజంతో ప్రకాశవంతమైన మరకత మణిలా వెలుగొందుతున్నది. సముద్రంనుంచి అలలు ఎలాగైతే విడిపోయి తిరిగి సముద్రాన్నే కలుస్తాయో, అలాగే నీ వివిధరూపాలు కూడా నీనుంచి వెలుపలికి వస్తూ అతనిలో ఆనందాన్ని ఇనుమడింప జేస్తూ అతనిలోనే లీనమవు తున్నాయి."

ఇక్కడ 'అతడు' అంటే దివ్యమంగళరూపుడైన లక్ష్మీపతి. నీలమేఘశ్యాముడైన అతడు తల్లివల్ల బంగారు కాంతులను సంతరించుకొని ప్రకాశిస్తున్నాడు. అదే విధంగా తల్లి లక్ష్మీదేవి స్తనాలపైనుంచి స్వామి మీదకు రాలిన కుంకుమ స్వామి నీలమేఘ వర్ణాన్ని బంగారు రంగులోకి మార్చిందని ఈ శ్లోకంలో పోల్చడం జరిగింది. స్వామి వక్షంలో లక్ష్మి నివసించడంవల్ల



ఆ స్వామి శోభ మరింత ఇనుమడించిందనీ, అందువల్ల స్వామి ప్రకాశమేకాక స్వామి ప్రేమకూడా రెండింతలైందనీ, అందువల్లే విశ్వాన్నే పాలించే ఏకైక లోకనాయకుడయ్యాడనీ, అతనికి జయం కలగాలనీ ఈ శ్లోకంలో చెప్పడం జరిగింది.

**2. సచతుర్ముఖ షణ్ముఖ పంచముఖ**
**ప్రముఖాఖిల దైవతమౌళిమణే ।**
**శరణాగత వత్సలసారనిధే**
**పరిపాలయ మాం వృషశైలపతే ॥**

"ఓ వృషాచలదేవా! నాల్గుముఖాలున్న సృష్టికర్త బ్రహ్మ, ఆరు ముఖాలున్న షణ్ముఖుడు, ఐదు ముఖాలున్న శివుడు మొదలైన సమస్త దేవతలందరికీ తలమానికమైనవాడవు. శరణన్నవారిని ప్రీతితో బ్రోచేవాడవు. నన్ను రక్షించు."

స్వామి ప్రకాశం బ్రహ్మాది దేవతల ప్రకాశాన్ని మించింది. శ్రీవేంకటేశ్వరుడు ఈ దేవతలకే దేవుడు. బ్రహ్మదేవుడు నాలుగు ముఖాలున్నవాడు. నాలుగు ముఖాలూ నాలుగు పురుషార్థాలకు ప్రతీక. ధర్మార్థ కామ మోక్షాలనే నాల్గు జీవిత పరమార్థ లక్ష్యాలు. ఈ నాలుగు పురుషార్థాలను సాధించడానికే స్వామి మనకొక శరీరాన్నిచ్చాడు. దాని ద్వారా మనం లక్ష్యసాధన చేయాలి. అతడే ఈ విశ్వాన్ని సృష్టించినవాడు. అలాగే ఆరు ముఖాలతో షణ్ముఖుడు అంటే సుబ్రహ్మణ్యస్వామి– అరిషడ్వర్గాలను జయించే శక్తి కలవాడు. కామం (కోరిక), క్రోధం (కోపం), లోభం (అత్యాశ), మోహం (వ్యామోహం), మదం (గర్వం, అధికార వ్యామోహం), మాత్సర్యం (అసూయాద్వేషాలు) – అనేవే అరిషడ్వర్గాలు. సుబ్రహ్మణ్యస్వామి తన ఆరుముఖాలతో ఈ ఆరు శత్రువులనీ నియంత్రించే శక్తిగలవాడు. అతడు మన పంచేంద్రియాల దుశ్చేష్టలనూ నాశనం చేసి

ఆరో ఇంద్రియమైన సంసారసాగరాన్ని దాటే వివేకాన్ని ఇచ్చేవాడు. పరమశివుడంటే పంచాక్షరీ మంత్రాధిదేవత. ఈ విశ్వాన్ని, సమస్త చరాచరసృష్టినీ పంచ భూతాత్మకంగా సృష్టించి నియంత్రించేవాడు. వీరంతా పరమశివుని ద్వారానే ముక్తిని పొందుతారు. మనుష్యులకు సంసారబంధాలనుంచి ముక్తిపొంది మోక్షాన్నిచ్చే ఈ దేవతలందరికీ ఆ శక్తిని ఇచ్చింది దేవాధిదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు. అతడెవరో కాదు. అతడు త్రిమూర్త్యాత్మక శక్తి. అందువల్లే, బ్రహ్మాది దేవతలంతా శ్రీవేంకటేశునిలోనే ఉన్నారనే విషయాన్ని ఈ శ్లోకం తేటతెల్లం చేస్తోంది.

**3. అతివేలతయా తవ దుర్విషహై**
**రనువేలకృతై రపరాధశతైః ।**
**భరితం త్వరితం వృషశైలపతే**
**పరయా కృపయా పరిపాహి హరే ॥**

"ఓ దేవా! శ్రీహరీ! నా హద్దును మీరి తెలిసో తెలియకో ఎన్నోసార్లు నీయెడల అపరాధం చేశాను. ఓ వృషాచలపతీ! నన్ను క్షమించు. దయాసాగరా! త్వరగా నాపై దయ చూపి నన్ను కాపాడు."

మానవులైన మనం తెలియక ఎన్నో పొరపాట్లూ, తప్పులూ చేస్తూంటాం. ధర్మం తప్పుతూంటాం. స్వామికి కోపాన్ని తెప్పిస్తూంటాం. ఒక్కొక్కసారి ఇవన్నీ తెలిసే చేస్తూంటాం కూడా. ప్రకృతి మాయలో మనం ఇలా చేయడం సహజమే. అందుకే మనం స్వామి ప్రార్థన చేస్తాం కూడా :

**"కాయేన వాచా, మన సేంద్రియైర్వా**
**బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్**
**కరోమి యద్యత్ సకలం పరస్మై**
**నారాయణా యేతి సమర్పయామి!"**



"ఈ దేహం, మనస్సు, వాక్కు, ఇంద్రియాలతో చేసిన పనులన్నీ ఆ దేవదేవుడైన నారాయణునకే సమర్పిస్తున్నాను." దయాసాగరుడైన అతడొక్కడే మనలను రక్షించేవాడు. మనం పాపకార్యాలు చేయకుండా మనలను బ్రోచేవాడూ అతడే. అందుకే అతని శరణుకోరి మనం చేసే ప్రతీ దానినీ అతనికే అర్పించడం ఎంతైనా సబబు. అదే నిజమైన శరణాగతి.

ఆ విషయం తెలుసు కాబట్టే, ఈ మూడో శ్లోకంలో స్వామి శరణాగతి కోరడం జరిగింది.

**4. అధివేంకటశైల ముదారమతే**
**ర్జనతాభిమతాధిక దానరతాత్ ।**
**పరదేవతయా గదితా న్నిగమైః**
**కమలాదయితా న్న పరం కలయే ॥**

"ఓ స్వామీ! నీవు భక్త సులభుడవు. భక్తులు కోరినదాని కన్నా ఎన్నోరెట్లు అధికంగా వరాలను ఇచ్చే ఉదారుడవు. వేదాలు నిన్ను పరమ దైవంగా కొనియాడాయి. ఓ శ్రీపతీ! ఓ కమలాపతీ! నీవుకాక మరొక దైవం లేదు. ఉన్నా, నేను నిన్ను తప్ప వేరొకరిని కొలవను."

శ్రీ వేంకటేశ్వరునికి శరణాగతి చేసి, ఆయన్ని తప్ప వేరొకరిని తలచకుండా కేవలం శ్రీవేంకటేశ్వరునే శరణు వేడినపుడు ఆ స్వామి అనుగ్రహం తప్పక కలుగుతుంది. ఒక దైవమూర్తిని ఎంచుకొని కేవలం ఆ మూర్తికే మనస్ఫూర్తిగా పూజ చేయాలి. అతడే ఇష్టదైవమవుతాడు. మన కోర్కెలు తీరుస్తాడు. దైవానికి ఎలాటి ఆకారమూ, మితులూ, గుణాలూ, సంపూర్ణతా ఉండవు. దైవం భావాలకు అందనిది. ఆ యా ఆకార, గుణ సంపూర్ణతా భావాలను ఆపాదించి మనం ఆ దైవాన్ని ప్రార్థించినపుడు, ఆ యా వర్ణనల కనుగుణంగా ఆ స్వామి ఆ యా ఆకార, రూపాలను దాల్చి

భక్తులను బ్రోచే పనిని చేపడ్తాడు. ఉదాహరణకు, ఏనుగులన్నిటికీ రాజైన గజేంద్రుడు స్వామికి సంపూర్ణ గుణాల నాపాదిస్తూ, సృష్టికర్తగా, దీన రక్షకునిగా, లయకారకునిగా రకరకాలు ప్రార్థించినపుడు కాకుండా, కేవలం మహావిష్ణువుగా, సంరక్షకునిగా గుణాలను ఆపాదించి ప్రార్థించినపుడు మాత్రమే దాన్ని కాచి రక్షించాడు. మొసలినోటనుంచి గజేంద్రునికి విముక్తి కల్గించాడు. అందువల్ల ప్రార్థించేటపుడు మనం ఏకమనస్కులై ఒకే రూపాన్ని అంకితభావంతో ప్రార్థించాలి.

మనం ఒకచోట బాగా లోతుగా త్రవ్వామనుకోండి. ఒకే చోట త్రవ్వినపుడు అక్కడ మనకు నీళ్లు దొరుకుతాయి. అదే పదిచోట్ల కొద్దికొద్దిగా త్రవ్వి వదిలేస్తే మనకు మిగిలేది శ్రమా, నిరాశానూ. అందువల్ల ముందు మనం ఇష్టదైవాన్ని ఏర్పరచుకోవాలి. ఆ దైవాన్నే కొలవాలి. అంతే. ఈ కలియుగంలో శ్రీవేంకటేశుని మించిన ఇష్టదైవమెవరున్నారు? శ్రీవేంకటాచలాన్ని మించిన చోటు జగత్తులో లేదు. శ్రీవేంకటేశుని మించిన దైవం లేదు. బ్రహ్మాండపురాణం ఇదే చెబుతుంది :

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

వేంకటాద్రికి మించిన స్థానం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశుని మించిన దైవం భూతభవిష్యత్ కాలాల్లోకూడా లేదు. ఈ తీరుగ కొలిచినవారికి కొంగు పైడిగా నిల్చి బ్రోచే దైవం శ్రీవేంకటేశ్వరుడొక్కడే.

**5. కలవేణురవావశ గోపవధూ**
**శతకోటివృతాత్స్మరకోటిసమాత్ ।**
**ప్రతివల్లవికాభిమతాత్సుఖదాత్**
**వసుదేవసుతాన్న పరం కలయే ॥**



"ఓ వాసుదేవా! నిను వినా మరొక దైవాన్ని నే నెరుగను. ఓ గోపీలోలా! మనోహరమైన నీ మురళీగానంతో పరవశలైన వేవేల గోపికలు నిను చుట్టుముట్టి ఉండవచ్చు. కోటిమన్మథుల సాటియైన నీవు గోపికలందరిలోనూ ప్రియంగా మెలిగి సుఖాన్నిస్తూంటావు."

సకల జనులపై తన దయను ప్రసరింపచేయడంలో స్వామి నిష్పక్షపాతి. ఆయన తన పవిత్ర వేణుగానంతో అందరినీ ఆకర్షిస్తాడు. అదికూడా మానవుడు తన అహంభావాన్ని వదిలి దైవంతో కలిసి మమేకమౌతాడు, ఆ స్వామి గొప్పదనాన్నే స్మరిస్తూ ఉండిపోతాడు. గోపికలను ఈ విషయంలో ఒక గొప్ప ఉదాహరణగా చెప్పుకోవాలి. కృష్ణుడి ఆధ్యాత్మికాకర్షణకు లోనైన గోపికలు తమకిష్టమైన వాటిని కూడా వదిలేసి, వేరే ధ్యాస లేకుండా స్వామినే కొలవ నారంభించారు. స్వామిమురళీగాన విలోలురైన గోపికలు తమ పవిత్రభక్తితో గొప్ప మునులనూ, ఋషులనూ మించిపోయారు. అందుచేత ఆ గోపికల భక్తి అనేది సకల జనులనూ ఒక చక్కని ఉదాహరణగా నేటికీ నిలిచి ఉంది.

ఆ దేవదేవుని భక్తులంతా తమను తాము గోపికలుగా భావించి స్వామిని సేవించి కృతార్థులయ్యారు. ఇలాగే ఆండాళ్ స్వామిని చేరింది. శ్రీచైతన్యులు కూడా స్వామిని తెలుసుకొని ఆయన్ను చేరింది ఈవిధంగానే. అతని కృష్ణప్రేమ అందరికీ కృష్ణుడు చూపిన ప్రేమలాగానే తోచింది. అందువల్ల శ్రీవేంకటేశుని స్తోత్రం చేసేటపుడు అలాంటి దృఢనిశ్చయంతోనే, "దేవదేవుడంటే సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వరుడే. ఏడుకొండలవాడే! అతడే శ్రీకృష్ణుడు! అతడే వాసుదేవుడు!" అని ఈ శ్లోకం నొక్కి వక్కాణిస్తున్నది.

**6. అభిరామగుణాకర దాశరథే**
**జగదేకధనుర్ధర ధీరమతే ।**

**రఘునాయక రామ రమేశ విభో**
**వరదో భవ దేవ దయాజలధే ॥**

"ఓ దేవా! సకల కల్యాణ గుణాభిరామా! దశరథ తనయా! జగదేక దనుర్ధారియైన రఘునాయకా! శ్రీరామా! రమకు పతియైన లక్ష్మీపతీ! దయా సముద్రా! ఓ మహావిష్ణూ! ఓ దేవదేవా! మాకు వరాలిచ్చి మమ్ము రక్షించు!"

ఈ శ్లోకం శ్రీవేంకటేశుని శ్రీరామునిగా వర్ణిస్తున్నది. సుప్రభాత ఆరంభ శ్లోకంలో ఇదివరకే కౌసల్యా సుప్రజారామా! అని శ్రీవేంకటేశుని సంబోధించడం మనం గమనించాం. శ్రీరాముడు సకల పవిత్రగుణాలకు నిధియైనవాడు. వాల్మీకికి నారదుడు వర్ణించి చెప్పినట్లు, శ్రీరాముడు శక్తిమంతుడు, ధర్మశీలి, సన్మార్గుడు, ధన్యుడు, సత్యశీలుడు, లోకోపకారి, రాజనీతిజ్ఞుడు, సమ్మోహనాకారుడు, దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు. అంత గొప్పవాడు కాబట్టే అన్నికాలాల్లోనూ శ్రీరాముడు గొప్పదేవుడై కులమతాలకతీతంగా సకల పూజలందుకొన్నాడు. ఆ శ్రీరాముడే శ్రీవేంకటేశ్వరుడు. ఈ శ్రీవేంకటేశ్వరుడే శ్రీరాముడు. దానిలో సందేహమే లేదు. అతడే దాశరాథి. కేవలం దశరథుని పుత్రుడవటంవల్ల దాశరథి అనే పేరు రాలేదు. తండ్రి దశరథునికిచ్చిన మాటతప్పక, ఇనుమడించిన ధర్మాచరణతో తన గౌరవానికి భంగం కలగకుండా నిలబెట్టాడు.

అదే విధంగా, భక్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం శ్రీవేంకటేశ్వరుని నిశ్చయమైన తీరు. ఆ నిల బెట్టుకోవడంలో ఎన్ని అడ్డంకు లొచ్చినా స్వామి చలించడు. అతని లక్ష్యం బాణంకన్నా పదునైంది. ఆయన తన భక్తుల శత్రువులపై తన బాణాన్ని సంధించాడంటే, శత్రునాశనం తథ్యం. అతడు రమేశుడు. రమ అంటే లక్ష్మీదేవి. ఆమెకు పతి కాబట్టి రమాపతీ, లక్ష్మీపతి అయ్యాడు. భక్తులపై వారిరువురి ప్రేమ అపారమైంది.



మహాలక్ష్మితో కూడిన స్వామి. మరింత అపారమైన దయా, ప్రేమా చూపగలడు. అందువల్ల లక్ష్మీ సమానుడై స్వామి సహజంగానే వరప్రదాయకుడయ్యాడు.

అందువల్ల అత్యద్భుతమైన లక్ష్మీసమేతుడైన స్వామివారి దయా గుణాన్ని ఈ శ్లోకం వర్ణిస్తున్నది.

**7. అవనీతనయా కమనీయకరం**
**రజనీకర చారుముఖాంబురుహమ్ ।**
**రజనీచర రాజతమోమిహిరం**
**మహనీయమహం రఘురామమయే ॥**

"భూదేవికి కూతురైన సీతాదేవి వరించిన అందగాడా! చందమామను మించిన అద్భుతమైన మోముగలవాడా! రాక్షసరాజైన రావణాసురుడనే దట్టమైన చీకటికి సూర్యునివంటివాడవు. ఓ రఘుకుల తిలకా! సీతారామా! మహానుభావా! నిన్ను నేను శరణు వేడుతున్నాను."

స్వామి సీతారాముడు. సకల లోకరక్షకుడు. మనం ఇంతకుముందే చెప్పుకున్నట్లు స్వామిని మనం సీతాపతిగానే తెలుసుకోవాలి. సీతాపతి దయానిధి. సృష్టిపై అవ్యాజప్రేమగల ప్రేమ స్వరూపి. ఎందుకంటే "అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా" అన్నారు.

సీతాసమేతుడైన శ్రీరాముడు ఇనుమడించిన శోభతో అంతులేని ప్రకాశంతో వెలుగొందుతుంటాడు. ఎట్లైతే చంద్రుణ్ణి చూడగానే మనకెంతో సంతోషమూ, ఆనందమూ కల్గుతుందో దానికన్నా ఎన్నోరెట్లు అధికంగా సంతోషమూ, ఆనందమూ శ్రీరామదర్శనంవల్ల కల్గుతుంది. అందుకే ఆయన శ్రీరామచంద్రుడయ్యాడు. రాక్షసరాజూ, అహంభావీ అయిన రావణాసురుడు

దట్టమైన చీకటిని పోలినవాడు. ఆ చీకటిని పారద్రోలే సూర్యుడే శ్రీరాముడు. రావణునికి దేవతలందరికన్నా, దేవదేవునికన్నా, ఈ సృష్టికన్నా తాను గొప్పవాడినని అహంకారం. తన అహంకారంవల్ల తనకొచ్చే ప్రమాదాలనుకూడా అతడు ఊహించలేకపోయాడు. అందరూ వద్దని వారించినా వినకుండా తన సహజధోరణిలో సీతాదేవిని చెరపట్టాడు. చివరికి శ్రీరాముని చేతిలో హతుడైనాడు. దీని అంతరార్థమేమిటంటే, నేటి సమాజంలో మనమంతా రావణుని మాదిరే సహజమైన అహంకారంతో, అహంభావంతో, నిర్లక్ష్యధోరణిలో, ఇంద్రియలోలురమై ఆ స్వామినే మర్చిపోయి అంధకారంలో ఉండిపోతున్నాం, అంధకారాన్ని కేవలం సూర్యరశ్మి మాత్రమే తొలగిస్తుంది.

అదే విధంగా, మన స్వాభావికమైన అజ్ఞానం అంతం కావాలంటే అది కేవలం శ్రీవేంకటేశుని దయాశక్తి వల్లే సాధ్యమౌతుంది. ఆ స్వామి దయను మనం పొందాలంటే, మన సర్వాన్నర్పించి ఆయనకు శరణాగతిని చేయాలి. సూర్యునితో ఎందుకు పోల్చామంటే శ్రీరాముడు ఆ సూర్యవంశంలో పుట్టాడు కాబట్టి. శ్రీరాముడిలో సూర్యుని సకలగుణాలూ, శక్తీ ఉన్నాయి. "ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ" అని ఆయన చాలా శక్తిమంతుడు. విశ్వాత్మకుడతడు. తనలో ఉండే సూర్యుని తానే నియంత్రిస్తున్నాడు. అందువల్ల మనలో ఉండే తామస గుణాలను నాశనం చేయాలంటే, అది స్వామికే వీలౌతుంది. ఈ ఆధునిక కాలంలో మనలో చాలామంది అహంకారులై, తమకన్నా అధికులే లేరని గర్వంతో విర్రవీగుతూ, దేవుడే లేడని చెప్పడానికి కూడా వెనకాడటం లేదు. మనం చేసే పనుల ఫలితాలు మన కృషివల్లే, మన పురుషాహంకారంవల్లే వస్తున్నాయని వీరంతా చెబుతుంటారు. అది చాలా తప్పు.



ఈ సృష్టిలో మహనీయుడై, ఉత్తమోత్తమగుణాలతో సర్వశక్తిమంతుడైనవాడు శ్రీవేంకటేశుడొక్కడే. సకలగుణాభిరాముడైన దేవుడతడు. అతని గుణాలను గానం చేసి, ఆయన కృపాదృష్టి మనపై ప్రసరించేలా మనం ప్రార్థించాలి. అలా ప్రార్థించినపుడు ఆ కృపాదృష్టి మనపై ప్రసరించినపుడే, మనస్సు శాంతిని పొందుతుంది. ఈ రహస్యాన్ని నారదుడు వ్యాసమహర్షికి చెప్పాడు. మహాభారతంవంటి గొప్ప కావ్యాన్ని వ్రాసి సమాజానికి అవసరమైన సకల ధర్మాలను నిర్దేశించాక కూడా ఆధ్యాత్మికశాంతి కానీ, మనశ్శాంతి కానీ లభించలేదని వ్యాసుడు ఖిన్నవదనుడై ఉంటే, సంగతి తెలుసుకున్న నారదుడు స్వామి దివ్యగుణగణాలను స్మరించడంగానీ, కీర్తించడంగానీ వ్యాసుడు చేయలేదనే విషయాన్ని గుర్తించాడు. వ్యాసునికి ఆ విషయాన్ని ఎరిగిస్తూ, "ధర్మ ప్రవచనాలు ఎన్ని చేసినా, భగవంతుని దివ్య గుణగణాలను కీర్తించకపోతే దానివల్ల ఎలాంటి ఫలితమూ లేదు. స్వామిని గుర్తించి సదా ఆయన గుణగానం చేసినపుడే ఆ స్వామి సంతోషించి అనుగ్రహిస్తాడు. ఆ గుణగానంలో భూమిపై స్వామి ఎత్తిన అవతారవిశేషాలూ, అద్భుత లీలలూ చోటుచేసుకోవాలి. అందుకే, భక్తులైనవారంతా ఆ స్వామి చరిత్రనూ గుణగణాలనూ కీర్తిస్తూ సదా గానం చేస్తుండాలి" అని నారదుడు చెప్పాడు.

ఆ విషయాన్ని తెలుసుకొన్న వ్యాసమహర్షి అటు తర్వాత మహాభాగవతాన్ని వ్రాశాడు. అందులో స్వామి చరిత్రనూ, దివ్యలీలలనూ గానం చేశాడు. మహాభాగవత రచన పూర్తికాగానే ఆయన పొందిన ఆధ్యాత్మికానందం మాటలకు అందనిది. అందువల్ల స్వామి దివ్యనామ సంకీర్తన చేయడం, స్వామి చరిత్రను గానం చేయడంవల్ల మనకు ఆత్మ సాక్షాత్కారం పొందడానికి కావలిసిన మనోబుద్ధి, సహన శక్తీ లభిస్తాయి. మనమేదో కోరి దాన్ని సాధించాలనుకున్నా స్వామిని ప్రార్థించాల్సిందే. స్వామిని ఎంత భక్తితో కొలిచి పూజిస్తే, అంత బాగా సంతోషించి

అనుగ్రహిస్తాడు. అందువల్ల ఆ మహనీయుని సదా స్మరించాలి. అతనికంటే దైవం మరి వేరే లేదు. అతడే ఈ లోకరక్షకుడు.

**8. సుముఖం సుహృదం సులభం సుఖదం**
**స్వనుజం చ సుకాయమమోఘశరమ్ ।**
**అపహాయ రఘూద్వహ మన్య మహం**
**న కథంచన కంచన జాతు భజే ॥**

"ఏ సమయంలోనైనా సరే, నేను రఘుకులంలో జన్మించిన శ్రీరాముని తప్ప వేరొకరిని ప్రార్థించను. సుందరమైన ముఖ వర్చస్సుగల అతని మనస్సు చాలా మెత్తనిది. అందరూ అతనిని సులభంగా ఆశ్రయించవచ్చు. అతడు ఆశ్రయించిన వారందరికీ సుఖాన్నిస్తాడు, మంచి తోబుట్టువులున్నవాడు, సదా శక్తితోకూడి మొక్కవోని బాణాలు కల్గినవాడు."

ఇక్కడ స్వామి యొక్క దివ్యసుందర రూపాన్ని, మెత్తనైన మనస్సునూ భక్తుడు గుర్తు చేస్తున్నాడు. సృష్టికర్తా చతుర్ముఖుడూ అయిన బ్రహ్మ తన ప్రార్థనలో ఇలా అన్నాడు :

**"వందే రామం జగద్వంద్యం సుందరాస్యం శుచిస్మితమ్ ।**
**కందర్పకోటి లావణ్యం కామితార్థ ప్రదాయకమ్ ॥"**

విశ్వపూజితుడై, మన్ననగల్గిన శ్రీరాముని సుందరరూపాన్నీ, చెదరని చిరునవ్వునూ, తన ప్రేమనూ పంచే కొన్నికోట్ల రెట్టింపు అందం గలవాడు, భక్తుడు కోరిన కోర్కెలన్నీ తీర్చేటి భక్తసులభుడూ అయిన శ్రీరామునికి బ్రహ్మ నమస్కరిస్తున్నాడు. 'సుందరాస్యం' అంటే, అందరినీ తనవైపుకు ఆకర్షించే అందమైన మోము అని అర్థం. తులసీదాసు శ్రీరాముని ఆకర్షించే మోమును ఇలా వర్ణించాడు : శ్రీరాముని దివ్యస్వరూపాన్ని తనివితీరా చూసిన పంచముఖ



శివుడు తన పది హేను కళ్లతో (శివుడు మొదట పంచముఖుడు. ఒక్కో ముఖానికి 3కన్నులు వెరసి 15 కన్నులు) ఆనందంగా ఆ రూపాన్ని గ్రోలాడు. ఆ అందాన్ని చూడగానే శివుని మూడో కన్ను శక్తిహీనమై పోయింది. చతుర్ముఖుడైన బ్రహ్మ తన ఎనిమిది కళ్లతో ఆ దివ్యస్వరూపాన్ని చూస్తూ, తన ఐదవ ముఖం పోయినందువల్ల 'మరో రెండుకళ్లతో ఆ స్వామి రూపాన్ని చూసే భాగ్యం పోయిందే' అని విచారించాడు. అయితే షణ్ముఖుడైన సుబ్రహ్మణ్యస్వామి తన ఆరు జతల కళ్లతో (అంటే బ్రహ్మకున్న దానికన్నా ఒకటిన్నర రెట్లు అధికంగా) ఆ దివ్య సుందరరూపాన్ని చూసి ఎల్లలు లేని ఆనందాన్ని పొందాడు. ఇక ఇంద్రుడు తన వేయికళ్లతో ఆస్వాదిస్తూ ఇతర దేవతలకు అసూయ కల్గించాడు. శ్రీరామునిది చెప్పనలవికాని అందం. ఐతే, అందరికి సులభంగా ఆ దివ్య దర్శనం కలుగుతుంది. దానికి చెయ్యాల్సిందల్లా ఒక్కటే. ఆయన్ని మనః పూర్వకంగా పూజించడమే. శ్రీరామ నామస్మరణ చిత్తశుద్ధితో చేస్తే చాలు. అలా చేసినవారి కోర్కెలు తీర్చడం అతని వంతు. దానికోసం మనం తపస్సు చేయవలసిన అవసరం లేదు. సుఖత్యాగాలు చేయాల్సిన అగత్యమూ లేదు. కొలిచిన వారలకు కొంగుపైడి అతడు. ఆయన శరణాగతిని వేడినవారికిక భయం లేదు. శరణాగతులను రక్షించి బ్రోవడమే తన నిత్య కర్తవ్యంగా నిలిచి బ్రోచే దేవుడు శ్రీరాముడు. అతని తోబుట్టువులైన లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల గూర్చి కూడా ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. వారు అందానికీ, మేలైన గుణాలకీ, శ్రేష్ఠతకీ ప్రతీకలు.

సకల విధేయతతో సర్వాన్ని త్యజించి లక్ష్మణుడు పూర్తిగా శరణాగతి చేసి స్వామిని ఎల్లవేళలా అంటిపెట్టుకొని సేవించాడు. పురాణాల్లో ఇంతటి గొప్ప వ్యక్తిత్వం ఉండే పాత్రే కనిపించదు. భరతుడు కూడా తక్కువేం కాదు. సోదర భావాన్ని, ధర్మాన్ని వాటి ఆచరణనీ మనకు బోధించేవాడు

భరతుడు. శత్రుఘ్నుడు శ్రీరామునికి మరో ప్రాణం. ప్రాణమిత్రుడు కూడా. ఈ ముగ్గురు సోదరులూ శ్రీరామునిలో అంతర్భాగమే కానీ వేరు కాదు. అది సహజమే. ఎందుకంటే, లక్ష్మణుడు ఆదిశేషునికి ప్రతిరూపం. స్వామి శంఖం అతనిని వీడదు. స్వామి సర్వశక్తీ అతనిలో ఉన్నాయి. భరత శత్రుఘ్నులే స్వామి శంఖుచక్రాలు. స్వామికున్న మనస్సునూ, భావనలనూ, ఆలోచనలనూ కలిగి ఉండే ఇలాటి సోదరులు ఉండటమే ఎంతో గొప్పవిషయం. అందువల్ల మానవులైన మనమంతా ఇదే సోదరభావాన్ని అందరికీ మనం చూపాలన్నది ఈ స్తోత్ర శ్లోకంలోని అంతరార్థం.

శ్రీరాముని బాణాలకు తిరుగులేదు. వాటిని స్వామి దేనిపైనైనా ప్రయోగిస్తే, అవి లక్ష్యాన్ని సాధించిగానీ వెనక్కిరావు. పరశురాముడు శ్రీరాముని ఎదుట నిల్చినపుడు తన బాణం చాలా శక్తిమంతమైందనీ, అది నిరుపయోగం కాదనీ శ్రీరాముడు చెప్పాడు. శివధనస్సు విరిచినందుకు కోపాన్ని ప్రదర్శించిన పరశురాముని ముందు శ్రీరాముడు విష్ణు ధనస్సును అందుకొని బాణాన్ని సంధించి ఇలా చెప్పాడు :

**"బ్రాహ్మణోసీతి పూజ్యోమే విశ్వామిత్ర కృతేన చ**
**తస్మాచ్ఛక్తో నతే రామ మోక్తుం ప్రాణహరం శరమ్**
**ఇమాం పాదగతిం రామ తపోబల సమార్జితమ్**
**లోకాన ప్రతి మాన్వాతే హరిష్యామి యదిచ్ఛసి**
**నహ్యాయం వైష్ణవో దివ్యస్సారః పరపురం జయః**
**మోఘః పతతి వీర్యేణ బల(పరా)దర్ప వినాశనః ॥"**

"ఓ పరశురామా! బ్రాహ్మణుడవైన నీవు విశ్వామిత్రమహర్షి సంబంధీకుడైనందువల్ల నీవు నాకు పూజనీయుడవు. అందువల్ల నిన్ను నాశనం చేయగల నా బాణాన్ని నీపై సంధించదల్చుకోలేదు. ఎక్కడికంటే అక్కడికి వెళ్లే నీ శక్తిని నాశనమన్నా చేయాలి లేదా నీతపశ్శక్తితో నీవు సాధించిన పవిత్ర ప్రదేశాలనన్నా నాశనం చేయాలి. ఈ రెంటిలో దేన్ని నాశనం చేయమంటావో నీవే నిర్ణయించు. విష్ణువుకు శత్రువులైన వారందరినీ సమూలంగా నాశనం చేయగల శక్తి ఈ బాణాలకున్నాయి. శత్రువులనే కాదు. వారి నగరాలనూ, సైన్యాలనూ కూడా మట్టి కరిపించగలవు. మరి వాటిని ప్రయోగిస్తే, అవి ఆ పని తప్పక పూర్తి చేసిగానీ వెనుదిరగవు."



స్వామి బాణాలు అంత శక్తిమంతమైనవి. అందుకే 'అమోఘ శరమ్' అని స్వామిని సంబోధించడం జరిగింది. కాబట్టి, అసమానమైన అందం గలవాడూ, దయామయుడు తనను నమ్మినవారిని బ్రోచే శ్రీరాముడే శ్రీవేంకటేశ్వరుడు. అతడే సర్వరక్షకుడు. అందువల్ల మనం వేరొకరిని తన సంరక్షకునిగా, దేవునిగా తలచే ఆలోచనే చేయక్కర్లేదు.

**9. వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే వేంకటేశ ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥**

"శ్రీ వేంకటేశ్వరుడు తప్ప వేరే దిక్కు దైవమూ నాకిక లేదు. దేవుళ్లకే దేవుడు శ్రీవేంకటేశ్వరుడని నేననుకొంటున్నాను. నా బుద్ధి మనస్సునూ సదా అతనిమీదే కేంద్రీకరించి ధ్యానిస్తుంటాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నాపై ప్రసన్నుడవుకా! నన్ను దయతో చూడు! దయచేసి నన్ను కరుణించు. నే కోరింది ప్రసాదించు."

ఈ శ్లోకంలో మరి వేరే ఆలోచనలేకుండా పరిపూర్తిగా శ్రీవేంకటేశ్వరునికి శరణాగతి చేయడం కనిపిస్తుంది. అమాయకులకూ, సాధువులకూ,

దీనులకూ రక్షణను ఇచ్చేవాడు శ్రీవేంకటేశుడొక్కడే. భీకరాతిభీకరమైన శత్రువైనా సరే, తనను శరణు వేడితే రక్షించేవాడు శ్రీవేంకటేశ్వరుడు.

విభీషణుడు శత్రువు తమ్ముడని సుగ్రీవుడు చెప్పినా శ్రీరాముడు విభీషణునికి అభయాన్ని ప్రసాదించాడు. అభయాన్ని ప్రసాదించాక సుగ్రీవుని చూచి శ్రీరాముడు ఇలా చెప్పాడు :

**"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతమ్ మమ**
**అనయైనం హరిశ్రేష్ఠ! దత్తమస్యాభయం మయా**
**విభీషణో వా సుగ్రీవ! యదివ రావణ స్స్వయమ్!"**

"ఎవరైనా సరే! ప్రమాదస్థితిలో ఉండి రక్షించమని నన్ను శరణు వేడి ప్రార్థిస్తే, నే నతనికి రక్షణ నివ్వడానికే సిద్ధంగా ఉంటాను. నా రక్షణ పొందినవారి కలతలూ, ప్రమాదాలూ దూరమౌతాయి. ఓ వానరోత్తమా! అది విభీషణుడైనా సరే. ఆఖరికి రావణుడే వచ్చినా సరే! కరుణించి, నా శరణు ప్రసాదించి అన్ని ప్రమాదాలనూ తొలగించి, వారికి సంపూర్ణమైన క్షేమాన్ని ప్రసాదిస్తాను."

ఇదీ శ్రీరాముడి మతమూ, అభయప్రదానమూ! ఆ శ్రీరాముడే శ్రీవేంకటేశుడూ, శ్రీహరీ కూడా! భక్తుల బాహ్యాంతర్గత శత్రువులను నాశనం చేసేవాడూ మోక్షాన్ని ప్రసాదించేవాడూ అతడే. అందుకే, ఇక్కడ భక్తుడు సకలగుణాభి రాముడనీ, అతడే పరబ్రహ్మమనీ, మనలో ఉండే శత్రువులనూ, మనచుట్టూ ఉండే శత్రువులనూ నాశనం చేసేవాడూ, మోక్షాన్నిచ్చేవాడూ ఒక్క శ్రీవేంకటేశ్వరుడేనని ఈ స్తోత్ర శ్లోకం పునరుద్ఘాటిస్తున్నది.

**10. అహం దూరతస్తే పదాంభోజయుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాం కరోమి ।**



**సకృత్సేవయా నిత్య సేవాఫలం త్వం**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ ॥**

"ఓ ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నీ పాదపద్మాల చెంతచేరి భక్తితో, నిన్ను కొలుస్తున్నాను. నేను నిత్యమూ కొలిస్తే వచ్చే సేవాఫలాన్ని, నిన్ను ఎంతో దూరం నుంచి వచ్చి ఒక్కసారి నేను నీ సేవ చేసినందుకే నాకివ్వు."

ఈ శ్లోకంలో మానవమాత్రుడైన భక్తుడు తన కష్టాలనూ, అసహాయతనూ స్వామికి గుర్తు చేస్తున్నాడు. "ఎపుడో ఒకసారి చాలా దూరం నుంచి నేను వచ్చి ఏడుకొండలు దాటి స్వామిని దర్శించి పూజిస్తున్నాను. ఆ పూజ చేయడాని కెన్నో ప్రాపంచిక విషయాలు అడ్డం పడుతున్నాయి. ఉద్యోగరీత్యా, ఎపుడో గానీ సమయం దొరకడం లేదు. నిత్యమూ ఏడుకొండలపై నిల్చిన స్వామిని కొలవడానికి పోవడం లేదు. అందువల్ల ఎంతో దూరంనుంచి ఎపుడో ఒకసారి వచ్చి గుడిలో నిల్చి కొలిచినా, స్వామిని నిత్యం కొలిస్తే వచ్చే భాగ్యాన్ని ప్రసాదించ" మని ఈ శ్లోకంలో వేడుకోవడం జరుగుతోంది. శ్రీదేవుడు నిజానికి భక్తుల హృదయంలోనే నివసిస్తున్నాడు. ఐతే, అర్చామూర్తియైన, అతిసుందరమైన శ్రీవేంకటేశుని విగ్రహాన్ని నిత్య దర్శించే భాగ్యమే వేరు. ఆ దర్శనంలో స్వామి దివ్యతేజస్సును చూస్తే వచ్చే పుణ్యమూ, లాభమూ వేరు. వాటిని ఎన్నలేము. అయితే భక్తుడు తనకున్న పరిధిలో స్వామిని కొలుస్తూ, ఏడుకొండలపై నిత్యమూ నిలిచి కొలిచినపుడు చూపే కరుణ తనపై సదా చూపమని ఈ శ్లోకంలో వేడుకోవడం కనిపిస్తుంది.

**11. అజ్ఞానినా మయా దోషా నశేషా న్విహితాన్ హరే ।**
**క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే ॥**

"ఓ ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! శేషాచలశిఖామణీ! శ్రీహరీ! మూఢుడనై అజ్ఞానంతో ఎన్నో తప్పులు పొరపాట్లు చేశాను. వాటన్నిటినీ క్షమించు. క్షమించు స్వామీ!"

శ్రీవేంకటేశ్వర స్తోత్రాన్ని ఈ ప్రార్థనా శ్లోకంతో ముగించడం జరుగుతోంది. మానవమాత్రులమైన మనం తెలిసో తెలియకో ఎన్నో తప్పులు చేస్తుంటాము. అజ్ఞానం మనల్ని చుట్టివేస్తుంది. దానికి తోడు ప్రకృతి మాయ కమ్మేయడంవల్ల మనం అసహాయులమై వాటి ప్రభావాలకు లోనైపోతాం. చర్యా, ప్రతిచర్యా ఒక దానికొకటి వ్యతిరేకంగా సమానంగా ఉంటాయి. కర్మ క్షమింపరానిది. కర్మ ఫలితాలను మనం అనుభవించి తీరాల్సిందే. వేరే మ్గారం లేదు. ఐతే ఎలాటి దుష్కర్మ ఫలితాలనైనా తొలగించేది స్వామి కరుణ ఒక్కటే. ఆ స్వామి దివ్యశక్తి అంత గొప్పది. మంచికి మారుపేరైన ఆ దేవుని పరిధిలోనే అన్నీ ఉంటాయి. అతని ఆధీనంలో లేనిదంటూ ఏదీలేదు. సకలప్రాణుల సృష్టికర్త అతడే.

అందువల్ల అన్నీ అతని నియంత్రణా, క్రమశిక్షణలలోనే ఉంటాయి. దైవ ప్రార్థన ఎపుడూ వృథా కాదు. భగవద్గీతలో ఆ దైవమే స్వయంగా ఇలా చెప్పాడు :

**"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥"**

"ధర్మాలన్నిటినీ పరిత్యజించి కేవలం నన్నే శరణుపొందు. సకల పాపాలనుంచి నిన్ను విముక్తుణ్ణి చేసి నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాను. దేనికీ విచారించడం గానీ, కుంగి పోవడం గానీ చేయనక్కర్లేదు."



అందువల్ల మనం మనఃపూర్వకంగా క్షమించమని ఆ స్వామిని ప్రార్థించినంత మాత్రానే అపారమైన స్వామి దయ మనపై వర్షిస్తుంది. అందులో సందేహం లేదు.

ఇక్కడితో స్తోత్రం ముగిసింది. శ్రీవేంకటేశుని స్తోత్రం చేసిన భక్తుని ఈ నమ్మకం సహజంగానే ప్రపత్తికి దారి తీస్తుంది. ప్రపత్తి శ్లోకాలతో తననూ, తన ఆత్మనీ శ్రీవేంకటేశ్వరునికి నివేదన చేస్తాడు భక్తుడు. అదే మార్గాన్ని మనమూ అనుసరిద్దాం. స్వామికి ఆత్మనివేదన చేద్దాం.

**శ్రీవేంకటేశ్వర స్తోత్రం సంపూర్ణం.**

* * *

# ప్రపత్తి

శ్రీవేంకటేశ్వరునికి సంపూర్ణ శరణాగతి చేసే ప్రపత్తి శ్లోకాలను శ్రీవేంకటేశ్వరుని సతియైన పూజ్యమాత పద్మావతీదేవికి నమస్కరిస్తూ ఆరంభించడం మనం గమనించవచ్చు.

**1. ఈశానాం జగతోఽస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్ ।**
**పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్ ॥**

"ఈ లోకానికే యజమానురాలు, శ్రీవేంకటాద్రిదేవుడైన శ్రీమహావిష్ణువు వక్షఃస్థలంలో ఉండి స్వామి దయాగుణాన్ని ద్విగుణీకృతం చేస్తూ, పద్మంలో పద్మాసనంలో కూర్చుని, పద్మాలనే అలంకారంగా చేసుకొని వాత్సల్యాది మేలిమి గుణాలతో నిత్యమూ ప్రకాశిస్తూ, ఈలోకానికే తల్లియైన, భగవతియైన లక్ష్మీదేవికి నేను నమస్కరిస్తున్నాను."

స్వామి శరణాగతిని కోరేముందు లక్ష్మీదేవిని ప్రార్థించడం సమంజసం. ఎందుకంటే ఆమె జగన్మాత. ఈ లోకాన్ని స్వామితో బాటుగా నియంత్రించేది ఆమే. స్వామి అనుగ్రహవీక్షణానికీ, స్వామిదయ మనకు కలగడానికీ కూడా ఆమె కారణమౌతుంది. లక్ష్మీదేవి దయ, జాలి, ప్రేమానుబంధంవంటి గుణాలకు పుట్టినిల్లు. అందువల్ల ఆమె స్వామి వక్షంలో నివసించడంవల్ల ఆ గుణాలన్నీ స్వామికీ అబ్బుతాయి. స్వామికి శరణాగతి చేసినపుడు ఆమె స్వామి భక్తులను అనుగ్రహిస్తుంది. భక్తులు సహజమైన మానవధోరణిలో తెలిసో, తెలియకో ఎన్నో తప్పులు చేసి స్వామి ఆగ్రహానికి గురౌతుంటారు. అలాంటపుడు తల్లిని ప్రార్థిస్తే ఆమె ద్వారా, ఆమె అనుగ్రహంపొంది తద్వారా స్వామి అనుగ్రహాన్ని పొందవచ్చు. అది సహజం కూడా. ఎందుకంటే తల్లికి బిడ్డలందరూ సమానమే. తప్పులు, పొరబాట్లు చేసినా కూడా తన పిల్లలంటే ఆమెకెంతో ప్రీతి. స్వామి అలాటి పిల్లలపై కినుక వహించినా ఆమె "పాపం! మన పిల్లలే కదా! క్షమించి కరుణించండీ!" అంటూ పిల్లలపై జాలితో, ప్రేమతో స్వామికి పిల్లల తరపున విన్నవిస్తుంది. మరి అమ్మమాటకు ఎదురేముంటుంది? ఎందరో భక్తులు అమ్మతో "స్వామిని అనుగ్రహించమని చెప్పవమ్మా!" అంటూ వేడుకొన్న సందర్భాలు ఉన్నాయి. అలాటి భక్తుల్లో భక్తరామదాసును ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అందుకే 'తత్క్షాంతి సంవర్ధినీమ్' అనేది సార్థకమైంది. స్వామి జాలి, దయ, ఓపిక అనేవి తల్లి అనుగ్రహం వల్లే మనకు లభిస్తాయి. అందుకే ఆమెను పద్మాసనంలో కూర్చొన్నట్లుగా వర్ణించడం జరిగింది. స్వామి వక్షమే ఆమె నివాసం. స్వామి 'వక్షమ'నే పద్మం మీద పద్మాసినై కూర్చుంది కాబట్టే ఆమె మన మొరలను దయతో ఆలకిస్తుంది. ఆమె దయ మనకు తథ్యమైనపుడు సహజంగానే స్వామికృప మనకు లభ్యమౌతుంది. ఎందుకంటే, మనపై ఆయన దయ తలచాలంటే ఆ తల్లి అనుగ్రహం తప్పనిసరిగా కావాలి. అందువల్ల ప్రపత్తి శ్లోకాలు ఆ తల్లిప్రార్థనతో ఆరంభం కావడం ఎంతో సముచితంగానూ సమంజసం గానూ ఉంది. వేదాంతదేశికులు తన శ్రీస్తుతిలో కూడా ఇదే శ్లోకంతో తల్లి అనుగ్రహాన్ని స్తుతించడం చూడవచ్చు.

**2. శ్రీమన్! కృపాజలనిధే! కృత సర్వలోక!**
**సర్వజ్ఞ! శక్త! నతవత్సల! సర్వ శేషిన్!**
**స్వామిన్! సుశీల సులభాశ్రిత పారిజాత!**
**శ్రీవేంకటేశ! చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఓ శ్రీదేవా! దయాసముద్రా! సకలలోకాలకూ కర్తవు. సర్వమూ తెలిసిన వాడవు. నీకు ఎవరు నమస్కరించినా వారిపై కరుణ జూపేవాడవు. ఈ

చరాచర సృష్టిలోని ప్రతి ప్రాణియందు నీవే ఉన్నావు. మంచి స్వభావం ఉండేవారికి అత్యంత సులభుడవు. సమర్థుడవు. ఆశ్రితులైనవారికి పారిజాతవంటి వాడవు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ పాదాలే నాకు శరణ్యమని ఆశ్రయిస్తున్నాను."

తల్లి శ్రీలక్ష్మిని దయచూపమని ప్రార్థించిన తర్వాత, స్వామి గుణగణాలను కీర్తిస్తూ దయాసాగరుడైన స్వామి మహిమాన్వితమైన పాదాలకు నమస్కరించడం జరుగుతోంది. సకల జ్ఞానగుణసాగరుడూ, సృష్టిలో సర్వశక్తిమంతుడూ శ్రీవేంకటేశుడే సర్వవ్యాపీ, సర్వజ్ఞుడూ కాబట్టే సాధువులకూ, బాధితకోటికీ ఆధారం శ్రీవేంకటేశ్వరుడు. అందుకే మహిమాన్వితమైన స్వామి పాదాలకు నమస్కరిస్తూ కేవలం స్వామి పాదాలే తనకు సంరక్షణ నివ్వగలవని ఇక్కడ చెప్పడం మనం చూడవచ్చు. స్వామి పాదాలను శరణు కోరడమంటే, సాక్షాత్తూ స్వామిని శరణం కోరడమే. స్వామి పాదముద్రలున్న శ్రీరాముని పాదుకలను సాక్షాత్తూ 'శ్రీరాముని' గానే భావించాడు భరతుడు. అంతేగానీ, 'అవి కేవలం పాదుకలే' అని అనుకోలేదు. అందువల్ల వాటిని సింహాసనంలో ఉంచి, వాటిని సాక్షాత్తూ శ్రీరామునిగా భావించి శ్రీరామునిగానే సంబోధిస్తూ, వాటి అనుజ్ఞ కోరి నిత్య కార్యక్రమాలకు ఉపక్రమించేవాడు. అదీ స్వామి పాదాలకుండే శక్తి. అంతేకాదు. శక్తిమంతుడైన స్వామి నిత్యసత్యుడన్న విషయాన్ని ద్విగుణీకృతం చేసేవి స్వామి పాదాలు. ప్రకృతి పురుషులను స్వామి పాదాలు ప్రతిబింబింప చేస్తాయి.

ప్రవృత్తి, నివృత్తి మార్గాలలో అన్వేషించే భక్తులకు ఊతమిచ్చేవీ ఈ రెండు పాదాలే. స్వామి రెండు పాదాలూ జడమైన, ఆధ్యాత్మికమైన సృష్టి మార్గాలు. నమ్మాళ్వార్ తన 'తిరుమొళి'లో స్వామిని 'పాదాలుగా'నే



భావించాడు. 'తైత్తిరీయోపనిషత్'లో బ్రహ్మాన్ని 'న్యాస' అని సంబోధించడం జరిగింది. 'న్యాస' అనే పదం పాదాలనే అర్థాన్నిస్తుంది. శ్రుతులు 'భూః పాదౌ, పద భ్యాం భూమిః' అన్నాయి. మనకు కారణభూతమైనవీ, మనం కొలిచేవీ, మనల్ని పాలించేవీ ఆ స్వామి పాదాలే.

"పాదోస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతమ్ దివి" అని పురుష సూక్తం అంటుంది. ఈ విశ్వమంతటినీ కలిపి స్వామి పాదాల్లో ఒకటిగా భావించడం జరిగింది. మిగిలిన రెండు పాదాలూ నిత్యమై, స్వర్గంలో ఉన్నాయి. వాటి గూర్చి ఎవరికీ తెలియదు. స్వామి పాదాలకు శక్తీ, మహిమ అనేవి స్వామి ఎత్తిన వామన అవతారంలో బాగా ప్రస్ఫుటమైంది.

స్వామి ఒక పాదంతో ఈ విశ్వాన్నే కొలిచాడు. స్వర్గధామమైన ఆకాశం మీద మనమెవ్వరూ కొలవలేని రెండోపాదాన్ని ఉంచాడు. ఇక మూడోపాదాన్ని బలిచక్రవర్తిని సుతలలోకానికి అణగదొక్కడానికి వాడాడు వామనుడు. ఇతర దేవతల కది సాధ్యం కాని పని. శ్రీహరి పాదాలకున్న శక్తి, ఆకర్షణా అలాంటివి. విశ్వంలోని భక్తులందర్నీ తుమ్మెదలను ఆకర్షించే మకరందపుష్పం లాంటిదే స్వామి పాదాలు. ఆ స్వామి చరణారవిందాలను ప్రార్థిస్తూ శ్రీరాముని మహాభక్తుడైన త్యాగయ్య, విగతజీవునికి ప్రాణాన్ని తిరిగి ప్రసాదింప జేశాడు. ఆయన అమృతవాహిని రాగంలో ఇలా పాడాడు :

**పల్లవి**

**శ్రీరామపాదమా! నీకృప జాలునే!**
**చిత్తానికి రావే (శ్రీరామ)**

**అనుపల్లవి**

**వారిజభవా సనక సనందన వాసవ శ్రీ**
**నారదాదులెల్ల పూజించే (శ్రీరామ)**

**చరణం**

**దారిని శిలయై తాపము తాళక**
**వారము కన్నీ - రును రాల్చగ**
**శూరా! అహల్యను జూచి బ్రోచితా రీతి**
**ధన్యు సేయవే త్యాగరాజు గేయమా!**

త్యాగరాజు ఈ కీర్తనలో స్వామి పాదాలగుణాలను నొక్కి చెప్పడం జరిగింది. శ్రీరాముని పాదాలను శరణు వేడితే చాలు. ఆ పాదాలు కరుణించి తన మనస్సులో నిలిచితే చాలు. స్వామి తనమనస్సులో నిలిచినట్టే. కృప జూపి మనస్సులో నిలవమని ఆ పాదాలను వేడుకొన్నాడాయన. విగతజీవుని పునర్జీవితుని గావించాలంటే శ్రీరాముని పాదాలే శరణములని త్యాగయ్య భావించడమెంతో సముచితంగా ఉంది. ఆ పాదాలకంత శక్తి ఉంది. అవి సామాన్యమైనవి కావు. అవి బ్రహ్మకడిగిన పాదాలు. అవి సనక సనందాదులు, దేవతల కధిపతియైన ఇంద్రుడు, నారదుడు ఇత్యాది వారంతా కొలిచిన పాదాలు. కేవలం ఆ పాదాల ధూళి సోకగానే ఒక బండరాయి అహల్యగా మారింది. ఆమెకు శాపవిమోచన కల్గింది. అంత మహత్తరమైన శక్తి ఆ స్వామి పాదాలకుంది.

అందువల్ల ఆ స్వామిపాదాలను "ఓ శ్రీరాముని పాదమా! రా! నా మదిలోకి రా! ఈ విగతజీవుని పునర్జీవితుని గావించే విధంగా వచ్చి రక్షించు!" అని త్యాగయ్య ప్రార్థించాడు. ఆయన అలా ప్రార్థించడమేమిటీ, ఆ విగతజీవుడు పునర్జీ వితుడవడం ఏమిటీ - రెండూ ఒకేసారి జరిగిపోయింది.

త్యాగరాజు సర్వశక్తి సమన్వితమైన శ్రీరాముని పాదాల గుణగానాన్ని మరెన్నో కీర్తనల్లో కూడా చేశాడు. "గీతార్థము, సంగీత ఆనందము", "నీదు చరణములే గతియని నమ్మితి" అంటూ శ్రీరాముని పాదాలను కీర్తిస్తూ, ఆ



పాదాలశక్తి గురించి హనుమంతునికి తెలిసినంత గొప్పగా మరెవ్వరికీ తెలియదని మనకు తెలియజెప్పాడు.

అంతేకాదు. ఆ పాదాల గుణగానం చేశాడు కాబట్టే హనుమంతుడి కెనలేని దేహశక్తీ, ఆధ్యాత్మికశక్తీ లభించిందనీ, ఆ స్వామి పాదాలను వదలకుండా పట్టుకొని వాటికే సదా సేవ చేసినందువల్లే హనుమ అమర్త్యుడయ్యాడనీ త్యాగయ్య వివరించాడు.

శ్రీరాముడే శ్రీవేంకటేశ్వరుడు గనక ఎవరు ఆ స్వామి పాదాలను శరణువేడినా ఆయన వారిని కాచి రక్షిస్తాడు. అందువల్ల స్వామిపాదాలకుండే ప్రాముఖ్యాన్నీ, వాటికున్న శక్తినీ గుర్తించి వాటిని శరణు వేడి, వాటికి అత్యుత్తమంగా సేవ చేసి ఆధ్యాత్మికంగా, స్వామిని సాక్షాత్కరించుకొని తద్వారా సత్, చిత్, ఆనందాన్ని పొందడం చాలా సులభమనీ, ఆ మార్గం ఉత్తమమైందనీ భావించాడు సుప్రభాతకారుడు. అందువల్లే, ఈ ప్రపత్తి శ్లోకంలో భక్తుడు ఆ స్వామి పాదాలను స్తోత్రం చేశాడు.

**3. ఆనూపురార్పిత సుజాత సుగంధిపుష్ప**
**సౌరభ్య సౌరభకరౌ సమసన్నివేశౌ ।**
**సౌమ్యౌ సదానుభవనేఽపి నవానుభావ్యౌ**
**శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఓ స్వామీ! నీ కాలియందెలదాకా అర్పించిన మేలైన పూల వాసనలకే మరింత సువాసనల నిచ్చే ఈ పాదాలు చక్కగ అమరి, చూడటానికి మరింత అందంగా కనిపిస్తూ నిత్యనూతనమై శాశ్వతానందాన్నిచ్చేవిగా ఉన్నాయి. ఆ శ్రీవేంకటేశ్వరుని పాదాలనే శరణు వేడుతున్నాను."

స్వామి పాదాలు నిత్యనూతన కాంతులను సంతరించుకొనడంవల్ల అవి నిత్యమూ వింత గొల్పుతూ ఉన్నాయి. వాటిని చూసినంతనే వాటిపై

వాలిపోయి శరణు వేడాలనిపిస్తాయి. శ్రీవేంకటేశ్వరుని గర్భగుడిలో చేరి ఆ స్వామిదర్శనం చేయాలని వెళ్ళేవారు ఆ దివ్యమంగళ రూపాన్ని చూస్తూ, ఆ పాదాలవైపు ఒక్కసారి చూస్తే చాలు. ఈ విషయం అనుభవంలోకి వస్తుంది. అనుక్షణం స్వామి కొత్త కొత్తగా కనిపిస్తూంటాడు. స్వామి పూర్తి విగ్రహాన్ని క్షణమాత్రమైనా పూర్తిగా చూచి, గుర్తుంచుకొని ఆస్వాదించడం అసాధ్యం. అనుక్షణం ఆయన రూపకాంతులు మారుతూంటాయి. ఆ విగ్రహాన్ని చూడగనే మైమరచిపోతాం. అద్భుతమైన, మహిమాన్వితమైన ఆ స్వామిపాదాలు దివ్యకాంతులు వెదజల్లుతూ భక్తులనిట్టే ఆకర్షిస్తాయి. ఆ పాదాలకు అర్పించిన పూల సువాసనలకే కొంగొత్త వాసనలను సంతరింపజేసే శక్తి ఆ స్వామి పాదాలకుంది.

స్వర్గధామంనుంచి దేవతలంతా తియ్యని మకరందసహితమైన సువాసనలు వెదజల్లే పూలను తీసుకొచ్చి స్వామి పాదాలకు నిత్యమూ అర్పిస్తూ ఉంటారు. స్వామిపాదాలను తాకినంతనే ఆ పూలు కొత్త సువాసనలు సంతరించుకొంటున్నాయి. ఆ పూలు తియ్యని వాసనలు వెదజల్లుతున్నాయని చెబుతూ, స్వామి పాదాలకున్న శక్తిని ఇక్కడ వర్ణించడం జరిగింది. వేదాంతదేశికులు రచించిన పాదుకాసహస్రంలో కూడా ఇంచుమించు ఇటువంటి వర్ణనే ఉంది. పాదుకాసహస్రంలో 324 శ్లోకం 'శ్రీరంగనాథుని పాదుక వకుళా పుష్పపు సువాసనలను వెదజల్లుతున్నా'యని చెబుతుంది. ఈ వకుళాపుష్పాన్ని నమ్మాళ్వార్‌కు సాంకేతికంగా ఆపాదించడం జరిగింది. ఆయనకు వకుళా భరణమనే పేరును శ్రీ ఆళవందార్ ఆపాదించాడు. తియ్యని సువాసనలను వెదజల్లే స్వామిపాదపద్మాలు వకుళాపుష్పాల సువాసనలను వెదజల్లేవిగా ఉన్నాయని వేదాంత దేశికులు వర్ణించారు.

**4. సద్యో వికాసి సముదిత్వర సాంద్రరాగ**
**సౌరభ్యనిర్భర సరోరుహ సామ్యవార్తామ్ ।**



**సమ్యక్షు సాహస పదేషు విలేఖయంతౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"అసాధ్యమైన వాటిని సుసాధ్యం చేసే స్వామిపాదాలను అరుణ కాంతుల్లో అప్పుడే వికసించి ప్రకాశించి తమ సువాసనలను వెదజల్లే తామరపూలతో పోల్చడం గొప్ప సాహసకార్యమే! దానికి పురిగొల్పిన పవిత్రమైన శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలనే శరణు వేడుతున్నాను."

స్వామి పాదాలనేవి ఎంతో శక్తివంతమైనవే కాదు. దృఢమైనవి కూడా. అవి అసాధ్యమైన పనులను కూడా సులభసాధ్యం చేస్తాయి. మరి ఆ పాదాలను పాదపద్మాలని చెప్పడం ఒకరకమైన సాహసామే. ఎందుకంటే, పద్మాలూ, వాటి రేకులూ చాలాసున్నితంగా ఉంటాయి. వాటితో బ్రహ్మాండమైన స్వామి పాదాలను పోల్చడమా! అలా పోల్చే సాహసం చేస్తున్నానని భక్తుడు భావించాడు. ఐతే, ఇక్కడ భక్తుడు నొక్కి చెప్పే విషయాన్ని గమనించాలి. స్వామిపాదాలు శక్తి సమన్వితమైన గోపురాలు. ఐనా వాటికి తామర పూలకున్న సున్నితమైన స్వభావం ఉంది. అందువల్లే అలా పోల్చడం జరిగింది. దానికి స్వామి విసుగు చెందడనీ, అసలు పద్మాలతో స్వామి పాదాలను పోల్చడానికి స్వామే తనను ప్రేరేపించాడనీ, లేకుంటే అలాటి అసాధ్యమైన పోలికను తాను చేయగలిగేవాడిని కాదని సుప్రభాతకారుని భావన.

**5. రేఖామయధ్వజసుధాకలశాతపత్ర**
**వజ్రాంకుశాంబురుహ కల్పక శంఖచక్రైః ।**
**భవ్యైరలంకృతతలౌ పరతత్త్వచిహ్నైః**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఎవరైతే మంగళకరాలైన రేఖల్లాగా ఉండే ధ్వజం, అమృతకలశమూ, గొడుగూ, వజ్రమూ, అంకుశమూ, పద్మమూ, కల్పవృక్షమూ, శంఖచక్రాలూ

ఇత్యాది పరమార్థ సూచకాలైన శుభచిహ్నాలతో అలంకరించబడి ఉన్నారో, అట్టి శ్రీవేంకటేశ్వరుని దివ్య చరణాలను శరణు వేడుతున్నాను.”

జ్యోతిష్యశాస్త్ర ప్రకారం ఒకరి అరచేతులమీద, అరికాళ్లమీద ఉండే గీతలూ, చిహ్నాలూ వారి స్వభావాన్నీ, అదృష్టాన్నీ సూచిస్తాయి. ఈ శ్లోకంలో మహావిష్ణువైన శ్రీవేంకటేశుని ధ్వజం గురించీ, చిహ్నాల గురించీ వర్ణించడం జరిగింది. అవి స్వామికుండే దివ్యశక్తిని సూచిస్తాయి. ధ్వజమనేది అన్నిటిపైనా స్వామికుండే సాధికారత్వాన్నీ, సార్వభౌమత్వాన్నీ సూచిస్తాయి. ఈ ధ్వజం నీడలో నిలిచి శరణు వేడినవారికి తిరుగులేకుండా వారిని ఆధ్యాత్మికోన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి దోహదపడుతుంది. అమృతభాండమనేది శాశ్వతత్వాన్ని కలుగచేస్తుంది. అది స్వామి పాదాలవద్ద ఉండటం వల్ల, స్వామి పాదాలను వేడినవారిని చిరాయువుతో ఉండేలా చూస్తుంది. ఇక స్వామి గొడుగు అనేది సర్వరక్షణాయుధం. భక్తులందరికీ క్షేమాన్ని సుఖశాంతులను ఇచ్చేదదే. వజ్రం అనేది ఎలాటి దాన్నైనా కోసివేయగలదు. స్వామి వజ్రాల నగలలోని వజ్రం. స్వామికృప ఎలాంటి ఆటంకాలను అయినా తొలగించగలదు.

మనలోపలా, మన వెలుపలా ఉండే ‘చెడు’ను ఓడించి అజేయంగా నిలిచేది ఒక్క ‘మంచి’ మాత్రమే. పద్మం అనేది అభివృద్ధికి సంకేతం. అది ఆధ్యాత్మిక పరంగానైనా సరే, భౌతికపరంగానైనా సరే. పద్మం అనేది స్వామి వక్షంలో నివసించే మహాలక్ష్మి పీఠాన్ని సూచిస్తున్నది. అంటే సాక్షాత్తూ స్వామి వక్షమే పద్మమన్నమాట. ఇకపోతే, శంఖం గురించి చెప్పాలంటే, తన స్పర్శామాత్రాన స్వామి శంఖం సర్వజ్ఞతను ప్రసాదిస్తుంది. అంతే కాదు. స్వామి గొప్పదనాన్ని గ్రహించి, ఆయనను పొగడే భాగ్యాన్ని ప్రసాదిస్తుంది శంఖం. తొలిసారిగా స్వామి ప్రత్యక్షమైతే, ధ్రువుడు ఏం చెప్పాలో స్పష్టంగా



ఉచ్చరించలేకపోయాడు. అపుడు స్వామి చిరునవ్వు నవ్వి, శంఖం ధరించిన తన హస్తంతో ధ్రువుని స్పృశించగానే, ఆశువుగా స్వామి స్తోత్రాన్ని చెప్పాడు. అదీ స్వామి దివ్యానుగ్రహంతో, స్వామి ప్రసాదించిన దివ్యజ్ఞానంతో చెప్పాడు ధ్రువుడు. అంత శక్తి స్వామిశంఖానిది. అది మనకు దివ్యభక్తి జ్ఞానాన్ని ప్రసాదించడమే కాక, బ్రహ్మాన్ని అనుభవంలోకి తెస్తుంది కూడా. శంఖం నుంచి వెలువడే శబ్దం శత్రువుల గుండెలను చీల్చివేస్తుంది. ఇక స్వామి చక్రం గురించి చెప్పాలంటే, అది తిరుగులేనిది. ఒక లక్ష్యంపై దానిని స్వామి ప్రయోగిస్తే, వారిని నాశనం చేసిగానీ వెనక్కు రాదు. ఈ చక్రానికుండే శక్తిముందు బ్రహ్మరుద్రాదులు కూడా నిలవలేరు. మనకాసంగతి అంబరీషుడి కథలో విదితమే.

దుర్వాసుడు తన వెంట్రుకను నేలపైకొట్టి ‘కృత్య’ అనే పిశాచాన్ని సృష్టించి అంబరీష మహారాజుపై ప్రయోగిస్తాడు. ఎందుకంటే, తన ద్వాదశి పారణ ముగింపులో తాను ఆహ్వానించిన దుర్వాసుడు ఎంతసేపటికీ రాకపోగా, వ్రతభంగం కాకూడదనీ, నీళ్లు త్రాగితే అటు వ్రతభంగంకాదనీ నీళ్ళు సేవిస్తాడు అంబరీషుడు. అవన్నీ పట్టించుకోకుండా, తానొచ్చేదాకా అంబరీషుడు ఆగలేక, నీళ్లు త్రాగి తనను అవమానించాడని భావించి కృత్య అనే పిశాచిని సృష్టించి ప్రయోగిస్తాడు. అయితే అంబరీష మహారాజు శ్రీమహావిష్ణువుకు పరమ భక్తుడు. మహావిష్ణువు చక్రం అంబరీషుని సదా కాపాడుతూ ఉండేది. మరి దుర్వాసుడు కృత్యను అంబరీషునిపై ప్రయోగిస్తే విష్ణుచక్రం ఊరకుంటుందా? వెంటనే ఆ కృత్యను తరిమి తరిమి కొట్టి సంహరించి, దుర్వాసుని వెంబడిస్తుంది. తనను తాను ఏవిధంగానూ కాపాడుకోలేక చివరికి దుర్వాసుడు పరమశివునీ, బ్రహ్మనూ ఆశ్రయిస్తాడు. విష్ణుచక్రానికుండే శక్తి అపారమైందనీ, దాన్ని ఎదురించి నిలిచే శక్తి తమకు లేదనీ తమ నిస్సహాయతను బ్రహ్మరుద్రులు వెల్లడిస్తారు. లాభం లేదని

దుర్వాసుడు విష్ణువును ప్రార్థించి తన చక్రాన్ని వెనక్కి తీసుకోమంటాడు. తన చక్రానికి తిరుగులేదనీ, కాబట్టి తాను చక్రాన్ని ఉపసంహరించలేననీ శ్రీహరి సమాధానం ఇవ్వడంతో దుర్వాసుడు మారు ఆలోచించక అంబరీషుని శరణువేడతాడు. తనను క్షమించి కాపాడమని దుర్వాసుడు వేడుకోవడంతో అంబరీషుడు చక్రాన్ని శాంతించమని ప్రార్థించి, దుర్వాసుని కాపాడతాడు. అంబరీషుని ప్రార్థనతో స్వామి చక్రం వెనుదిరిగిపోతుంది.

స్వామిభక్తులంటే స్వామి ఆయుధాలకూ భక్తే. కానీ శత్రువులపట్ల మాత్రం సింహస్వప్నంగా నిలుస్తాయి. వాటిని ఉపసంహరించాలంటే, అది కేవలం భక్తులకే సాధ్యమౌతుంది. స్వామికి తన భక్తులపై ఉండే ప్రేమ అంత గాఢమైనదీ, గొప్పదీనూ. భక్తులపై ఎంతో ప్రేమ ఉంటుందో, వారి శత్రువులపై అంతకు మించిన నిర్దయను చూపి శత్రునాశనం చేస్తాడు శ్రీహరి.

భక్తులపై ఆయన చూపే ప్రేమా, వాత్సల్యమూ, దయా – వీటన్నిటినీ చూపడానికి స్వామికి ఆతని దివ్యాయుధాలు సహకరిస్తాయి. స్వామి పాదాలను శరణువేడిన భక్తుడు స్వామి దివ్యాయుధాల స్పర్శకు కూడా లోనవుతాడు. కాబట్టి ఆ యా దివ్యాయుధాలను కూడా భక్తుడు ఈ శ్లోకంలో స్మరించడం యుక్తంగా ఉంది. స్వామిపాదాల శరణు వేడుతూ, స్వామి దివ్యాయుధాలతో సహా స్వామిని స్తుతించడంవల్ల ఈ భువిపై ఎదురయ్యే అడ్డంకులన్నీ తప్పక తొలిగి పోతాయి.

**6. తామ్రోదరద్యుతి పరాజిత పద్మరాగౌ**
**బాహ్యైర్మహోభి రభిభూత మహేంద్ర నీలౌ ।**
**ఉద్యన్నఖాంశుభిరుదస్త శశాంకభాసౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**



“ఎవరి అరికాళ్ల అరుణకాంతులముందు పద్మరాగమణులకాంతులు వెల వెల పోయాయో, ఎవరి మీగాళ్ల కాంతుల ముందు ఇంద్రనీలమణులు నిలవలేక పోయాయో, ఎవరి పై కెగసే గోటికాంతులముందు చంద్రకాంతులు వెలవెలపోయాయో, అట్టి శ్రీవేంకటేశ్వరుని దివ్యపాదాలను నేను శరణు వేడుతున్నాను.”

స్వామి శంఖ, చక్రాలను స్తుతితో ఈ భక్తుడు స్వామిపాదాలను వదల్లేదు. అంతకు ముందే స్వామిపాదాలను స్తుతించినా, స్వామిపాదాల దివ్యకాంతుల ముందు మణిమయకాంతులు ఎలా వెల వెల పోయాయో ఈ శ్లోకం చెబుతున్నది. సాధారణంగా దివ్యమణులనుంచి వెలువడే కాంతులు చాలా అందంగా ఉంటాయి. అలాటి దివ్యకాంతుల అందాన్ని తలదన్నే అందం స్వామి పాదాలనుంచి వెలవడే దివ్యకాంతులకున్నాయి. స్వామిఅరికాళ్ల నుంచి వెలవడే అరుణారుణ కాంతులు, స్వామి పాదాల గోళ్లు వెదజల్లే కాంతులు – వీటన్నిటిముందు పద్మరాగ, ఇంద్రనీలమణుల కాంతులు, చంద్రకాంతులు వెలవెలపోయాయి. ఇక్కడ వేదాంతదేశికులు తమ పాదుకాసహస్రంలో 337వ శ్లోకంలో చేసిన వర్ణనను చెప్పుకోవడం ఎంతో సముచితంగా ఉంటుంది. “స్వామి పాదపద్మాల కుండే గోళ్లనుంచి వెలువడే కాంతులు ఎంత అందంగా ప్రకాశవంతంగా ఉన్నాయంటే, స్వామి పాదాలకు అర్పించిన పూలనుంచి వచ్చేకాంతులు వాటినే వల్లిస్తున్నాయా అన్నట్లున్నాయి!” అని వేదాంతదేశికులు వర్ణించారు.

వేదాంతదేశికులు ‘పూలకాంతులు స్వామి గోళ్ళు వెదజల్లే కాంతులముందు వెలవెలబోయా’ యంటే, సుప్రభాతకారుడు ఈ శ్లోకంలో మరొక అడుగు ముందుకు వేసి ‘దివ్యమణిమయకాంతులను మించిన కాంతులను స్వామివారి పాదాలూ, గోళ్లూ వెదజల్లుతున్నా’ యని

వర్ణించాడు. ఆ దివ్యమణుల్లో కూడా పద్మరాగ, మహేంద్ర, నీల, చంద్రకాంత మణులనే ఎన్నుకొన్నాడు. నీలమేఘశ్యాముడైన శ్రీవేంకటేశుని నీలమైన పాదాలకు ఎర్రని అరికాళ్ళు, తెల్లని గోళ్ళు ఈ మణులను మించినవి. పద్మరాగమణి అనేది పద్మాసనుడైన సృష్టికర్తయైన బ్రహ్మకిరీటంలో ఉంది. ఆతని 'రాగం' లేదా ప్రేమ అనేది వేదాలకూ, వేదపురుషుడైన శ్రీవేంకటేశ్వరునికీ సంబంధించింది. బ్రహ్మదేవుడు శ్రీవేంకటేశుని పాదాలముందు మోకరిల్లినపుడు, బ్రహ్మకిరీటంలోని ఆ పద్మరాగమణికాంతి స్వామి పాదాలనుంచి వెలువడిన అరుణకాంతుల ముందు వెలవెలపోయింది. మహేంద్రనీల మనే మణి దేవతలకధిపతియైన ఇంద్రుని కిరీటంలో ఉంటుంది. చంద్రకాంతమణి అనేది పరమశివుని సిగలోని నెలవంక. వీరంతా స్వామి పాదాలను సేవించినపుడు వారివారి కిరీటాల్లోని మణుల కాంతులు స్వామి పాదాలనుంచి వచ్చేకాంతులముందు వెలవెలపోయాయని ఇక్కడ వర్ణించడం జరిగింది. శ్రీవేంకటేశుని పాదాలు ఎంత శక్తిమంతమైనవో చూశారా?

**7. సప్రేమభీతి కమలాకరపల్లవాభ్యాం**
**సంవాహనేఽపి సపది క్లమమాదధానౌ ।**
**కాంతావవాఙ్మనస గోచర సౌకుమార్యౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"మహాలక్ష్మి తన సున్నితమైన చిగురులాంటి చేతులతో, ప్రేమగా, భయంగా, సుతిమెత్తగా ఒత్తినా ఎక్కడ కందిపోతాయో, ఎక్కడ ఒత్తిడి కల్గుతుందో అన్నట్లు, మాటలకూ, మనస్సుకూ అందని సౌకుమార్యం కలిగి ఉండీ, ఎంతో అందంగా ఉండే శ్రీవేంకటేశ్వరుని పాదాలనే నేను శరణు వేడుతున్నాను."



స్వామి పాదాల సౌకుమార్యం, సున్నితత్వం అనేవి భక్తితో, ఆ పాదాలపై పడి శరణు వేడి, వాటిని వీడక, మోక్ష సాధన చేసే భక్తులకు మాత్రమే తెలుస్తుంది. ఐతే, అవి భక్తుల కెంత సున్నితంగా ఉంటాయో, శత్రువుల పాలిట అంతే కఠినంగా ఉంటాయి. స్వామి పాదసేవను ఎంత సున్నితంగా, ప్రేమగా, జాగ్రత్తగా మహాలక్ష్మీదేవి చేస్తుందో, ఆ దృశ్యం ఎంత కమనీయంగా ఉంటుందో ఈ శ్లోకం వర్ణించింది. ఇంచుమించు ఇలాటి దృశ్యాన్నే శంకరాచార్యులు కనకధారాస్తవంలో ఆవిష్కరించారు. ఒక బీదరాలు భిక్షగా ఇవ్వడానికి తన దగ్గర ఏమీ లేకపోవడంతో, శంకరాచార్యులకు కేవలం ఒక ఆమలకాన్ని ఇస్తుంది. అది చూచి చలించిన శంకరులు అప్పటికప్పుడే లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ, ఆశువుగా చెప్పిన శ్లోకాలకు తల్లి ప్రసన్నురాలై బంగారు ఆమలకాలను వర్షింప చేస్తుంది. ఆ స్తోత్ర మంజరే కనకధారాస్తవం.

స్వామివారి పాదసేవ చేసే లక్ష్మీదేవి ఎంతో దయతో ప్రేమ కురిపిస్తూ, ప్రసన్నంగా ఉంటుంది. ప్రేమతో, భక్తితో కూడిన ఆమె చూపులు స్వామిని సైతం తన భక్తునిపై కరుణ జూపేలా చేస్తుంది. ఇదే సందర్భాన్ని, స్వామి పాదాలు బలిచక్రవర్తిని సుతలలోకానికి అణగదొక్కిన సందర్భంతో పోల్చుతాం. బలిచక్రవర్తి స్వతహాగా స్వామి భక్తుడు. అయినా అతడు అన్యాయంగా స్వర్గాన్ని ఆక్రమించి, అపరాధం చేశాడు గాబట్టి దానికి తగిన పరిహారం చెల్లించవలసి వచ్చింది. ఇక్కడ స్వామి మూడు పాదాలు ఎంతో బ్రహ్మాండమైనవిగానూ, ముల్లోకాలనూ పాదాల మధ్య నిలుపుకొని, సర్వత్రా వ్యాపించి, నాశనం చేయగల శక్తితో, అపరిమితమైనవి గానూ చెప్పుకోవాలి.

ఆ స్వామి పాదాలకుండే ఆ సున్నితత్వం, మహాలక్ష్మీదేవికుండే అతి సున్నితమైన హస్తాలతో చేసిన పాదసేవ వల్ల మరింత ఇనుమడించింది.

స్వామిమీద సున్నితమైన ప్రేమపూర్వకమైన దృష్టి ఉంటేనే, భక్తునికి స్వామికి ఉండే దయార్ద్రహృదయం గోచరిస్తుంది. ఆ భక్తునికే స్వామిపాదాల సున్నితత్వమూ, శక్తీ గోచరిస్తాయి.

**8. లక్ష్మీ మహీతదనురూప నిజానుభావ**
**నీళాది దివ్య మహిషీకరపల్లవానామ్ ।**
**ఆరుణ్య సంక్రమణతః కిల సాంద్ర రాగౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"తన దేవేరులైన శ్రీదేవీ, భూదేవీ, వారి మహత్వంతో సమానమైన మహత్వం గల నీలాదేవి వంటి దివ్యమహిషులు స్వామిపాదసేవ చేయడంవల్ల చిగురుల్లాటి వారి సున్నితమైన చేతులకుండే ఎరుపురంగు అంటినందువల్ల అరుణకాంతులతో ప్రకాశిస్తున్నాయా అన్నట్లున్న శ్రీవేంకటేశచరణ యుగళాన్ని నేను శరణు వేడుతున్నాను."

ఈ శ్లోకంలో స్వామిపాదాల ఎర్రని కాంతుల ప్రకాశాన్ని గురించి చెబుతూ, ఆ ప్రకాశాన్ని ఇనుమడింప చేయడానికి ఆయన దేవేరుల పాదసేవ కారణమన్న సత్యాన్ని గుర్తు చేయడం జరిగింది. స్వామి దేవేరులు శ్రీ, భూ, నీళ లు తమ సున్నితమైన చిగురుల్లాటి కరపద్మాలతో చేసిన పాదసేవ వల్ల, వారి పద్మాల్లాటి చేతుల కుండే ఎర్రనికాంతులు స్వామిపాదాలకు తగిలి, స్వతహాగా ఉన్న పాదాల ఎర్రని కాంతులు మరింత ఇనుమడింప జేసినవేమో అన్నట్లున్నాయి.

ఇక్కడ శ్రీ, భూ అంటే శ్రీదేవి, భూదేవి అన్నమాట. నీళ అంటే, గోదాదేవి. నీళ అంటే గోదాదేవే కాక మిథిలావాసియైన కుంభక అనే గోవులకాపరి పుత్రికనే 'నీళ' అని కూడా అంటారు. ఒకనాడు నారదుడు వాళ్లింటికి వచ్చి



శ్రీకృష్ణుని దివ్యమంగళరూపాన్ని కుంభకునికి వర్ణించి చెప్పగా, అది విన్న నీళాదేవి స్వామిపై భక్తి, ప్రేమలను పెంచుకొంది. ఈ కుంభకుని వద్ద రెండు ఎద్దులుండేవి. వాటిని నియంత్రించడం ఎవరివల్లా అయ్యేది కాదు. ఎక్కడ పొలాలున్నా వాటి ధాటికి అవి నాశనం కావాల్సిందే. వాటిని ఎవరూ నియంత్రించ లేకపోయారు. కారణ మేమిటంటే, అవి పూర్వజన్మలో రాక్షసుడైన కాలనేమి పుత్రులు కావడమే.

అదంతా అలా ఉంటే, ఒకసారి కుంభకుడు నారదునితో నీలకు పెళ్లిచేయడానికై పెళ్లికొడుకును వెదుకుతున్నానని చెప్పాడు. ఇంతలో ఎద్దులను నియంత్రించమని మిథిలాధీశుడు కుంభకునికి చెప్పాడు. కుంభకుడు వాటిని నియంత్రించలేక పోతాడు. అందువల్ల, వాటిని ఎవరైతే నియంత్రిస్తారో అతనికే తన కూతురును ఇచ్చి పెళ్లిచేయాలని కుంభకుడు భావించాడు. ఈ విషయాన్ని నారదుని ద్వారా విన్న శ్రీకృష్ణుడు వాటిని చిత్తుగా ఓడించి, ఆమెను పెళ్లి చేసుకొంటాడు. ఆమె ప్రేమే, కృష్ణుని పొందేట్లు చేసింది. అంతేకాదు. స్వామి దేవేరులతో సమానంగా స్వామి సేవచేసే భాగ్యం పొందింది. స్వామి ప్రేమ కథలో ఆమె శ్రీదేవితో, భూదేవితో సమానంగా దక్షిణనాయికగా స్వామిని సేవించింది.

**9. నిత్యానమద్విధి శివాది కిరీటకోటి**
**ప్రత్యుప్త దీప్త నవరత్న మహః ప్రరోహైః ।**
**నీరాజనా విధిముదారముపాదధానౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఎవరైతే బ్రహ్మరుద్రాది దేవతలు నిత్యమూ నమస్కరించేటపుడు వారి కిరీటాల్లోని మేలి నవరత్నకాంతులతో మంగళహారతిని పొందుతున్నారో అట్టి శ్రీవేంకటేశ్వరుని పాద యుగళాన్ని నేను శరణువేడుతున్నాను."

ప్రతిరోజూ సృష్టికర్తయైన బ్రహ్మ, లయకారకుడైన శివుడూ, వారితోబాటు కోట్లాది దేవతలంతా వచ్చి శ్రీవేంకటేశ్వరుని సేవించుకుంటారు. స్వామి దివ్యపాదాలకు వీరంతా నమస్కరించి వారి నమ్రతను చాటుకొంటారు. అలా వాళ్లు పాద నమస్కారం చేసేటపుడు వారి కిరీటాల్లో ఉండే మేలిమి నవరత్నాలు వెదజల్లే కాంతులు స్వామి పాదపద్మాలకు కర్పూరహారతి నిచ్చినట్లు, అవి దివ్యమైన హారతిని ఇస్తున్నాయా అన్నట్లున్నాయి. ఇదొక అద్భుతమైన భావన. ఎందుకంటే, స్వామి సేవకై దేవతలకుండే శ్రద్ధా, భక్తీ ఆ మణుల్లో అణువణువునా గోచరిస్తాయి. వాటికి ఆ యా దేవతల కిరీటాల్లో ఉండే మణులకూ ఏమాత్రం మినహాయింపు లేదు. అవి భక్తి అనే అగ్నిలా గోచరిస్తూ, స్వామి పాదాలకు స్వామిపై ఉండే ప్రేమపూరిత ప్రకాశంతో మంగళ హారతిలా మారింది.

**10. "విష్ణోః పదే పరమ" ఇత్యుదిత ప్రశంసౌ**
**యౌ 'మధ్వ ఉత్స' ఇతి భోగ్యతయాఽప్యుపాత్తౌ ।**
**భూయ స్తథేతి తవ పాణితల ప్రదిష్టౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఏ పాదాలనైతే అత్యుత్తమైనవనీ, 'విష్ణోః పదే పరమ' అనీ ఋగ్వేదం ప్రశంసించిందో, మకరందపు ఊట అనీ, 'మధ్వ ఉత్సః' అనీ పొగడిందో, అదే విషయాన్ని మళ్లీ చెబుతున్నట్లుగా నీ చేతులు చూపుతున్న నీ పాదాలను శ్రీ వేంకటేశ్వరా! నేను శరణువేడుతున్నాను."

స్వామి పాదాలు పద్మాలే. అందుకే పాదపద్మాలనే మాట వాడతాం. అట్టి పద్మాలపై భక్తులు తేనెటీగల్లా వాలడం సహజమే మరి. స్వామి పాదపద్మాల నుంచి తేనె లూరుతూంటాయన్న భావననే "విష్ణో పదే పరమ మధ్వ ఉత్సః" అని ఋగ్వేదం చెప్పింది.



ఈ సందర్భంలో స్వామికి 'రస' పదాన్ని ఆపాదించడం జరిగింది. శ్రుతి భగవంతుని 'రస'మని వర్ణించింది. మకరందరసం స్వామిపాదాలను చేరుతుంది. స్వామి పాదాలు దానిని వ్యాపింపచేస్తాయి.

శ్రీవేంకటేశ్వరస్వామి అర్చారూపాన్ని జాగ్రత్తగా చూస్తే, స్వామి కుడిచేయి తన పాదాలను చూపుతూ, ఆ పాదాలు చాలా శక్తివంతమైనవనీ భక్తులు దానిని ఆశ్రయించి, శరణు పొందవచ్చనీ, ఆ పాద మకరందాన్ని గ్రోలుతూ, అత్యుత్తమమైన శాంతినీ, స్వామి అనుగ్రహాన్ని పొందవచ్చని చెబుతుంది.

ఈ స్తోత్ర శ్లోకాన్ని మనం విశిష్టాద్వైతాచార్యుల్లో గొప్పవాడైన యామునాచార్యులు రచించిన స్తోత్ర రత్నంలోని 26, 27 శ్లోకాలతో పోల్చవచ్చు. ఆ శ్లోకాల్లో యామునాచార్యులు, "నీ పాదసేవలను నేను వీడలేను. చంటిబిడ్డ ఎపుడూ తన తల్లి ఎంత పిలిచినా తల్లి పాదాలను వీడదు. నా మనస్సును మకరందాన్నిచ్చే నీ పాదపద్మాలపైనుంచి వేరే దానిపైకి ఎలా మరల్చగలను?" అని చెప్పారు.

తేనెపట్టు ఎలాగైతే తేనెటీగలన్నిటినీ తనవైపుకు ఆకర్షించుకొంటుందో శ్రీ వేంకటేశ పాదపద్మాలు సైతం తన భక్తులను అలా తనవైపుకు ఆకర్షిస్తున్నాయి. ఆ పాదాలను శరణువేడిన భక్తులకిక భయం లేదు. ఈ ప్రాపంచిక విషయాల నుంచీ రక్షణనిచ్చి, ఈతిబాధలనూ తొలగించి పారమార్థిక విషయాలపై మనస్సును మరల్చేలా చేసి శాశ్వతమైన బ్రహ్మానందాన్ని ఇచ్చేవి కేవలం శ్రీవేంకటేశుని పాదపద్మాలే గానీ వేరొకటి కాజాలవు.

**11. పార్థాయ తత్సదృశసారథినా త్వయైవ**
**యౌ దర్శితౌ స్వచరణౌ శరణం వ్రజేతి ।**

**భూయో౽పి మహ్య మిహ తౌ కరదర్శితౌ తే**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఏ పాదాలనైతే అర్జునునకు సారథియైన నీవే స్వయంగా శరణు పొందమని చెప్పావో, తిరిగి నాకోసం కూడా 'శరణం వ్రజ' అంటూ నీ చేతితో ఇపుడు చూపుతున్నావు. అలాంటి నీ పాదాలను శ్రీవేంకటేశ్వరా! నేను శరణు వేడుతున్నాను."

ఈ స్తోత్ర శ్లోకం భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునునకు చేసిన అద్భుతమైన గీతోపదేశ సన్నివేశాన్ని మన కళ్లముందు ఆవిష్కరిస్తోంది. కృష్ణార్జునులలో అర్జునుడు నరుడైతే, శ్రీకృష్ణుడు నారాయణుడు. ఒకరికొకరు తెలియజేసుకొనే వారే కాదు. అనుబంధమైనవారు కూడా. అందువల్లే ఇక్కడ 'సదృశ' అని వాడటం జరిగింది. అర్జునుడు అహంభావియై సమ్మోహానికి లోనై తాను చంపేవాడిననీ, ఇతరులను తానే చంపుతున్నాననే భావన కల్గడంతో తానొక పెద్ద నేరాన్ని చేస్తున్నానని తలచాడు. అయితే, అతని రథసారథియైన శ్రీకృష్ణుడు అతని అపోహలను తొలగించి అతనిని సక్రమమైన మార్గంలో నడపించడానికై, అతనికి తత్వ గీతాబోధను వినిపించాడు. భగవద్గీత వినడంవల్ల అర్జునుడికి సమ్మోహం వల్ల కల్గిన క్షణికమైన అచంచలత్వం తొలగింది. భగవంతుడు అర్జునునికి చేసిన గీతాబోధలో "అన్నిటినీ వదిలేసి తన పాదాలను సర్వస్య శరణాగతి చేయమనీ, అట్లా చేస్తే సర్వం తానై అర్జునుడిని కాచి, రక్షిస్తాననీ" చెప్పాడు. ఈ ప్రపత్తి శ్లోకంలో తాను కూడా అర్జునుడి లాగా సమ్మోహానికి లోనైనట్టు భక్తుడు భావించడం మనం గమనించవచ్చు.

అహమనే అజ్ఞానం వెల్లువలా భక్తుని కప్పివేయడం వల్ల తన ఆత్మకు నిర్దేశన లేకపోయింది. తన బుద్ధిని నిర్దేశించేవాడు శ్రీవేంకటేశ్వరుడు.



పంచేంద్రియాలనే గుర్రాలతో నడిచే తన మనోరథానికి సారథి అతడే. ఆ రథం పంచేంద్రియాలకు చేష్టలవల్ల గాడి తప్పి నడుస్తూ ఉంటుంది. దానిని నియంత్రించి సన్మార్గంలో ఉంచడం ఒక్క దేవదేవునికే సాధ్యమౌతుంది. మన మనస్సు అనే రథాన్ని ఆయన నియంత్రించాలంటే, ఆయన కృపాకటాక్షం మనకు కావాలి. అది ఆ స్వామికి సర్వస్యశరణాగతి చేసినపుడే సాధ్యమవుతుంది.

సహజంగా జీవుడు తనను తాను స్వామి రక్షణ పొంది ఆయన్నే నమ్ముకొంటే, ఇక భయపడాల్సిందేమీ ఉండదు. ఎవరు శరణువేడినా స్వామి పాదాలు అర్జునుని బ్రోచినట్లు తప్పక కాచి రక్షిస్తాయి. తానొక గడ్డిపోచ నని భావించి, అర్జునుడు చూపిన అణకువతో స్వామి పాదారవిందాలను కొలిచినపుడే భక్తునికి ముక్తి కల్గుతుంది.

**12. మన్మూర్ధ్ని కాళియఫణే వికటాటవీషు**
**శ్రీ వేంకటాద్రి శిఖరే శిరసి శ్రుతీనామ్ ।**
**చిత్తేప్యనన్యమనసాం సమ మాహితౌ తే**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఓ శ్రీవేంకటేశ్వరా! మహాపాపినైన నా తలపైనా, కాళీయుడనే సర్పరాజు పడగలమీదా, శ్రీవేంకటాద్రి మీద దుర్గమాలైన అడవుల్లో, ఉపనిషత్తుల్లో, మరి వేరే ఎలాటి చింతాలేకుండా కేవలం నిన్నే ధ్యానించే యోగీశ్వరుల మనస్సుల్లో సమానంగా ఉంచే నీ దివ్య పాదయుగళాన్ని నేను శరణువేడుతున్నాను."

ఈ ప్రపత్తి శ్లోకంలో శ్రీకృష్ణావతారంలో స్వామి కాళీయుని మర్దన చేసి ఆ విషసర్పాన్ని కాళింది మడుగునుంచి వెళ్లగొట్టిన సంగతిని గుర్తుచేయడం జరిగింది. కాళీయుడు తనను తాను రక్షించుకోవడానికోసం

కాళిందిలో ఉండటంవల్ల ఆ మడుగులో నీరు విషపూరితమైంది. అలా ఎందుకు దాగుండాల్సి వచ్చిందంటే, కాళీయునికి తన ప్రాణాలు గరుడుడి చేతిలో కోల్పోవాల్సి వస్తుందనే భయం ఉంది. ఐతే కాళిందిలో ఉంటే మాత్రం గరుడుడు కాళీయుని భరతం పట్టడా? అని సందేహం రావచ్చు. గరుడుడు కాళిందీ మడుగులోకి ప్రవేశించడు. కారణం శౌబరిముని శాపం ఉంది గనక. తమ రాజును గరుడుడు సంహరించగా ఆ చెరువులోని చేపలన్నీ కలిసి శౌబరిముని రక్షణ కోరాయి. వాటికతడు అభయ ప్రదాతయై శౌబరి, గరుడుడు కాళిందిలో అడుగిడితే జీవించడని శపించాడు. కాళీయుడు గరుడుని స్వస్థానమైన రమణక ద్వీపంలో గరుడునికి మర్యాదలు చేయకుండా అవమానించాడు. అందువల్ల తనను ఎక్కడ గరుడుడు వచ్చి సంహరిస్తాడో అనే భయంతో, 'కాళింది మడుగులో ఉంటే గరుడుడు తనని సంహరించలేడన్న' విషయాన్ని గ్రహించి కాళీయుడు కాళింది మడుగును చేరాడు. సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు కాళీయుని తలపై మర్దించగా కాళీయుడు స్వామి పాదాలను శరణు వేడాడు. అపుడు స్వామి, "నా పడగలపై నా పాదయుగళ ముద్ర ఉంది. కాబట్టి నిన్ను గరుత్మంతు డేమీ చేయలేడు. ఇదే నా అభయం. నీవు వెంటనే రమణక ద్వీపానికి తిరిగి వెళ్లిపో"మ్మని ఆదేశించాడు. కాళీయుడు స్వార్థపరుడు. విషాన్ని కక్కేవాడు. క్రూరుడు. కాళిందిలోకి వేరే ఎవ్వరినీ రానిచ్చే వాడు కాదు.

భగవంతుడు నిష్పక్షపాతి. దయామయుడు. నీచాతి నీచమైన వానియెడ కూడా ప్రేమ చూపగలడు. శరణన్నవాడిని రక్షిస్తాడు. ఈ కలియుగంలో మానవులైన మనకూ, కాళీయునికీ పెద్దగా తేడా ఏమీ లేదు. ఆనాడు కాళీయుడుండిన స్థితిలోనే నేడు మనమూ ఉన్నాం. మన ఆలోచనలూ, నడవడీ – అన్నీ స్వార్థ పూరితమై పోయాయి. అన్నీ స్వార్థపూరిత ఆలోచనలు. క్రూరత్వం, అహంకారం చోటు చేసుకొంటున్నాయి. వీటన్నిట్నించీ మనల్ని



మనం రక్షించుకోవాలి. లేకుంటే మానవజన్మకు అర్థం లేదు. వీటినుంచి మనల్ని రక్షించు కోవాలంటే, శ్రీవేంకటేశుని పాదాలను శరణాగతి చేయడం ఒక్కటే మార్గం. కృష్ణావతారంలో స్వామి తన పాదాలతో కాళీయుని సంస్కరించి కాపాడినట్టే, ఈ కలియుగంలో శ్రీవేంకటేశుడు మన మనస్సునూ తన పాదతాడనంతో సంస్కరించగలడు. కేవలం శ్రీవేంకటేశుని పాదాలను ఆశ్రయిస్తేనే సాధ్యమౌతుంది. యోగీశ్వరులు ఈ పాదయుగళాన్ని ఆశ్రయించి ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతిని పొంది మోక్ష మార్గాన్ని తెలుసుకొంటారు.

ఈ ప్రపత్తి శ్లోకంలో కాళీయుని సంస్కరించినా, యోగీశ్వరులను సంస్కరించినా, మానవులను సంస్కరించాలంటే ఆ స్వామి పాదాలే శరణ్యమనీ, ఆ స్వామి పాదాలన్నింటినీ సమదృష్టితో రక్షిస్తుందనీ మనకు విశదం అవుతుంది.

**13. ఆమ్లానహృష్య దవనీతల కీర్ణపుష్పౌ**
**శ్రీ వేంకటాద్రిశిఖరాభరణాయమానౌ ।**
**ఆనందితాఖిలమనోనయనౌ తవైతౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఓ శ్రీవేంకటేశ్వరా! వికసించినా వాడిపోని ఎన్నో పూలతో చుట్టూ చల్లబడి, శ్రీవేంకటాచల శిఖరానికే అలంకారమై, సమస్తజనులకూ మనోనేత్రానందాల నిస్తున్న నీ దివ్య చరణాలనే నేను శరణు వేడుతున్నాను."

స్వామి పాదాలకు అర్పించే పుష్పాలెంతో విశిష్టమైనవీ, చెప్పుకోదగ్గవీ కూడా. స్వతహాగా రంగు, సువాసనలే కాకుండా వాటి అందం ఎంతో చెప్పుకోదగ్గది. చెట్టునుంచి కోసినా అవి తరగని సువాసన అందంతో, తాజాదనంతో సహజంగా ఉంటూ, చెట్లనుంచి కోయక ముందుండిన దానికన్నా ఇనుమడించిన గుణాలతో అందంగా తాజాగా

ఉండి, మరింత సువాసనలు వెదజల్లుతున్నాయి. దీనికంతటికీ కారణం పవిత్రమైన స్వామివారి పాదస్పర్శ వాటికి తగలడమే. అదేవిధంగా భక్తుల హృదయ కమలాలుకూడా స్వామి పాదాలకు భక్తితో అర్పించినపుడు సహజంగా అవికూడా ఎనలేని ప్రశాంతతతో చక్కగా ప్రకాశిస్తాయి. ఆ స్వామి పాదాలచుట్టూ ఉన్న అందమైన ప్రకాశం భక్తులమదిలో నాట్యమాడే విధంగా, వారి కన్నులకు పండుగగా ఉంటుందనడంలో అబద్ధమేమీ లేదు. దేవతలు భక్తితో వారివారి నివాసస్థలాలలో ఉన్న దైవాంశసంభూతమైన కోరికలు తీర్చే కల్పక, హరిచందన, పారిజాత, మందారసంతానమనే చెట్టులనుంచి పుష్పాలు కోసి స్వామికి నిత్యమూ అర్పిస్తూంటారు. స్వతహాగా కోర్కెలు తీర్చేటి చెట్లనుంచి కోసిన పూలకు కూడా ఆ ప్రకాశం ఉంటుంది. అవి స్వామి పాదాలను చేరడంతో వాటి వాసనలు ప్రకాశమూ సహజంగానే ఇనుమడిస్తాయి. మనం మాటల్లో చెప్పలేనంతగా వాటిశక్తి పెరుగుతుంది. అందువల్ల భక్తులు స్వామివారి దివ్యపాదాలను శరణువేడినంతనే వారికి అత్యుత్తమమైన సత్-చిత్-ఆనందంతో కూడిన స్వామి కృప కల్గుతుంది.

**14. ప్రాయః ప్రపన్న జనతా ప్రథమావగాహ్యౌ**
**మాతుః స్తనావివ శిశో రమృతాయ మానౌ ।**
**ప్రాప్తౌ పరస్పరతులామతులాంతరౌ తే**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు నమస్కరించే భక్తులు మొట్టమొదట చూడదగినవీ, చంటిపాపకు తల్లి స్తనాల్లాగా అమృతతుల్యమైనవీ, కేవలం వాటితోనే పోల్చుకో దగ్గవీ, వేరే ఏ ఇతర వస్తువులతోనూ పోల్చడానికి వీల్లేని నీ దివ్య పాదారవిందాలను శరణువేడుతున్నాను."

శ్రీవేంకటేశ్వరుని పాదాలకు సాష్టాంగ నమస్కారాలు చేసిన ఏ భక్తునికైనా మొదట కేవలం స్వామి పాదాలు మాత్రమే పూర్తిగా కనిపిస్తాయి.



అవి అమృతత్వాన్నీ, శాశ్వతమైన బ్రహ్మానందాన్నీ ఇచ్చి భక్తునికి జీవితంలోని అమృతాన్ని ఆస్వాందిచేలా చేస్తాయి. చంటిపాపకు కళ్లు తెరవలేని స్థితిలో సైతం తల్లి స్తనం నుంచి పాలను గ్రోలి ఆస్వాదించడం తెలుసు. పుష్టికరమైన ఆ పాలు, ఆ బిడ్డకు అమృతంలా పనిచేస్తే, తల్లి ఒడి స్వర్గతుల్యంగా ఉంటుంది.

శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలను శ్రద్ధగా శరణువేడిన భక్తునికీ అదే పరిస్థితి ఎదురౌతుంది. స్వామి పాదాలను శరణువేడినవాడు స్వామి దయకు పాత్రుడౌతాడు. స్వామి దయ లభించిందంటే, చంటిపాపకు అమృతంవంటి తల్లిపాలు దొరికి నట్టే, స్వామిపాదాలు అమృతాన్ని వెదజల్లుతూ ఉంటుంది. నిజమైన భక్తుడు ఆ అమృతాన్ని ఆస్వాదించగలిగి సాంసారిక బంధాలనుంచి ముక్తుడై, పాపాలన్నీ పోగొట్టుకొని చివరికి ఆ పరమాత్మలో శాశ్వతమైన ఉనికిని పొందగలుగుతాడు. ఇక్కడ మనం గుర్తించాల్సిన మరో సంగతేంటంటే, మనం స్వామి పాదాలను కేవలం ఆ పాదాలతో మాత్రమే పోల్చగలం. వాటికవే సాటి. సృష్టిలో అన్నిటినీ మించినవాటిని వేటితో పోల్చగలం?

**15. సత్త్వోత్తరైస్సతత సేవ్యపదాంబుజేన**
**సంసార తారక దయార్ద్రదృగంచలేన ।**
**సౌమ్యోపయంతృమునినా మమ దర్శితౌ తే**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

"ఓ శ్రీవేంకటేశ్వరా! సాత్వికులైన ఋషిసత్తములు కొలిచే పాదాలున్నవాడూ, సంసారం సాగరాన్ని దాటించగల చల్లని చూపులున్న వాడూ, మనవాళమహాముని దయతో శరణ్యంగా చూపించిన నీ దివ్యచరణ యుగళాన్నే నేను శరణు వేడుతున్నాను."

శ్రీవేంకటాద్రి ఎంత ఉన్నతమైనదో చెబుతూ, భవిష్యోత్తర పురాణం (4వ అధ్యాయం) ఇలా వర్ణించింది :

**"అరాయికాణే వికటౌ గిరిం గచ్ఛేతి తం విదుః**
**ఏవం వేదమయః సాక్షాద్గిరీంద్రాః పన్నగాచలః**
**స్వదే హచ్చన్మ వల్మీకో వైకుంఠాదధికో హ్యభూత్**
**సువర్ణముఖరీ నామ నదీ సా విరజానదీ**
**వైకుంఠో వేంకటగిరిః వాసుదేవో రమాపతిః**
**ముక్తా అజాః పక్షిగణాః ముక్తా రుద్రా మృగోత్తమాః**
**సనత్కుమార ప్రముఖాః వానరాద్యా ద్విజోత్తమాః!"**

ఋగ్వేదంలో 10వ మండలంలో "శ్రీవేంకటాద్రి ఒక్కటే దీనుల అంతిమ లక్ష్య స్థానమ"ని చెప్పడం జరిగింది. అంటే "ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ, భరతర్షభ!" అని వర్ణించినట్లు, వృక్ష, జంతుజాలాలన్నిటినీ సృష్టించిన బ్రహ్మరుద్రులు, సంసారబంధాల విముక్తి నొందిన సనత్కుమారులవంటి గొప్ప ఋషులు స్వామిని సేవించి తరించిన భక్తులు. శ్రీవేంకటాద్రిలో వేదాలే శిలలై వెలిశాయి. అందువల్ల అది వైకుంఠం కన్నా గొప్పది. సువర్ణముఖరి అనేది స్వామిపాదాల మీదుగా ప్రవహించే విరజానది లాంటిది.

ఎందరో ఋషులు పవిత్రమైన రూపాల్లో మనకు కనిపించని రీతిలో స్వామి కోసం నిత్యమూ ధ్యానం చేస్తున్నారు. ఈ సాత్విక మహర్షులూ, ఉత్తములూ వేంకటాద్రిమీద శాశ్వతమైన ఆనందాన్ని పొందుతున్నారు. వేంకటాద్రి శిఖరం అనేది అత్యంత శక్తిమంతమైనది. దయామృతమైన స్వామిపాదస్పర్శతో పునీతమైంది. వాటికి దీటైనవి వేరే ఏదీ లేదు.

వైష్ణవులలో రమ్యజామాతృమునిగా పేరుపొందిన మణవాళ మహాముని సంస్కృత, తమిళభాషల్లో అనేక వైష్ణవాచార్యుల రహస్య గ్రంథాలపై వ్యాఖ్యానాలు వ్రాశారు. ఆయన తిరుమంత్రార్థమూ, విశిష్టాద్వైత సిద్ధాంతంలో



చెప్పే మూడుతత్త్వాల (తత్త్వత్రయ) అర్థమూ చెబుతూ శ్రీనమ్మాళ్వారు రచించిన తిరువాయిమొళి వంటి పుస్తకాలకు విశ్లేషణపూర్వక వ్యాఖ్యానాలు వ్రాశారు. ఆయన తమిళంలో వ్రాసిన 'ఉపదేశరత్నమాలై' అనేది ఆళ్వారులకూ రామానుజాచార్యులవంటి ఇతరులకూ సంబంధించిన తిథి, వార, మాస, నక్షత్రాలూ, జన్మస్థలాలు చెబుతుంది.

తిరుమొళి నూట్రందాది (నమ్మాళ్వారును కీర్తిస్తూ, వంద పద్యాలు, ప్రతిపద్యాలు తిరుమొళిలోని పది పద్యాల సారాంశాన్ని చెబుతుంది). ఆర్తిప్రబంధం, తిరువారాధన క్రమం(జీయర్ పడి – ఇది వైష్ణవుల నిత్యపూజాక్రమాన్ని నిర్దేశిస్తుంది)– ఇవన్నీ కూడా వైష్ణవ గురువుల్లో, మునుల్లో ఆయన కున్న ఉన్నత స్థానాన్ని సూచిస్తాయి.

ఈ సుప్రభాతాన్ని వ్రాసిన అణ్ణన్ వైష్ణవభక్తుడు కావడంవల్ల, సౌమ్యముని అని వైష్ణవులంతా పిలిచే మణవాళ మహామునిని సముచితంగా ఇక్కడ స్మరిస్తున్నాడు.

మణవాళ మహాముని శ్రీస్వామి కల్యాణ గుణగణాలను, స్వామి పాదాల దయాగుణాన్ని అనేక విధాలుగా, వివరించి చెప్పారు.

**16. శ్రీశ శ్రియా ఘటికయా త్వదుపాయభావే**
**ప్రాప్యేత్వయి స్వయముపేయతయా స్ఫురంత్యా ।**
**నిత్యాశ్రితాయ నిరవద్యగుణాయ తుభ్యం**
**స్యాం కింకరో వృషగిరీశ న జాతు మహ్యమ్ ॥**

"ఓ శ్రీపతీ! భక్తుల ముక్తికి నీవొక ఉపాయభూతుడవైనపుడు, తల్లియైన మహాలక్ష్మి ఆ ముక్తి నొందడాన్ని సులభతరం చేస్తుంది. నీవు ప్రాప్యుడవైనపుడు, ఆమె కూడా అదేవిధంగా స్ఫురిస్తుంది. ఆ మహాలక్ష్మీదేవిని ఎపుడూ వదిలి

ఉండని నీ గుణాలు దోషరహితమైనవి. దివ్యమైనవి. ఓ వృషగిరీశా! అట్టి నీకు సదా నేను సేవకునిగానే ఉంటాను. ఎపుడూ నాకు నేను సేవకుడును కాను.”

శ్రీమహాలక్ష్మీదేవి గొప్పదనం స్వామి మహత్వంలోనే ఉంది. స్వామి ఏదైతే, ఆమె తదనుగుణంగా ఉంటుంది. స్వామినెప్పుడూ వీడి ఉండదు. వైష్ణవ భక్తుల రచనలు ఈ విషయాన్ని చెబుతూ, ఆ తల్లిపాత్రను మరింత విశదం చేస్తాయి. శ్రీస్తుతి ఇలా అంటుంది :

**“ఏవం యదా జగత్స్వామీ దేవదేవో జనార్దనః**
**అవతారం కరోత్యేషా తదా శ్రీస్తత్సహాయినీ**
**పునశ్చ పద్మాసంభూతా హ్యాదిత్యో భూద్యదా హరిః**
**యదాచ భార్గవో రామస్తథా భూద్ధారిణీ త్వయమ్**
**రాఘవత్వే భవత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని**
**అన్యేషు చావతారేషు విష్ణోరేషానపాయినీ**
**దేవాత్వే దేవ దే హేయమ్ మనుష్యత్వే చ మానుషీ**
**విష్ణుర్దేహానురూపాం వైకరోత్యేషాత్మానస్తనుమ్ ॥”**

భృగు మహాముని ఇంట్లో పుట్టాక, క్షీరాబ్దిలో పుట్టిన శ్రీలక్ష్మి, దేవదానవుల క్షీర సాగరమథనంలో శ్రీహరిని అనుసరించింది. అంతేకాదు. దాని తర్వాత స్వామి ఎన్నిసార్లు భూమండలంమీద అవతరాలెత్తినా ఆయనను అనుసరించింది. శ్రీహరి వామనావతారం ఎత్తితే, ఆమె పద్మగానూ, శ్రీహరి పరశురామునిగా అవతరిస్తే, ఆ తల్లి హరిణిగానూ జన్మనెత్తింది. అదేవిధంగా, స్వామి శ్రీకృష్ణునిగా అవతరిస్తే, లక్ష్మీదేవి రుక్మిణిగా అవతరించింది. ఇలా స్వామి ఎత్తిన అన్ని అవతారాల్లోనూ శ్రీహరిని వీడక ఆమె అతని



భాగస్వామినిగా ఉండింది. అందుకే భక్తుడు ‘శ్రీ’ అంటే లక్ష్మిని స్వామికి ‘నిత్యాశ్రిత’ అని స్తోత్రం చేయడం జరిగింది. గొప్ప తల్లియైన ఆమె స్వామి భక్తులందరి కష్టాలను గమనిస్తుంటుంది. వాటిని తొలగించి ముక్తినొందే విధంగా భక్తుల తరపున వేడి స్వామివారి అనుగ్రహాన్ని భక్తులపై కలిగేలా చూస్తుంది. స్వామి గుణగణాల నెన్నలేము. శ్రీమహాలక్ష్మిలా శ్రీహరి కూడా శుభలక్షణ లక్షితుడు. వారి మేలు కలయికవల్ల స్వామి పాదాలను ఆశ్రయించే భక్తులకు వారిరువురి కృపాకటాక్షవీక్షణాలూ సులభతరమవుతాయి. అందువల్ల భక్తుడు తన అహంకారంతోబాటు సర్వాన్నీ త్యజించి తాను కేవలం స్వామికే సేవకుడనీ, వేరెవ్వరికీ కాదనీ, ఆఖరికి తనకు తానుగా కూడా సేవకుడుగా ఆలోచించననీ చెప్పడం జరిగింది. ఇది అందరికీ అనుసరణీయం.

ఈ శ్లోకంలో స్వామిని వృషగిరీశా అని సంబోధించడం కనపడుతుంది. వేంకటాద్రికి ఉన్న ఎన్నోపేర్లలో ‘వృషగిరి’ అనే పేరును ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. వైవస్వత మన్వంతరంతో ధర్మదేవత ఈ గిరిపై తపస్సు చేయడం జరిగింది. ధర్మానికి ‘వృష’ అని మరో పేరుంది. ‘వృష’ తపస్సు చేసిన ‘గిరి’ కాబట్టి వేంకటాద్రి ‘వృషగిరి’ అయ్యింది. వరాహావతారంలో స్వామి ధర్మదేవతకు ఈ గిరిపై ప్రత్యక్షమై, “ఓ ధర్మమా! ఈ గిరిపై నీ తపస్సువల్ల భూప్రపంచంలో ధర్మం వర్ధిల్లింది. అందువల్ల ఈ గిరికి వృషగిరి అనే పేరు సార్థకమౌతుంది!” అని చెప్పడం వల్ల ఈ వేంకటాద్రి ధర్మానికి ప్రతీకగా నిలిచింది. లేకుంటే స్వామి ‘అర్చామూర్తి’గా ఇక్కడే ఎందుకు వెలిసినట్టు? అందువల్ల ఈ కొండకు వృషగిరి అనే పేరు సార్థకమైంది. వేదాంతదేశికులు వ్రాసిన దయాశతకంలోని 108 శ్లోకాల్లో ఈ పేరు 69 సార్లు ప్రస్తావించడం గురించి మనం ఇదివరకే చెప్పుకొన్నాం. చింతామణిగిరి పేరు 30 సార్లు, అంజనగిరి పేరు 4 సార్లు, వృషభగిరి పేరు 2 సార్లు, మృగపతిగిరి,

నారాయణగిరి, లక్ష్మీధర అనే పేర్లు ఒక్కోసారి చెప్పడం జరిగింది. వీటిలో వృషగిరి, వృషభగిరి అనే రెండు పేర్లూ 'ధర్మాన్ని' తెలియజేస్తాయి. శ్రీవేంకటేశ్వరుని ఎవరైతే 'వృషగిరీశా' అంటూ తలుస్తారో, వారికి ధర్మాన్ని తప్పే ప్రసక్తే లేదు. స్వామి భక్తుల కోర్కెలు తీర్చే చింతామణి అనీ, ధర్మస్వరూపమనీ ఇక్కడ చెప్పడం జరిగింది. అంతేకాదు. స్తోత్రకారుడు తనను తాను ధర్మస్వరూపుడైన శ్రీవేంకటేశ్వరునికి సర్వస్వశరణాగతి చేసుకోవడం జరిగింది. నిజమైన భక్తుడు చేయాల్సిందదే.

ఇలా స్వామివారి పాదాలను శరణాగతి చేసిన తర్వాత 'శ్రీ' నివాసుడైన శ్రీ వేంకటేశుని కీర్తిస్తూ, మంగళాశాసనాలు చేయడానికి ఉపక్రమించడం మనం గమనించవచ్చు.

**శ్రీవేంకటేశ్వర ప్రపత్తి సంపూర్ణం.**

* * *

# మంగళాశాసనం

మంగళ స్వరూపుడైన శ్రీవేంకటేశ్వరుడు ఈ విశ్వానికి శుభాన్నీ, సంతోషాన్నీ ఇచ్చేవాడు. ఆయన ప్రసన్నంగా ఉంటేనే ఈ విశ్వం కూడా సుఖంగా ఉంటుంది. అందువల్ల స్వామి చైతన్యం సదా మనలో, మనతో, మన ద్వారా, మన చేత, మన కోసం క్షేమంగా, అఖండంగా ఉండాలని మనసారా ఆ స్వామిని కోరుకోవాలి. అందుకే సుప్రభాతం పాడాక, ఏ స్వామి పాదాలనైతే పరిపూర్ణంగా శరణువేడటం జరిగిందో, ఆ స్వామికి శుభం కలగాలని మనస్ఫూర్తిగా వేడుకొంటూ స్వామివారికి మంగళశాసనాలర్పించడంవల్ల దీనికి 'శ్రీవేంకటేశ్వర మంగళాశాసనం' అని పేరు. ఇవి స్వామికి నిజమైన మంగళాశాసనాలు. భక్తుడు అర్పించే మంగళ నీరాజనాలు.

**1. శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్ ।**
**శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

"ఓ లక్ష్మీపతీ, సమస్త శుభాలకు గని వంటివాడా! ప్రార్థించేవారికి నిధివంటివాడా! శ్రీవేంకటాచలపతీ! ఓ శ్రీనివాసా! నీకు మంగళమగుగాక!"

స్వామికి మంగళాశాసనాలను ప్రారంభిస్తూ, ఈ శ్లోకం స్వామిని లక్ష్మీపతిగా సంబోధిస్తున్నది. ఎందుకంటే సకల శుభాలకూ, సకల సంపదలకూ నిలయం శ్రీమహాలక్ష్మి. ఆమె శ్రీవేంకటేశ్వరుని వక్షఃస్థలంలో నివసిస్తున్నది. కాబట్టే మనం స్వామిని వేడినపుడు సకల శుభాలూ, సంపదలూ మనకు లభిస్తున్నాయి. అందువల్ల సకల సంపదలకూ, శుభాలకూ ఆదిమూలమైన లక్ష్మీదేవి సహితమైన స్వామి ప్రార్థించే వారి పాలిటి నిధి, పెన్నిధి కూడా. సిరిసంపదలకు ఆలవాలమైన లక్ష్మి స్వామిలో శాశ్వత

నివాసిగా ఉంది కాబట్టే, స్వామి సకల సంపదలనూ ఇట్టే మనకు అనుగ్రహిస్తాడు. నిజం చెప్పాలంటే, స్వామికోసం ఎలాటి మంత్రాన్నైనా, ప్రార్థననైనా చేసేటపుడు ఆయన్ని స్తుతించడంతోబాటు లక్ష్మీదేవినీ స్తుతించాలి. అపుడే ఆ ప్రార్థనకీ, మంత్రానికీ సార్థకత. నారాయణ హృదయాన్ని పఠించేటపుడు, దానితోబాటు లక్ష్మీ హృదయాన్ని పఠిస్తేనే స్వామిని ప్రసన్నం చేసుకోగలం. అందుకే ఇలా అన్నారు :

**"నారాయణస్య హృదయం సర్వాభీష్ట ఫలప్రదం**
**లక్ష్మీ హృదయకం స్తోత్రం యదిచైతద్వినాకృతమ్**
**తత్సర్వం నిష్ఫలం స్తోత్రం లక్ష్మీః కృత్యాది సర్వదా**
**ఏతత్ సంకలితం స్తోత్రం సర్వాభీష్ట ఫలప్రదమ్**
**జపేత్సంకలితం కృత్వా సర్వాభీష్ట మవాప్నుయాత్**
**నారాయణస్య హృదయ మాదౌ జప్త్వా తతఃపరమ్**
**లక్ష్మీహృదయకం స్తోత్రం జపేన్నారాయణం పునః**
**పునర్నారాయణం జప్త్వా పునర్లక్ష్మీ హృదయం జపేత్ ॥"**

అన్నిటినీ ప్రసాదించే నారాయణహృదయాన్ని, లక్ష్మీహృదయం పఠించకుండా, పఠిస్తే నిష్ఫలమవుతుంది. నారాయణ హృదయంతోబాటు లక్ష్మీ హృదయాన్ని కూడా నిష్ఠతో పఠించాలి. అపుడే మనం కోరుకున్నవి లభిస్తాయి. మొదట నారాయణహృదయాన్ని పఠించి, తర్వాత లక్ష్మీహృదయాన్ని పఠించాలి. ఆ తర్వత మళ్ళీ నారాయణహృదయాన్నీ, లక్ష్మీహృదయాన్నీ పఠించాలి. అంటే, ఒక దాని వెంట ఒకటి ఈ హృదయ స్తోత్రాలను రెండుసార్లు పఠించాలన్న మాట. ఈ సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకొనే 'శ్రీవేంకటేశ మంగళాశాసనం' వ్రాశారు. 'శ్రీ' ప్రస్తావన లేకుండా వేంకటేశుని తలిస్తే ప్రయోజనం లేదు. అందుకే, స్వామిని శ్రీపతిగా, శ్రీనివాసునిగా, శ్రీవేంకటేశుని మనం తెలియాలి. అపుడే స్వామి దయాదృష్టి మనమీద పడుతుంది. సకల గుణాలకూ, సంపదలకూ పుట్టిల్లు శ్రీలక్ష్మి. ఆమెతో కూడిన వేంకటేశుడే పరిపూర్ణంగా మనలను అనుగ్రహించగలడు. అందువల్ల శ్రీకాంతునిగా స్వామిని తెలిసి, శరణాగతి పొందిన భక్తుడే యుక్తుడు. ఆ భక్తునికే సకల సంపదలూ, శుభాలూ లభిస్తాయి.



వరాహపురాణంలోని 38వ అధ్యాయంలో స్వామి భక్తుడైన ఆత్మారాముని ఇతివృత్తం ఉంది. దాన్ని ఇక్కడ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆత్మారాముడు అనే స్వామి భక్తుడు తన తండ్రి పరమపదించాక, సర్వాన్నీ కోల్పోయి నిరుపేద అవుతాడు. స్వామిని సేవించగోరి కపిలతీర్థంలో స్నానం చేసి శ్రీవేంకటాద్రిని చేరాడు. దారిలో వున్న ఒక గుహలో సనత్కుమారమహర్షిని దర్శించాడు. సనత్కుమారమహర్షి సాక్షాత్తూ పరమశివునికే వరాన్నిచ్చినవాడు. అంతటి గొప్ప మహర్షిని కలిసిన ఆత్మారాముడు తనకు సాయం చేయమనీ, తనకు సమస్యల నుంచీ విముక్తి గావించమనీ ప్రార్థించాడు. అపుడా మహర్షి "నాయనా! గత జన్మలో నీవు చేసిన దుష్కర్మలే ఈ జన్మలో నిన్నిలా బాధిస్తున్నాయి. విష్ణుపూజను నీవు సరిగ్గా నిర్వర్తించలేదు. నీ కొక ఉపాయాన్ని చెబుతాను. లక్ష్మీవల్లభుడు శ్రీహరి. అందువల్ల స్వామితోబాటు, ఈ విశ్వానికే తల్లియైన శ్రీలక్ష్మినీ సేవించు. నీకొక వ్యూహమంత్రాన్ని బోధిస్తాను. తద్వారా నీవు ఆమెను ధ్యానిస్తే నీ కోర్కెలన్నీ తీరతాయి" అని చెప్పాడు.

శ్రీ వేంకటాద్రి చేరిన ఆత్మరాముడు స్వామిపుష్కరిణీ స్నానమాచరించి ప్రార్థన చేయగానే, వేంకటేశుడతనికి శ్రీ, భూ సహితంగా గోచరించి, "భక్తా! విచారించకు. నీ కిక భయం లేదు. నీ పాపాలన్నీ తొలగిపోయాయి. నీకు దీర్ఘాయుష్షుతోబాటు అనేక సంపదలను ప్రసాదిస్తున్నాను!" అని పలికాడు.

ఆత్మారాముని ఆనందానికి అంతే లేకపోయింది. తిరుమల కొండనుంచి దిగువ తిరుపతిలోనే నివాసాన్ని ఏర్పరచుకొన్నాడు. వేంకటాద్రికి దగ్గరగా ఉంటూ సకల సంపదలతో ఓలలాడుతూ సుఖంగా ఉండిపోయాడు.

దీనివల్ల మనకేం తెలిసిందంటే, స్వామిని మహాలక్ష్మీ సమేతంగానే ప్రార్థించాలి. అపుడే మనకు 'శ్రీ'నివాసుడైన వేంకటేశుడు సుప్రసన్నమౌతాడు. శ్రీనివాసుడు కోర్కెలను తీర్చేటి 'ఖని' వంటివాడు. శరణన్నవారికి, కొంగుబంగారమై నిలుస్తాడు. 'శ్రీనివాస', 'శ్రియః కాంత' అనే పదాలు చాలా శక్తిమంతమైనవీ, అనుగ్రహ పూర్వకమైనవీ, అంతులేని సంపదలను ఇచ్చేవీ కూడా. అలాగే, 'వేంకట' అనే పదం కూడా పరమ పవిత్రమైనదీ, శక్తిమంతమైనదీనూ. 'వేంకట' అనేది మనం చేసిన పాపాలన్నిటినీ నాశనం చేసేది. మనకు శాశ్వతతాన్ని ప్రసాదించేదీ అదే. వేంకటమనేది 'శ్రీ'నివాసుడూ, 'శ్రియఃపతి' యైన శ్రీహరి నివాసం కావడంవల్లే దానికింత మహత్తు లభించింది.

**2. లక్ష్మీ సవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే ।**
**చక్షుషే సర్వలోకానాం వేంకటేశాయ మంగళమ్ ॥**

"శ్రీలక్ష్మిని ఆశ్చర్యంగా, విలాసంగా చూచే అందమైన కనుబొమలతో కూడిన కళ్ళున్నవాడూ, సకలలోకాలకూ కనులైనవాడూ ఐన శ్రీవేంకటేశునకు మంగళమగుగాక!"

శ్రీదేవి సౌందర్యానికీ, ఆకర్షణకీ ఆనందభరితుడైన శ్రీహరి ఆమెను ఓరకంటితో విలాసంగా చూస్తున్నాడు. అట్టి శ్రీవేంకటేశ్వరుని ధ్యానిస్తున్నాడు భక్తుడు. శ్రీదేవి అందం వర్ణింపలేనిది. ఆమె 'హిరణ్యా వర్ణ' – బంగారువన్నె గలది. ఆమె ఆకర్షణ ఎంతో గొప్పది. ఇక్కడ చిత్రించిన సన్నివేశమెంతో



పరమానందకరమైనది. ఈ సందర్భంలో లక్ష్మీ హృదయస్తోత్రంలోని కింది వర్ణనను గుర్తు తెచ్చుకోవాలి :

**"ధ్యాయేల్లక్ష్మీం ప్రహసిత ముఖీం కోటి బాలార్కభాసాం**
**విద్యుద్వర్ణాంబర వరధారాం భూషణాఢ్యాం సుశోభాం**
**బీజాపూరం సరసిజయుగం బిభ్రతీం స్వర్ణపాత్రం**
**భర్త్రాయుక్తామ్ ముహురభయదాం మహ్యమప్యచ్యుత శ్రీమ్ ॥"**

అత్యంత ప్రసన్నవదనంతో, కోటిసూర్యప్రభల తేజంతో, బంగారు వన్నెతో, వేడిమి లేకుండా, మెరిసే దుస్తులతో, కన్నులు మిరుమిట్లు గొలిపే దివ్యాభరణాలు ధరించిన పద్మాలనూ, బంగారుపాత్రనూ చేతబట్టిన శ్రీలక్ష్మిని కళ్లముందు ఆవిష్కరించుకోవాలి. ఆమెతో శ్రీహరిని కూడా మనస్సులో ఊహించుకోవాలి. శ్రీదేవి దివ్య సౌందర్యమనేది స్వామిని సంభ్రమానికి గురి చేయడంవల్ల, ఆయన ఆమెవైపు విలాసంగా చూస్తుంటాడు. ఆ సన్నివేశం వర్ణింపజాలనిది. ఆమె కన్నుల కాంతులకు మంగళం ఇది :

**"యథారసస్పర్శనఽతోయసోఽపి**
**సువర్ణతాస్యాత్కమలే తథాతే**
**కటాక్ష సంస్పర్శనతో జనానాం**
**అమంగళానామసి మంగళత్వమ్!"**

"ఓ తల్లీ! లక్ష్మీదేవీ! కేవలం పాదరస స్పర్శతోనే ఇనుము బంగారమయ్యేలాగా, నీ చూపులు పడినంత మాత్రానే జీవులకు ఆపదలు తొలగిపోతాయి." – కాబట్టి నాపై నీ చూపులను ప్రసరింపజేయి! అంటూ ఈ శ్లోకంలో ప్రార్థించడం జరిగింది.

శ్రీలక్ష్మిని ఓరకంటితో, విలాసంగా, శ్రీహరి తన దృష్టిని మరల్చకుండా ప్రకాశవంతమైన ఆమె చూపులనే చూస్తూన్నాడట. కరుణతో నిండిన ఆ తల్లి చూపులు సకల సౌభాగ్యాలనీ ఇస్తాయి. ఆ ప్రకాశవంతమైన, శక్తివంతమైన చూపులకు కారణుడైన శ్రీహరే ఆ చూపులకు ఆకర్షితుడైనాడు.

**3. శ్రీ వేంకటాద్రి శృంగాగ్రమంగళాభరణాంఘ్రయే ।**
**మంగళానాం నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

"శ్రీ వేంకటాద్రి శిఖరాగ్రాలకు మంగళకరమైన ఆభరణాలుగా నిలిచే పాదాలున్నవాడూ, సకల శుభాలకూ నిలయమైనవాడూ అయిన శ్రీనివాసునకు మంగళమగుగాక!"

శ్రీనివాసుడు శ్రీవేంకటాద్రి శిఖరాగ్రం మీద పాదాలు మోపడంవల్ల ఆ వేంకటాద్రి పునీతమైంది. స్వామివారు ఆ కొండ శిఖరాన నిలిచి ఉండటంవల్ల వేంకటాద్రి ఎంతో పవిత్రమైనదీ, శుభప్రదమైనదీ కూడా. సకల శుభగుణనిధీ, 'శ్రీ'కి నివాస స్థానమైనవాడు శ్రీనివాసుడు. లక్ష్మీదేవి 'సర్వమంగళ సంపూర్ణ', ఆమె 'సర్వైశ్వర్య సమన్విత' – సకలమంగళ సంపూర్ణురాలైన ఆమె సకల సంపదలకూ, సుఖసంతోషాలకూ నిధివంటిది. తనకు భక్తితో, విశ్వాసంతో శ్రద్ధగా శరణాగతి చేసి కొలిచే భక్తులకు ఆమె సకల సంపదలనూ, సుఖసంతోషాలనూ, శుభాలనూ కలుగజేస్తుంది. ఆ మహాలక్ష్మిని శ్రీవేంకటేశుడు తన వక్షఃస్థలంలో నిలుపుకోవడం వల్ల స్వామి కూడా సర్వమంగళకారకుడైనాడు.

ఇలా శాశ్వతంగా వేంకటాద్రిపై వెలసిన స్వామిని భక్తులకు సదా శుభాలను ఇవ్వాలని ఈ మంగళాశాసన శ్లోకం కోరుకుంటున్నది. శ్రీనివాసుడు ఈ కొండ పై వెలిసేదాకా ఈ వేంకటాద్రి అంత ప్రాచుర్యంలోకి రాలేదు. స్వామి ఈ వేంకటాద్రి శిఖరాగ్రాన తనపాదాలను మోపడంతో



వేంకటాద్రి పునీతమైంది. స్వామి వేంకటాద్రి వాసుడవటంవల్లే వేంకటాద్రి మహిమాన్వితమైంది. వేంకటాద్రి మించిన స్థానం ఈ బ్రహ్మాండంలో మరొకటిలేదు. అంతేకాదు, శ్రీవేంకటేశ్వరుని మించిన దైవం కూడా ఈ బ్రహ్మాండంలో వేరొకరు లేరు.

**4. సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్ ।**
**సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥**

"తనకున్న అన్ని అవయవాల సౌందర్యంతో సకల జనులనూ సమ్మోహన పరిచే శ్రీవేంకటేశునికి మంగళమగు గాక!"

శ్రీ దేవుని రూపం సమ్మోహనకరం. చూచినంతనే ప్రేమించాలని పించేంతటి శక్తిగలది. దర్శన మాత్రానే ఆకర్షిస్తుంది ఆ రూపం. శ్రీహరి రూపం ఎంతగొప్పదీ అంటే, పరమశివుడే ఆ సుందరరూపాన్ని చూచి ఆకర్షింపబడినాడు. చూడ చక్కని మోహనరూపం అది. అందరి కళ్లూ ఆ రూపం మీదే ఉంటాయి. అందుకే దాన్ని 'పదికోట్ల భావజ రూపం' అన్నాడు అన్నమయ్య. శ్రీవేంకటేశుని అర్చామూర్తిని చూడగనే ఆ దివ్యమంగళ సుందరరూపం మనల్ని ఇట్టే ఆకర్షిస్తుంది. క్షణమాత్రమైనా ఆ మూర్తిపై నుండి దృష్టిని పక్కకు మరల్చలేం. మనల్ని ఆజ్ఞాపిస్తున్నట్లుగా, మనల్ని పరవశింప జేస్తున్నట్లుగా ఉంటుంది ఆ స్వామిరూపం. ఆ స్వామి విగ్రహం ముందునుంచి ఎవరికీ వదిలి రావాలనిపించదు. ఆ ఆధ్యాత్మిక ఖనిని వదిలి బయటకు రావాలనిపించదు. బలవంతంగా మనలను స్వామి గర్భగుడిలోంచి బయటకు పంపవలసిందే. లేకుంటే, ఇతర భక్తులకు స్వామి దర్శనమెలా దొరుకుతుందీ? ఈ అర్చామూర్తి దివ్యమంగళ రూపం క్షణక్షణానికీ కొంగొత్త అందాలతో కాంతులు వెదజల్లుతుంటుంది. అందుకే గాబోలు, మహాభక్తుడైన త్యాగయ్య "వేంకటేశ నిన్ను చూడ వేయి కన్నులు

చాలవురా” అని కీర్తించాడు. స్వామి దివ్యవిగ్రహాన్ని చూడాలంటే వెయ్యి కళ్లు చాలవు. నిజమే. లేకపోతే ఆ మూర్తి అర్చామూర్తెలా అవుతుందీ? దివ్యమంగళ విగ్రహమెలా అవుతుందీ? మనం అసలు చూడలేం కూడా. ఏ యోగవిద్యో మంత్రవిద్యో కావాల్సిందే. లేదంటే, ఏ దివ్య చక్షువులో అవసరమవుతాయి. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునితో “దివ్యం దదామి తే చక్షుః” అన్నాడు. ఎందుకంటే, శ్రీకృష్ణుడు తన విశ్వరూపం చూపితే అర్జునుడు దాన్ని చూడలేకపోయాడు. అపుడు “స్వామీ, నీ దివ్యరూపాన్ని చూసే భాగ్యాన్ని ప్రసాదించు!” అని అర్జునుడు వేడితే, స్వామి “ఇదిగో, నీకు దివ్యనేత్రాలు ప్రసాదిస్తున్నాను. నా దివ్యమంగళరూపాన్ని చూడు!” అన్నాడు. ఆ దివ్యమంగళ రూపాన్ని చూసిన అర్జునుడు ఇలా చెప్పాడు :

**“అదృష్ట పూర్వం హృషితోఽస్మి దృష్ట్వా**
**భయేన చ ప్రవ్యథితం మనో మే**
**తదేవ మే దర్శ్య దేవరూపం**
**ప్రసీద దేవేశ జగన్నివాస ।**

**కిరీటినం గదినం చక్రహస్తం**
**ఇచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ**
**తేనైవ రూపేణ చతుర్భుజేన**
**సహస్రబాహో! భవ విశ్వమూర్తే!”**

అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా చెప్పాడు : “దేవదేవా! ఇంతవరకూ నేను గానీ, వేరెవరు గానీ కనీ వినీ ఎరుగని అపూర్వదృశ్యాలను ఇపుడు చూసి సంతోషించాను. ఐతే, భయంతో నా మనస్సు అలజడి చెందుతోంది.



అందువల్ల నాకు ప్రసన్నుడవై, నీ పూర్వరూపాన్ని చూపించు. కరుణ జూపించు తండ్రీ! సహస్రబాహుడవైన ఓ విశ్వరూపా! నీ పూర్వరూపాన్ని చూపించు. తలపై కిరీటంతో, చేతుల్లో శంఖచక్రాది ఆయుధాలతో కూడిన నీ మానుషరూపాన్ని చూడగోరుతున్నాను. కాబట్టి నీవు చతుర్భుజ రూపునిగా కనిపించు.”

అందువల్ల, అందమైన స్వామి దివ్యరూపాన్ని చూడాలన్నా మనకు దివ్యనేత్రాలు కావల్సిందే. లేకపోతే ఆ అర్చామూర్తి తేజస్సును తట్టుకోవడం చాలా కష్టం. అచేతనాలకే చైతన్యాన్ని ఆరోపించే ఆ స్వామి అలంకారం వర్ణనాతీతమైంది. ఎందుకంటే, ‘సత్యం, శివం, సుందరం’ అతడే. సత్యమూ, పుణ్యప్రదమూ, సుందరమూ – శ్రీవేంకటేశుడే.

**5. నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే ।**
**సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥**

“నాశమే లేనివాడూ, దోషరహితుడూ, సచ్చిదానంద స్వరూపుడూ, సమస్తానికీ అంతరాత్మయైన శ్రీవేంకటేశ్వరస్వామికి మంగళమగు గాక!”

సర్వోత్కృష్టమైన స్వామి గుణాలను ఈ శ్లోకంలో ప్రస్తావించడం జరిగింది. కాలచక్ర ప్రభావానికి అతీతుడైనవాడు శ్రీహరి. ఆయనే కాలానికి అధిపతి. ఆయనే దాని సృష్టికర్త. ఈ విషయాన్ని భగవద్గీతలో ‘కాలోస్మి’ అని చెప్పనే చెప్పాడు. అతడే సత్, చిత్, ఆనందం. శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో మూడవ అధ్యాయం లో దేవశర్మ, తన ప్రార్థనలో ఇలా చెప్పాడు :

**“సత్యేశం సత్యసంకల్పం సత్యం సత్యవ్రత హరిం ।**
**సత్యచర్యం సత్యయోనిం సత్యశీర్ష మహంభజే ॥”**

అతడే సత్యానికి అధిపతి, సంకల్ప శక్తీ, నిత్యసత్యుడూ కూడా. సత్యవర్తన కారణుడూ, సత్యానికి మూలమూ, కిరీటమూ, శీర్షమూ – అన్నీ అతడే. అందరి హృదయాల్లోనూ అతడే ఉన్నాడు. అతడు సర్వాంతర్యామి. భగవద్గీతలో ఈ విషయాన్ని స్వామి స్వయంగా ఇలా చెప్పాడు :

**"అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయ స్థితః ।"**

"అన్ని జీవరాసులందూ నివసించే ఆత్మ నేనే!" అని దీని అర్థం. అలాగే,

**"సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్"**

అనీ చెప్పాడు. అంటే, "సకల భూతాలలోనూ అంతరాత్మనై పక్షపాత రహితుడనై సమంగా నెలకొనియున్నాను" అని అర్థం. ఇంకో విషయం కూడా చెప్పాడు:

**"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేஉర్జున । తిష్ఠతి ।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ।"**

ఈ సృష్టిలోని సకల జీవరాసుల హృదయాల్లో ఆ దేవదేవుడైన నారాయణుడే ఉన్నాడు. ఆయన ఆడించే నాటకంలోని సంసారచక్రంలో నలిగే జీవులను నియంత్రించేది ఆయనే. ఈ మాటలు ఆ నారాయణుడే నరుడికి చెప్పాడు. కాబట్టి ఇక దాని గూర్చి వివాదమే లేదు. సత్యత్వం, సర్వజ్ఞత, సర్వవ్యాప్తి సర్వశక్తత, ఆద్యంతాల్లేకపోవడం, నిత్యమైందీ, పావనమైందీ – మొదలైన దైవాంశగుణాలను ఉపనిషత్తులెపుడో వర్ణించాయి. వైకుంఠంనుంచి దిగివచ్చి శ్రీవేంకటాద్రిపై వెలిసిన దేవుడు శ్రీవేంకటేశ్వరుడు. ఉపనిషత్తులు చెప్పిన దైవాంశ గుణాలన్నీ పుణికిపుచ్చుకొని పురుషోత్తముడైన స్వామి, ఈ కలియుగంలో మానవాళిని రక్షించి, ఉద్ధరించడానికి శ్రీవేంకటాద్రిపై వెలిశాడు.



**6. స్వతస్సర్వవిదే సర్వశక్తయే సర్వశేషిణే ।**
**సులభాయ సుశీలాయ వేంకటేశాయ మంగళమ్ ॥**

"తనకై తానే సర్వాన్నీ తెలుసుకొన్న సమస్త శక్తిసంపన్నుడూ, సమస్తానికీ ప్రధానుడై సులభంగా పొందే వీలున్నవాడూ సచ్ఛీలుడూ అయిన శ్రీవేంకటేశ్వరుడికి మంగళమగు గాక!"

శ్రీవేంకటేశుని బ్రహ్మానందకరమైన గుణగణాలను ఈ శ్లోకం ఉదాహరిస్తున్నది. స్వామి భక్తసులభుడు. సులభంగా అనుగ్రహిస్తాడు. అసలు, భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ విషయాన్నెప్పుడో చెప్పాడు. "అన్నిటినీ వదిలేసి నీ మనస్సును నాపై శ్రద్ధగా నిలుపు. నీ బుద్ధిని నాపైని ఆలోచనలపై మరల్చు. అపుడు నీవు తప్పక పురోగతి చెందుతావు. ఒకవేళ నీ మనస్సును దృఢంగా నాపై నిలపలేకపోతే, కనీసం యోగసాధన ద్వారా నన్ను చేరే ప్రయత్నం చేయి. అలా కూడా చేయలేని పక్షంలో నీవు మనస్ఫూర్తిగా నాకు అంకితమై నీవు చేసే ప్రతి పనినీ నాపై భారం వేసి, ప్రతిఫలం ఆశించకుండా చిత్తశుద్ధిగా చేస్తే కూడా చాలు. నీవు చేసే కర్మలన్నిటికీ నేనే కారణభూతుడని తెల్సుకో. ఇవేవీ చేయలేక పోతే, నీవు చేసే పనుల ఫలితాలపై ఎలాటి ఆశలు పెట్టుకోక, కేవలం నా శరణాగతితో చేయి. అపుడు నన్నే పొందగలవు." అంటూ శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించి, బలహీనులూ, చంచల మనస్కులూ సైతం తనను పొందే సులభమార్గాన్ని కూడా చెప్పాడు.

"ధర్మాలన్నింటినీ వదిలి కేవలం నన్నే శరణు కోరినవారిని సకల పాప విముక్తుల్ని చేసి మోక్షాన్నిస్తాను. శోకించకు". అని భగవద్గీతలో ఆ శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన అమృతమయమైన వాక్కులను ఇక్కడ మరొక్కసారి గుర్తు చేసుకొందాం. అసలు "స్వామి ఎంత దయామయుడో? మనకెంత చేరువలో ఉన్నాడో?" – అన్న విషయాలెపుడైనా మనం ఆలోచించామా?

నిజానికి స్వామి సులభప్రసన్నుడు. ఆయనను సంతోష పెట్టడం చాలా సులభం. అతడు చైతన్యమూర్తి. భగవద్గీతలో విభూతియోగంలో చెప్పినట్లు సర్వప్రధానుడూ, ప్రాణులలో కెల్లా అత్యుత్తముడూ ఆయనే. ఆయన శ్రేష్ఠాతిశ్రేష్ఠమైనవాడు. ఈ మాటలను ఇన్నిసార్లు మనం చెప్పనక్కరలేదు. అసలు అందులో సందేహించాల్సిన అవసరమే లేదు.

**7. పరస్మై బ్రహ్మణే పూర్ణకామాయ పరమాత్మనే ।**
**ప్రయుంజే పరతత్త్వాయ వేంకటేశాయ మంగళమ్ ॥**

"పరబ్రహ్మస్వరూపుడూ, పూర్ణకాముడూ, ఎలాటి కోరికలూ లేనివాడూ, పరమాత్మ స్వరూపుడూ, పరతత్వమూర్తియైన శ్రీవేంకటేశునికి భక్తిపూర్వక మంగళాశాసనాలు చేస్తున్నాను."

సామాన్యజీవులను సమాధానపరచి వారికి స్వామి ఎవరో తెలియజేసే సత్యాన్ని బోధించడానికి శ్రీవేంకటేశుడు ఆ అవతారమూ, ఈ అవతారమూ అని చెబుతూంటారు. ఈ కలిలో ఒక్కొక్కరు ఒక్కోరీతిలో స్వామిని తెలిసి ఆ రీతిలో స్వామిని కొలుస్తారు. కొలవమని చెబుతారు. స్వామిని బాలాజీ అనీ, శక్తి స్వరూపియనీ, బాలాత్రిపురసుందరి అనీ వర్ణించారు. నిజానికి ప్రతిఏడూ స్వామికి జరిగే బ్రహ్మోత్సవాలు దేవీనవరాత్రులపుడే జరుగుతుంది. ఆళ్వార్లు స్వామిని స్థితి లయకారునిగా, హరిహరరూపంగా కీర్తించారు. స్వామిని దుర్గగా, నారాయణునిగా కూడా వర్ణించారు. ఇది యోగ మాయకు చెందిన విషయం.

ఏదెలా ఉన్నా, శ్రీవేంకటేశ్వరుని సప్తర్షులూ తమతమ రీతిలో భావించారు. "ఏకం సత్! విప్రా బహుధా వదంతి" – అని ఆర్యోక్తి. విషయం ఒక్కటే. ఐనా ఋషులూ, మహర్షులూ దాన్ని పలురీతుల్లో వివరించారు. దేవుడొక్కడే. రూపాలూ, పేర్లూ ఎన్నో. అతడే పరబ్రహ్మం. అతడే



లోకనాయకుడు. ఈ కలియుగంలో ఆ లోకనాయకుడెవరో కాదు. సాక్షాత్తూ, శ్రీవేంకటేశుడే! అందువల్ల స్వామిని ఈ రీతిలో సకల గుణాభిరామునిగా తెలియడం ఎంతో సముచితంగా ఉంది.

**8. అకాలతత్త్వమశ్రాంతమాత్మనామనుపశ్యతామ్ ।**
**అతృప్త్యమృతరూపాయ వేంకటేశాయ మంగళమ్ ॥**

"కాలతత్వాన్ని గమనించకుండా సదా తన దివ్య సుందరమూర్తిని దర్శించే వారికి తనివి తీరని అమృతంలాంటి వాడైన శ్రీవేంకటేశునికి మంగళమగు గాక!"

భగవన్నామస్మరణ చేయడంలో ఉండే నిజమైన తియ్యదనాన్ని ఈ శ్లోకంలో స్మరించడం జరిగింది. ఎవరైతే భక్తితో శ్రద్ధగా ఆ దేవునికి తనను తాను అర్పించుకొని శరణు పొందుతారో, వారికి ఆ స్వామినామంలోని తియ్యదనం తెలుస్తుంది. అది రామనామం కానీ లేదా కృష్ణనామం కానీండి. మహాభక్తులు అన్నమయ్య, భక్తరామదాసు, త్యాగరాజు ఈ విషయాన్ని తేటతెల్లం చేశారు. వారు భగవన్నామంలోని మకరందాన్ని గ్రోలి తరించారు. అంతేకాదు. వారు తరించిన మార్గాన్ని సామాన్యులకు తెలియాలనే తపనతో స్వామి గొప్పదనం గూర్చి ఎన్నో కీర్తనలు వ్రాసి ఆ విషయాన్ని ఆస్తికలోకానికి చాటి చెప్పారు కూడా. ఎంత తీవ్రంగా భగవన్నామస్మరణ చేస్తామో ఆ తియ్యదనం కూడా అంత ఎక్కువగా ఉంటుంది. అది చెరుకురసం కన్నా తియ్యగా ఉంటుంది.

పండ్ల నుంచి వచ్చే రసాలు ఇచ్చే తియ్యదనం తాత్కాలికమైంది. తద్వారా పొందే ఆనందంకూడా తాత్కాలికమే. అయితే, భగవన్నామ సంకీర్తన మనకు శాశ్వతానందాన్నీ, శాశ్వతమైన తియ్యదనాన్నీ ఇస్తుంది. భగవంతుని ప్రేమ అపారమైంది. ఆ భగవంతుని నామామృతాన్ని మనం శ్రద్ధగా గ్రోలితే,

ఆయన్నే పొందగలము. భగవద్గీతలోని శ్రీకృష్ణుడు అర్జునునికిలా చెప్పాడు: "నీ మనస్సును నాలో ఉంచు. నన్నే ధ్యానించు. నన్ను శరణుపొందు. అలా చేసినా నన్ను చేరగలవు. ఇది సత్యం. నీవు నాకు ప్రియుడివి. నీకు ప్రతిజ్ఞ చేసి మరీ చెప్తున్నాను."

భక్తుడు స్వామిని చేరాలంటే ఆ భగవన్నామస్మరణ అనేది అత్యుత్తమమైన సాధనమనే విషయాన్ని శ్రీకృష్ణుడు చాలా స్పష్టంగా చెప్పాడు. కేవలం భగవన్నాను సంకీర్తననే ఒక్క సాధనంతో మాత్రమే స్వామి కృపకు పాత్రులు కాగలము. అందువల్లే శాశ్వతమైన ఆయన నామామృతాన్ని మనకు గుర్తుచేస్తూ పదే పదే స్తుతించడం జరిగింది.

**9. ప్రాయః స్వచరణౌ పుంసాం శరణ్యత్వేన పాణినా ।**
**కృపయాదిశతే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥**

"జీవులందరికీ పరమ శరణ్యమని ఎపుడూ నీ పాదయుగళాన్ని నీ రెండు హస్తాలతో నిర్దేశించి చూపుతన్న శ్రీవేంకటేశ్వరా! నీకు నా భక్తిపూర్వక నమస్కారాలు. నీకు మంగళమగుగాక!"

శ్రీ కృష్ణుడు గీతలో "నన్ను నమ్మి కొలిచేవాడు నా వాడు" అని చెప్పాడు:

**"అనన్యాశ్చింత యంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥"**

"అనన్యమైన భావంతో ఎవరైతే నన్నే చింతిస్తూ నాయందే నిష్ఠ కల్గి నన్ను పరిపూర్ణంగా ఉపాసిస్తారో, అట్టివారి యోగక్షేమాలను నేనే వహిస్తాను" అని శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించాడు. శ్రీకృష్ణావతారంలో భగవంతుడైన శ్రీకృష్ణుడు ఏమాటలైతే ప్రవచించాడో, శ్రీవేంకటేశునిగా వెలసి కూడా అవే మాటలను, తన చేత్తో చూపుతూ, "నా పాదాల చెంత శరణువేడిన వారి సకల విషయాలూ నేనే చూసుకుంటా" నని మనకు చెబుతున్నాడు.



"నన్ను తలచినవాడు నా వాడు" అన్నదే శ్రీవేంకటేశ్వర శరణాగతి మహిమ. మానవుడిగా జన్మించాక తన మోక్షసాధన లక్ష్యాన్ని చేరాలంటే కేవలం భగవన్నామ సంకీర్తన ఒక్కటే శరణ్యం. ఆ స్వామినే నిత్యం ధ్యానిస్తూ, ఆయన కథలనే మనం శ్రద్ధగా పాడుతూ వుండాలి. నారదుడు వేదవ్యాసునికి చెప్పినట్లు "భగవంతుని కృపకు పాత్రులం కావాలంటే, ఆ స్వామి లీలలను పాడుకొంటూ మన మనస్సులోని మలినాలను కడిగేసుకోవాలి." మన పాపాలనుంచీ, ఈ ప్రాపంచిక విషయాలనుంచీ భగవన్నామసంకీర్తన ఒక్కటే మనల్ని రక్షిస్తుంది. శ్రీవేంకటేశుని పాదపద్మాలకు మ్రొక్కి, శరణువేడితే చాలు. స్వామి అభయమిచ్చినట్లే మనం ఆయన కృపకు పాత్రులం కాగలం. అందులో సందేహానికి తావే లేదు. నారదుడికి శ్రీహరే స్వయంగా ఇలా చెప్పాడు :

**"నాహం వసామి వైకుంఠే, న యోగి హృదయే రవౌ ।**
**మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద ॥"**

"నేను వైకుంఠంలోనో లేక సదా తపస్సులో మునిగి ఉండే యోగుల హృదయాల్లోనో ఉంటాననుకోవడం పొరపాటు. ఎవరైతే సదా నా నామస్మరణ చేస్తూ ఉంటారో, అలాటి నా భక్తుల హృదయాల్లో మాత్రమే ఉంటాను." అని చెప్పాడు.

అందువల్ల ఈ కలియుగంలో ఎవరైతే శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలచెంత మ్రొక్కి, ఆయనను శరణువేడి సదా ఆయన నామాన్ని స్మరిస్తూంటారో, అట్టివారు తప్పకుండా శ్రీవేంకటేశుని కృపకు పాత్రులు కాగలరు. అట్టివారిని ఆయన తప్పక రక్షిస్తాడు. స్వామి అర్చామూర్తి ఈ

గూఢార్థాన్ని చెప్పకనే చెబుతూ ఉంది. అందువల్ల ఆ విషయంలో సందేహానికి తావే లేదు. అదే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నదీ మంగళాశాసనశ్లోకం.

**10. దయాऽమృతతరంగిణ్యాస్తరంగై రివ శీతలైః ।**
**అపాంగై స్సించతే విశ్వం వేంకటేశాయ మంగళమ్ ॥**

"దయ అనే అమృతపు నదీ అలల్లాగా చల్లనైన తన చూపులతో సమస్త ప్రపంచాన్నీ చల్ల పరిచే శ్రీవేంకటేశ్వరా! నీకు మంగళమగుగాక!"

శ్రీవేంకటేశ్వరుడే ఈ విశ్వానికి కర్తయనీ, విశ్వాన్ని ధరించినవాడనీ, పాలించేవాడనీ, సప్తర్షుల్లో ఒకరైన జమదగ్ని మహర్షి తన శరణాగతి స్తోత్రంలో పేర్కొన్నారు. భగవంతుడికి భక్తులలోని తారతమ్యా లేవీ ఉండవు.

శ్రీవేంకటేశ్వరుడే భగవంతుడు. అందువల్ల, అర్చారూపంలో ఆయన మనకు సాక్షాత్కరించి ఒక రహస్య సందేశాన్నిస్తున్నాడు. అదేమంటే, ఆయన ఒక చేత్తో తన పాదాలు చూపుతూ, రెండో చేత్తో అభయాన్నిస్తున్నాడు. అంటే, ఒక చేత్తో 'రా! ఇదే నీవు శరణుకోరాల్సిన పాదాలు' అంటూ, రెండో చేత్తో 'నీకేం భయం లేదు! నన్ను శరణు అన్నావు కదా! నీకు పూర్తి రక్షణనిచ్చే బాధ్యత నాది!' అంటూ అభయాన్ని ఇస్తున్నాడు.

ఆయన దయాసముద్రుడు కావడంవల్లే ఈ మంగళశాసనశ్లోకంలో శ్రీవేంకటేశుని దయామృత నదీతరంగంగా భావించాడు సుప్రభాతకారుడు. శ్రీవేంకటేశ్వరుడే ఈ విశ్వాన్ని కాపాడేవాడు. అతని చూపులు దయతో నిండి ఉన్నాయి. ఈ కలియుగంలో శ్రీవేంకటేశుని సర్వస్య శరణాగతి చేసిన భక్తునికి ఆ స్వామినుంచి పరిపూర్ణమైన రక్షణ లభిస్తుంది. అది తథ్యం.

**11. స్రగ్భూషాంబర హేతీనాం సుషమాऽऽవహ మూర్తయే ।**
**సర్వార్తి శమనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥**



"శ్రీవేంకటేశ్వరుడు తాను ధరించిన పూలమాలలూ, ఆభరణాలూ, ఆయుధాలూ, పీతాంబరమూ – వీటన్నిటికీ పరమశోభను కల్గజేసే దివ్యమంగళ విగ్రహం కలవాడు. అన్ని పీడలనూ తొలగించేవాడు. ఆ స్వామికి మంగళమగు గాక!"

భగవంతుడు మనం ఏ రూపంలో కొలిస్తే ఆ రూపంలో మనల్ని రక్షిస్తాడు. సప్తర్షుల్లో ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఒక్కోరూపంలో శ్రీవేంకటేశుని కొలిచారు. భరద్వాజమహర్షి – శ్రీమహావిష్ణువూ, శ్రీవేంకటేశ్వరుడూ ఒకటేనని కొలిస్తే, విశ్వామిత్రమహర్షి – స్వామిని శ్రీమహావిష్ణువుగా, శ్రీరామునిగా కొలిచాడు. గౌతమమహర్షి – శ్రీ వేంకటేశుని గోవిందునిగా, ద్వాపరయుగంలో గోరక్షకుడైన శ్రీకృష్ణునిగా కొలిచాడు. జమదగ్నిమహర్షి జీవేశునిగా కీర్తించాడు. ఐతే, వశిష్ఠమహర్షి చెప్పినట్లు శ్రీవేంకటేశుడు అలాటి దేవుడూ ఇలాటి దేవుడు అని మనం చెప్పలేం. ఆయనే సమస్తం. అన్నిరూపాలూ శ్రీవేంకటేశునివే. ఆయన సర్వాంతర్యామి. ఆయనే శ్రీవేంకటేశ్వరుడు.

సర్వాభరణ భూషితుడై, పుష్పమాలాలంకృతుడై, సర్వాయుధాలూ ధరించి, సువర్ణాంబరాలను ధరించి మన కష్టాలనూ దుఃఖాలనూ తొలగించడానికే వెలిశాడు. ఆ స్వామిని పదేపదే కీర్తిస్తూ, ఈ మంగళాశాసన శ్లోకం ఆ స్వామికి మంగళమగుగాక! అంటూ మళ్ళీ స్వామి రూపాన్ని పొగడుతున్నది.

**12. శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే ।**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥**

"వైకుంఠంలో శ్రీలక్ష్మి లేకుండా తానొక్కడే ఉండలేక, స్వామి పుష్కరిణి గట్టుపై వెలసి లక్ష్మీదేవితో కూడి విలాసంగా క్రీడిస్తున్న శ్రీవేంకటేశునికి మంగళమగుగాక!"

స్త్రీ పురుష రూపాలు కలిస్తేనే సంపూర్ణమైన రూపం. 'శ్రీవేంకటేశ్వరా' అన్నా 'శ్రీవేంకటేశా' అన్నా, శ్రీమహాలక్ష్మితో కూడిన మహావిష్ణువు అనే అర్థం. శ్రీతో కూడిన వేంకటేశుడే పరిపూర్ణమైన కలియుగ ప్రత్యక్షదైవం.

భృగుమహర్షి పాదతాడనాన్ని భరించలేని శ్రీలక్ష్మి, శ్రీహరిపై కోపించి వైకుంఠాన్ని వీడి భూలోకం చేరింది. అయితే ఆ తల్లిని వైకుంఠంలోనే ఉంచాలని శ్రీహరి ఎంత ప్రయత్నం చేసినా ఆమె శాంతించ లేదు. అప్పుడు కూడా స్వామి తన అంతరంగంలోని భావాలను రహస్యంగా ఉంచాడు. శ్రీవేంకటేశ్వరునిగా ఆయన అవతరించాలి గనకే ఆ రహస్యాన్ని దాచాడు. వైకుంఠం వీడి భూలోకం చేరింది. లక్ష్మీదేవి లేని వైకుంఠంలో తానొక్కడే ఉండలేక శ్రీహరి, రమను చేరి పుష్కరిణీ తటాకంలో ఉండనారంభించాడు. పుష్కరిణీ తటంలో ఇద్దరు వెలిశారు గనకే, తిరుమలను కలియుగ వైకుంఠం అనడం ఎంతైనా సమంజసం.

**13. శ్రీమత్సుందర జామాతృముని మానసవాసినే ।**
**సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

"మణవాళ మహాముని మనస్సులోనూ, సమస్తలోకాల్లోనూ నివసించే శ్రీనివాసునకు మంగళమగు గాక!"

మంగళాశాసనాలర్పిస్తూ, సుప్రభాతకారుడు శ్రీనివాసుడికి మనస్ఫూర్తిగా తన ప్రణామాలు అర్పిస్తున్నాడు. విశ్వాత్మకుడైన శ్రీనివాసుడు తన గురువైన రమ్యజామాతృముని అనే మణవాళమహాముని హృదయాన్నే తన ఆలయంగా చేసుకొన్నాడనే విషయాన్ని ప్రస్తావిస్తూ – "తన గురువుగారి హృదయనివాసీ విశ్వాత్మకుడూ అయిన శ్రీవేంకటేశ్వరునికి తానుచేసే మంగళాశాసనాలు మరోసారి అర్పిస్తూ ముగిస్తున్నాను" అని తన నమ్రతను చాటుకొన్నాడు.



ఇక్కడ దేవుడొక్కడే అనే విషయాన్ని మరొక్కసారి చెప్పడం జరిగింది. ఏ పేరుతో పిలిచినా దేవుడొక్కడే. ఆయన సర్వాంతర్యామి. భక్తుల హృదయాల్లో శాశ్వత నివాసాన్ని ఏర్పాటు చేసుకొన్నవాడు. ఎందుకంటే, సృష్టికర్తా, సృష్టిభర్తా ఆయనే. ఈ జగత్తును నియంత్రించేదీ ఆయనే. దీన్ని గ్రహించే మణవాళముని స్వామిని కొలిచి ఆయన కృపకు పాత్రుడయ్యాడు. ఆ ముని శిష్యుడైన ప్రతివాది భయంకర అణ్ణన్, స్వామికి అత్యంత భక్తితో గావించిన మంగళాశాసనం. చివరగా ఒక విషయాన్ని భక్తులందరికీ గుర్తుచేస్తున్నాడు. తన పూర్వాచార్యులంతా శ్రీవేంకటేశుని కొలిచి ధన్యులయ్యారనీ, వారంతా పూజించిన శ్రీనివాసునికి మంగళమంటూ కింది శ్లోకంలో స్తుతిస్తున్నాడు.

**14. మంగళాశాసన పరైర్మదాచార్య పురోగమైః ।**
**సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥**

"స్వామికి మంగళపాఠాలు పఠించడంలో ఆసక్తులైన నా గురువులూ, వారి గురువులూ మొదలైన వారందరిచేతా పూజలందుకొన్న శ్రీనివాసునకు మంగళమగు గాక!"

సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం అనే నాలుగు విభాగాలుగా శ్రీవేంకటేశునికి తన ప్రభాత స్తోత్రాలను చేసిన భక్తుడు తన స్తోత్ర పఠనాన్ని తన గురువులను, వారిగురువులనూ కూడా స్మరించుకొంటూ, "ఏ గురువులైతే పూజించి ధన్యులయ్యారో, వారు ఎవరినైతే పూజించారో, ఆ దేవదేవుడైన శ్రీనివాసునికి మంగళమగుగాక!" అనడంలో స్వామి భక్త పరంపరను చెప్పకనే చెప్పినట్లైంది. మన మెవర్నైనా చూసినపుడు వారికి మనల్ని పరిచయం చేసుకొనేటపుడు ప్రవర (తన తండ్రి, తాత, ముత్తాతలెవరో, గోత్రాదులేమిటో చెప్పడమే ప్రవర) చెప్పాలి. ఇక్కడ, " స్వామిని కొల్చి

ధన్యులైన గురు పరంపరను పరిచయం చేస్తూ, వారంతా ఎవరిని కొలిచారో ఆ దైవాన్నే కొలుస్తూ ఆయనకు మంగళమగు గాక!" అని చెప్పడం జరిగింది. అంటే, మన కుటుంబంలో మన పూర్వీకులు, ఏ దైవాన్నైతే కొలిచారో, ఏ దైవాన్నైతే ఇంటి దైవంగా నిలిపి కొలిచారో, ఆ దైవాన్నే మనం కొలవాలి. మనం ఇంటిదైవాన్ని సదా కొలవాలనీ ఆ విషయం మర్చిపోకూడదనీ ఇక్కడ గుర్తుచేయడం జరిగింది. ఈ కలియుగంలో శ్రీవేంకటేశుడు కాక ఇంటి దైవం మరెవరుంటారు?

**మంగళాశాసనం సంపూర్ణం.**

* * *

# మంగళవాక్యాలు

శ్రీవేంకటేశ సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం అనే నాల్గు భాగాల ఈ స్తోత్రమంజరి కలియుగంలో సకలజనులకూ స్వామి అనుగ్రహాన్ని పొందడానికి ఒక ఉత్తమమైన, సులభమైన సాధనం. ఈ స్తోత్రాని కెంతో మహత్తు ఉంది. దీన్ని నిత్యమూ ఎవరైతే పఠిస్తారో, వారికి కలతలూ, దుఃఖాలూ, ఐహిక సమస్యలూ అదృశ్య మవుతాయి గాక! కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరుడు తన భక్తులను రక్షించుగాక!

ఈ వ్యాఖ్యానాన్ని శ్రీ వజ్ఝల శేషగిరిఅయ్యర్ వేంకటనారాయణ గారు వ్రాశారు. దానిని శ్రీవేంకటేశ్వరస్వామి ఆదేశానుగ్రహానుసారం వేంకట నారాయణగారి కనిష్ఠపుత్రుడు వజ్ఝల వేంకటనారాయణ వేంకటరమణ తెనిగించడం జరిగింది. ఈ ప్రయత్నంలో పొరబాట్లూ, తప్పులూ ఏవైనా జరిగి ఉంటే వాటిని దయతో మన్నించి, ఈ అల్పజీవినీ, ఈ వ్యాఖ్యానసహిత సుప్రభాతాన్ని పఠించిన వారందరినీ కూడా శ్రీవేంకటేశుడు ఆశీర్వదించుగాక!

**-: ఓం తత్సత్ :-**